www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 15-12-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 240 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి మ. 2.31 తదుపరి పాడ్యమి; నక్షత్రం: మృగశిర రా. 2.20 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: ఉ. 9.08-10.37; దుర్ముహూర్తం: సా. 4.11-4.55; అమృతఘడియలు: రా. 6.06-7.36; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 5.39 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కోరల్లేని ఏసీబీ!

అవినీతిపై యుద్ధంలో సైనికులు కరువు

- ఆరుగురు ఐపీఎస్‌లకుగాను ఒక్కరూ లేరు
- అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు.. నాన్ కేడర్ ఎస్పీ,ఏఎస్పీ, డీఎస్పీలకూ కొరత
- 60% పోస్టులు ఖాళీ..టోల్ ఫ్రీ నంబర్ లేదు
- నాడు ఇసుక, మద్యం, గనుల అవినీతి దందా
- అధికారుల పాత్రపైనా తీవ్ర అభియోగాలు
- కానీ, ఏసీబీ చేతులు కట్టేస్తున్న సిబ్బంది లేమి
- ఇకనైనా పట్టించుకోకుంటే పాత కేసుల విచారణా కష్టమే



ANTI-CORRUPTION BUREAU

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

యుద్ధం గట్టిగా చేయండి.. సైనికులను, టీమ్ లీడర్లను మాత్రం ఇవ్వం.. అంటే విజయం సంగతి దేవుడికి ఎరుక! అసలు బరిలో దిగడం సాధ్యమేనా? ఇప్పుడు రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) పరిస్థితి కూడా ఇదే. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేసి, దోపిడీ వ్యవస్థను మాత్రమే బలంగా నడిపించారు. భూగర్భంలో మైనింగ్, నదుల్లో ఇసుక, అడవిలో సంపద, మద్యంలో కమీషన్లు, రేషన్ బియ్యం అక్రమ

మిగతా 12వ పేజీలో...

చంద్రబాబు నాడు, నేడు, రేపు!



ఒక ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో నిరూపించిన జగన్ రెడ్డికి... తన హయాంలో జరిగిన అక్రమాలు, అరాచకాలు అన్నీ ఇప్పుడు చంద్రబాబు పాలనలో జరుగుతున్నట్టుగా కనిపిస్తున్నాయట!

జగన్ అండ్ కో వెనకేసుకు వస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆయనకు కిరాయి సైనికులుగా పనిచేసిన వారే. నిజానికి చంద్రబాబు ఇప్పటికీ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగానే విజయసాయి రెడ్డి వంటివారు నోరు పారేసుకోగలుగుతున్నారు.

చంద్రబాబులో ఉన్న ప్రధానమైన అవలక్షణం ఏవిటంటే, అధికారంలోకి రాగానే ఆయన రాజకీయం మరచిపోయి సీఈవో అవతారం ఎత్తుతారు.

రాష్ట్రాభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమేగానీ వాటి వల్ల ఓట్లు వస్తాయా లేదా అన్నది కూడా చూసుకోవాలి కదా! అందుకే ఈ ఐదేళ్లలో ఏం చెయ్యాలి, ఏం చేయగలమో చెప్పుకోవాలి.

చంద్రబాబు అద్భుతమైన విజన్ ఉన్న నాయకుడే, కాదనలేము. అయితే నాయకుడు అనేవాడు ప్రజలను తనతో పాటు నడిపించగలగాలి. ప్రజలను వదిలేసి వేగంగా ముందుకు పరిగెత్తకూడదు.

ముఖ్యమంత్రుల మెప్పు పొందడానికే అధికారులు పరిమితం అవుతారు. 'తల్లికి వందనం' అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని ఒక్క కలెక్టర్ కూడా చెప్పలేదే?

జగన్ రెడ్డి వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఏ కారణం వల్లనైనా అతను మళ్లీ బలపడి అధికారంలోకి వస్తే ఆ పాపం చంద్రబాబుదే అవుతుంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభలో చంద్రబాబు, వెంకయ్య నాయుడు, టీడీ జనార్దన్, నందమూరి రామకృష్ణ

ఇక సూటిగా.. సుత్తిలేకుండా!

- కలెక్టర్ల సదస్సు నమూనా మార్చేస్తాం 13
- ప్రశ్నలు-సమాధానాల పద్ధతిలో నిర్వహణ
- కలెక్టర్లు, ఎస్పీలకు ముందుగానే ఎజెండా: సీఎం

జమిలి ఎన్నికలు 2029లోనే: బాబు

కుటుంబ పాలనలో రాజ్యాంగ దుర్వినియోగం

- నెహ్రూ నుంచి నాలుగో తరం వరకూ అదేతీరు
- ఎమర్జెన్సీతో ఇందిర హక్కులనూ ఉల్లంఘించారు
- కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం రక్తం రుచి మరిగింది
- బీజేపీ తెచ్చిన సవరణలన్నీ మంచి కోసమే 2
- రాజ్యాంగంపై లోక్‌సభ చర్చలో ప్రధాని మోదీ

రాజ్యాంగాన్ని రక్షిస్తామని బీజేపీ చెప్పడమా?

- ఆ స్థానంలో మనుస్మృతి.. ఇదే సావర్కర్ ఉద్దేశం
- అందులో భారతీయతే లేదన్నది సంఘ్ భావన
- లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ధ్వజం

రేపు లోక్‌సభలో జమిలి ఎన్నికల బిల్లు!

పారాసిటమాల్‌తో జాగ్రత్త!

న్యూఢిల్లీ, డిసెంబరు 14: మన దేశంలో సాధారణంగా చాలామంది కాస్త జ్వరంగా అనిపించినా, నొప్పులు ఉన్నా పారాసిటమాల్ మాత్రను వాడుతుంటారు. వైద్య నిపుణులు ఇన్నాళ్లూ దీన్ని ప్రభావవంతమైన, సురక్షితమైన ఔషధంగా పరిగణించారు. అయితే, వృద్ధులు ఈ మాత్రను వాడటం శ్రేయస్కరం కాదని తాజా అధ్యయనంలో తేలింది. 65 ఏళ్లు, ఆపై వయసు దాటినవారికి దుష్ప్రభావాలు కలిగే ప్రమాదం ఉందని పేర్కొంది. దీర్ఘకాలం పారాసిటమాల్ వాడటం వల్ల జీర్ణకోశ, గుండె, కిడ్నీ సంబంధిత సమస్యలు పెరిగే అవకాశముందని వెల్లడించింది. ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ నాటింగ్‌హామ్‌కు చెందిన పరిశోధకులు ఆ దేశంలో చేసిన అధ్యయనంలో ఈ విషయాలు వెలుగు చూశాయి. పారాసిటమాల్‌లో వృద్ధుల్లో పెప్టిక్ అల్సర్ రక్తస్రావమయ్యే ప్రమాదం 24%, దిగువ జీర్ణాశయాంతర రక్తస్రావమయ్యే ప్రమాదం 36% ఉందని గుర్తించారు. అలాగే దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధి బారిన పడే అవకాశం 19%, గుండె సంబంధిత సమస్యలు 9%, హైపర్ టెన్షన్ వచ్చే ప్రమాదం 7% ఉన్నట్టు పేర్కొన్నారు. తమ పరిశోధనలను నిర్ధారించడానికి తదుపరి పరిశోధన చేయాల్సిన అవసరముందని వెల్లడించారు. అధ్యయనంలో భాగంగా 6 నెలల్లో రెండు ప్రిస్క్రిప్షన్ల కంటే ఎక్కువ సార్లు పారాసిటమాల్ వాడిన 1.80 లక్షల మంది హెల్త్ రికార్డులను.. తరచుగా ఈ మాత్ర వాడని 4.02 లక్షల మంది హెల్త్ రికార్డులను పరిశీలించారు.

పూచీకత్తు లేకుండానే రైతులకు 2 లక్షల వరకు రుణం

» రుణ పరిమితిని పెంచిన ఆర్బీఐ..గతంలో రూ.1.6లక్షలు

న్యూఢిల్లీ, డిసెంబరు 14: ఎలాంటి పూచీకత్తు లేకుండానే రైతులకు రుణాన్ని అందించే సదుపాయాన్ని ఆర్‌బీఐ పెంచింది. ఇంతకు మునుపు ఎలాంటి తనఖా లేకుండా రూ.1.6 లక్షల వరకు రుణం తీసుకునే వీలుండేది. ఇప్పుడు దాన్ని రూ.2 లక్షలకు పెంచింది. వచ్చేనెల(జనవరి) 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ద్రవ్యోల్బణం పెరుగుదల - పంటలకు రైతులు పెడుతున్న పెట్టుబడిని అంచనావేస్తూ.. ఆర్‌బీఐ ఈ పరిమితిని పెంచుతూ వస్తున్న విషయం తెలిసిందే..! 2004లో ఈ పరిమితి రూ.10 వేల వరకే ఉండేది. క్రమంగా ఈ పరిమితి పెరుగుతూ.. 2019 ఫిబ్రవరి నుంచి ఆ మొత్తం రూ.1.6 లక్షలకు చేరుకోగా.. ఇప్పుడు రూ.2 లక్షలకు పెరిగింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయం ద్వారా రైతుల్లో 86% ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది.

ఆధార్ అప్‌డేట్ గడువు జూన్ 14వరకు పెంపు

న్యూఢిల్లీ, డిసెంబరు 14: ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు గడువును వచ్చే ఏడాది జూన్ 14వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఉడాయ్ శనివారం ప్రకటన విడుదల చేసింది. మై ఆధార్ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపింది. జూన్ 14 తర్వాత ఆధార్ అప్‌డేట్ చేయాలంటే నిర్దిష్ట రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. ఉచితంగా ఆధార్ అప్‌డేట్ గడువు ఇప్పటి వరకు డిసెంబరు 14గా ఉండగా.. తాజాగా దాన్ని పొడిగించారు.

బీజేపీ సీనియర్ నేత ఆడ్వాణీ ఆస్పత్రిలో చేరిక

న్యూఢిల్లీ, డిసెంబరు 14: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉపప్రధాని లాల్‌కృష్ణ ఆడ్వాణీ(97) అస్వస్థతతో ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆస్పత్రిలో చేరారు. ఆయన్ను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నామని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని ఆ ఆస్పత్రి ఒక ప్రకటనలో వెల్లడించింది. రెండు రోజుల క్రితమే ఆయన్ను ఆస్పత్రిలో చేర్పినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. గత నెలలో 97వ జన్మదినం జరుపుకొన్న ఆయన కొద్ది నెలలుగా తరచూ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

చాట్ జీపీటీ విమర్శకుడు సుచిర్ బాలాజీ మృతి

వాషింగ్టన్, డిసెంబరు 14: చాట్ జీపీటీ పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసి వార్తల్లో నిలిచిన ప్రజావేగు, సాంకేతిక నిపుణుడు సుచిర్ బాలాజీ(26) అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన నివాసంలో ఆయన విగతజీవిగా కనిపించినట్లు పోలీసులు ప్రకటించారు. వాస్తవానికి, గత నెల 26వ తేదీనే సుచిర్ మృతి చెందగా.. ఆ విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సుచిర్ మరణానికి కారణమేమిటన్నది తెలియలేదు. అయితే, మృతి వెనుక ఏమైనా కుట్ర ఉందా అన్నదానికి ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. కృత్రిమమేధ అయిన చాట్ జీపీటీతో సంచలనం సృష్టించిన ఓపెన్ ఏఐ కంపెనీలో సుచిర్ నాలుగేళ్లపాటు పని చేశారు. చాట్ జీపీటీ రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. అది 2022లో విడుదలైన తర్వాత ఆయన.. తన అభిప్రాయాలు మార్చుకుని, ఓపెన్ ఏఐకి రాజీనామా చేశారు. చాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధో టెక్నాలజీల వల్ల ఇంటర్నెట్‌కు, సమాజానికి నష్టం జరుగుతుందని ఆయన బలంగా వాదించారు. ఈ క్రమంలోనే ఆయన ఆకస్మిక మృతి పలు సందేహాలకు తావిస్తోంది.

ఆర్మీ చీఫ్ కార్యాలయంలో చారిత్రక '1971' చిత్రం తొలగింపు!

న్యూఢిల్లీ, డిసెంబరు 14: ఆర్మీ చీఫ్ (సీఓఏఎస్) కార్యాలయంలో 1971 యుద్ధంలో పాకిస్థాన్‌పై విజయానికి గుర్తుగా ఉన్న ఫొటోను తొలగించడం వివాదం రేపింది. సోమవారం విజయ్ దివస్ జరుపుకోనున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 1971, డిసెంబరు 16న బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో భాగంగా యుద్ధం ముగింపు సందర్భంగా పాకిస్థానీ సైనిక బలగాల లొంగుబాటు పత్రంపై పాక్ లెఫ్టినెంట్ జనరల్ ఏఏకే నియాజీ భారత లెఫ్టినెంట్ జనరల్ జగ్జిత్ సింగ్ అరోరా సమక్షంలో సంతకం చేస్తున్న చిత్రాన్ని మార్చారు. దాని స్థానంలో 'కర్మ క్షేత్ర' అనే పేరుతో మరో చిత్రాన్ని ఏర్పాటు చేశారు. అందులో భారత్, చైనా సరిహద్దు ఎల్ఏసీ వెంబడి ఉండే ప్యాంగాంగ్ త్సో సరస్సు, యుద్ధ ట్యాంకర్లు, హెలికాప్టర్లు, సైనికులతో భారత యుద్ధ సామర్థ్యాలను చూపే చిత్రాలు ఉన్నాయి.

కుటుంబ పాలనలో రాజ్యాంగ దుర్వినియోగం

» రాజ్యాంగంపై లోక్‌సభ చర్చలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబరు 14: దేశాన్ని 55 ఏళ్లు పాలించిన నెహ్రూ-గాంధీ కుటుంబమే రాజ్యాంగాన్ని అత్యధికంగా దుర్వినియోగం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తొలి ప్రధాని నెహ్రూ స్వయంగా రాజ్యాంగ దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఆయన బాటలోనే తనయ ఇందిరాగాంధీ నడిచిందని వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా లోక్‌సభలో చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన సుదీర్ఘంగా రెండు గంటలు మాట్లాడారు. అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగకర్తలు అద్భుత రాజ్యాంగాన్ని రచించారని, దాన్ని నెహ్రూ-గాంధీ కుటుంబం ఇష్టం వచ్చినట్లు మార్చేసిందని వ్యాఖ్యానించారు. 1951లో తొలి సవరణతో నెహ్రూ రాజ్యాంగ దుర్వినియోగానికి తెర తీశారని చెప్పారు. రాజ్యాంగం అడ్డొస్తే మార్చేద్దామని స్వయంగా నెహ్రూ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారని ప్రస్తావించారు. 1975లో ప్రజల రాజ్యాంగ హక్కులన్నీ ఉల్లంఘిస్తూ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినపుడు రాజ్యాంగానికి కేవలం 25 ఏళ్లు మాత్రమేనన్నారు. రాజ్యాంగాన్ని ఎడాపెడా మార్చే సంప్రదాయానికి తొలి ప్రధానిగా నెహ్రూయే తెర తీశారన్నారు. తండ్రి అడుగు జాడల్లో ఇందిరాగాంధీ సుప్రీంకోర్టు తీర్పులను కూడా తోసిరాజని 1971లో రాజ్యాంగాన్ని అడ్డగోలుగా మార్చేశారని చెప్పారు. ఇందిర న్యాయ వ్యవస్థను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకొనే ప్రయత్నాల్లో భాగంగా వాటి రెక్కలు కత్తిరిస్తూ రాజ్యాంగ సవరణలు చేశారన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక ఆ కుటుంబం తీరులో మార్పేమీ లేదని చెప్పారు. షాబానో కేసులో మహిళల హక్కులను గౌరవిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఓటుబ్యాంకును కాపాడుకొనే ప్రయత్నాల్లో భాగంగా రాజీవ్‌గాంధీ సంబంధిత చట్టాల సవరణ ద్వారా నిర్వీర్యం చేశారన్నారు. రాజ్యాంగం రక్తం రుచి మరిగిన కాంగ్రెస్ కుటుంబం నుంచి నాలుగో తరం కూడా రాజ్యాంగం మీదదాడిని కొనసాగిస్తూనే ఉందని వ్యాఖ్యానించారు. ఆ కుటుంబ పాలనలో 75 సార్లు రాజ్యాంగాన్ని సవరించారన్నారు. ఆ పార్టీ రాజ్యాంగం ప్రకారం భారతదేశ తొలి ప్రధాని పటేల్ కావాలని అన్నారు. కాంగ్రెస్ కమిటీలు ప్రధానిగా వల్లభాయ్ పేరును ప్రతిపాదించినా, నెహ్రూ పేరును ఒక్క పీసీసీ ప్రతిపాదించకపోయినా ఆయన్నే ప్రధానిని చేశారని గుర్తు చేశారు. వెనుకబడిన కులాల నుంచి సీతారాం కేసరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైతే ఆయన్ను బాత్రూంలో బంధించి, పార్టీని కుటుంబం లాగేసుకుందని ఆరోపించారు. 1998లో వాజ్‌పేయి ఎంపీలను కొనుక్కొని ప్రభుత్వాన్ని బతికించుకొనే అవకాశం ఉన్నా రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి అధికారాన్ని వదులుకున్నారని ప్రస్తావించారు. కాంగ్రెస్ పాలనలో ఎంపీలను కొనడానికి ఉపయోగించిన కరెన్సీ కట్టలను పార్లమెంటులో ప్రదర్శించిన విషయాన్ని ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని బీజేపీ కూడా సవరించిందని, అయితే, మంచి పనుల కోసమే చేశామని చెప్పారు.



11 సంకల్పాలు

2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్‌ను సాధ్యం చేయడానికి ప్రధాని మోదీ 11 సంకల్పాలను ప్రకటించారు. 1) అందరికీ తోడు... అందరి అభివృద్ధి. 2) అవినీతిపై ఉపేక్ష లేదు. 3) చట్టాన్ని పాటించడాన్ని గర్వంగా భావించాలి. 4) వలస పాలన మనస్తత్వం నుంచి విముక్తి. 5) వారసత్వ రాజకీయాలకు దూరం. 6) రాజ్యాంగం పట్ల గౌరవం. దాన్ని రాజకీయాలకు వాడుకోక పోవడం. 7) రిజర్వేషన్లు ఎత్తేయకపోవడం. 8) మత రిజర్వేషన్లను ఆపేయడం. 9) మహిళా ఆధార అభివృద్ధికి భారత్‌ను ఉదాహరణగా మార్చడం 10) రాష్ట్రం నుంచి దేశం వరకు అభివృద్ధి 11) ఒకే భారత్ శ్రేష్ఠ భారత్

రాజ్యాంగాన్ని రక్షిస్తామని బీజేపీ చెప్పడం విడ్డూరం

» లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షిస్తామని బీజేపీ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. లోక్‌సభలో శనివారం రాజ్యాంగంపై చర్చలో భాగంగా రాహుల్ మాట్లాడారు. రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని తన రచనల్లో ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతకర్త సావర్కర్ స్పష్టంగా చెప్పారన్నారు. ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతి, ఆచారాలు, ఆలోచనలు, ఆచరణలకు మనుస్మృతే ఆధారమని, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని సావర్కర్ ఆకాంక్షించారని రాహుల్ వెల్లడించారు. "మీరు రాజ్యాంగాన్ని పరిరక్షించడం గురించి పార్లమెంట్‌లో మాట్లాడడం అంటే మీరు మీ నాయకుడు సావర్కర్‌ను అవహేళన చేస్తున్నట్టే" అని రాహుల్ బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాగా, భారత్‌లో ప్రస్తుతం యుద్ధం జరుగుతోందని చెబుతూ.. ద్రోణాచార్యుడికి ఏకలవ్యుడు తన బొటనవేలిని గురుదక్షిణగా ఇచ్చిన అంశాన్ని రాహుల్ ప్రస్తావించారు. అదానీకి ధారావి ప్రాజెక్టు అప్పగించినప్పుడే అక్కడి చిన్న, మధ్య తరహా వ్యాపారుల బొటనవేళ్లను మోదీ కోసేసినట్టయిందని చెప్పారు. అగ్నివీర్ ప్రశ్నపత్రాల లీక్‌ల ద్వారా యువత బొటనవేలిని కత్తిరించారని వ్యాఖ్యానించారు. మద్దతు ధర కోసం ఉద్యమిస్తున్న రైతుల బొటనవేలిని కత్తిరించారని మండిపడ్డారు. కాగా, మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ సెటైర్ వేశారు. ప్రధాని ప్రసంగం పాఠశాలలో వరుసగా రెండు గణితం క్లాసులు విన్నట్లుందన్నారు. ప్రధాని 110 నిమిషాల ప్రసంగం బోర్ కొట్టించిందని, కొత్తదనమేమీ లేకుండా సాగిందన్నారు.

లోకం తీరు



టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఇళంగోవన్ కన్నుమూత

» అనారోగ్యంతో ఆస్పత్రిలో తుదిశ్వాస

» తమిళనాడు గవర్నర్, సీఎం సంతాపం



చెన్నై, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) మాజీ అధ్యక్షుడు, ఈరోడ్ ఈస్ట్ శాసనసభ్యుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ (75) శనివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా శ్వాసకోశ సంబంధమైన వ్యాధితో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ద్రావిడ ఉద్యమనేత పెరియార్ సోదరుడి మనవడైన ఇళంగోవన్.. కేంద్ర సహాయ మంత్రిగా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో పనిచేశారు. నాస్తిక కుటుంబం నుంచి వచ్చిన ఆయన తండ్రి ఈవీకే సంపత్.. అన్నాదురై స్థాపించిన డీఎంకేలో, ఇళంగోవన్ తల్లి సులోచనా సంపత్ ఎంజీఆర్ స్థాపించిన అన్నాడీఎంకేలో పనిచేశారు. ఇళంగోవన్ మాత్రం పిన్న వయసులోనే కాంగ్రెస్ పార్టీలో చేరారు. పలుమార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యారు. అయితే 2021లో జరిగిన ఎన్నికల్లో ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఇళంగోవన్ కుమారుడు తిరుమగన్.. గత ఏడాది జనవరిలో అనారోగ్యంతో కన్నుమూయడంతో కాంగ్రెస్ పార్టీ ఆ స్థానాన్ని ఆయనకు కేటాయించింది. అక్కడ విజయం సాధించిన ఇళంగోవన్ కూడా 20 నెలలకే కన్నుమూయడంతో నియోజకవర్గంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇళంగోవన్ భౌతికకాయానికి నేడు అంత్యక్రియలు జరుగనున్నాయి. ఇళంగోవన్ మృతి పట్ల తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, పలువురు నేతలు తీవ్ర సంతాపం ప్రకటించారు.

రేపు లోక్‌సభలో జమిలి బిల్లు!

న్యూఢిల్లీ, డిసెంబరు 14: జమిలి ఎన్నికల బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. తరచూ ఎన్నికలు జరుగుతూ ప్రతి రోజూ దేశంలో ఏదో మూల ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న బృహత్తర కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తలకెత్తుకుంది. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగంలో 82ఏ పేరుతో కొత్త ఆర్టికల్‌ను చేరుస్తారు. ఆర్టికల్ 83(పార్లమెంటు ఉభయ సభల కాలవ్యవధి), ఆర్టికల్ 172(శాసనసభల కాలవ్యవధి), ఆర్టికల్ 327(చట్ట సభలకు ఎన్నికల విషయంలో పార్లమెంటుకు నిబంధనలను రూపొందించే అధికారం)లను సవరిస్తారు. జమిలి ఎన్నికల బిల్లు ఆమోదం పొందిన తర్వాత తదుపరి పార్లమెంటు తొలిసారి సమావేశమయ్యే తేదీని రాష్ట్రపతి ప్రకటిస్తారు. దాన్ని అపాయింటెడ్ డేట్ అంటారు. అంతకు ముందే ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలి. పార్లమెంటు కాలపరిమితి అపాయింటెడ్ డేట్ నుంచి ఐదేళ్లలో ముగిసిపోతుంది. అన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితి కూడా అదే పద్ధతిలో ముగిసిపోతుంది. లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. లోక్‌సభ కానీ, శాసనసభ కానీ కాలపరిమితి పూర్తి కాకుండానే రద్దయితే ఐదేళ్లలో మిగిలిన కాలానికి ఎన్నికలు నిర్వహించి కొత్త సభను ఏర్పాటుచేస్తారు. 1951-52, 1957, 1962, 1967 సంవత్సరాల్లో జమిలి ఎన్నికలే జరిగాయని బిల్లులో గుర్తు చేశారు. 1968, 69 సంవత్సరాల్లో కొన్ని శాసనసభలను అర్ధాంతరంగా రద్దు చేయడంతో ఆ క్రమం తప్పిందని ప్రస్తావించారు. కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సూచన మేరకు ఒకే దేశానికి ఒకే ఎన్నిక విధానాన్ని ఎంచుకున్నట్లు బిల్లు ఉద్దేశాల్లో పేర్కొన్నారు. కోవింద్ కమిటీ స్థానిక సంస్థలను కూడా చేర్చాలని సూచించినా ప్రస్తుతానికి దాన్ని పక్కన పెట్టాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. దాంతో సగం రాష్ట్రాల ఆమోదం పొందాల్సిన అవసరం లేకుండా పోయింది. అసెంబ్లీలతో పాటే పలు కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభకు ఎన్నికలు నిర్వహించేందుకు మరో బిల్లును ఆమోదించనున్నారు.

భారతీయ విద్యార్థులపై కెనడా కన్నెర్ర

» డాక్యుమెంట్లు తిరిగి సమర్పించాలని ఇమ్మిగ్రేషన్ అధికారుల ఆదేశాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 14: భారత్‌పై కత్తికట్టినట్టు వ్యవహరిస్తున్న కెనడా ఇప్పుడు ఆ దేశంలో విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులపై పడింది. కీలక డాక్యుమెంట్లను మరోసారి తమకు సమర్పించాలని పేర్కొంటూ.. కెనడా ఇమ్మిగ్రేషన్, రిఫ్యూజీస్, సిటిజన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) ఈ మెయిళ్ల ద్వారా ఆదేశాలు జారీ చేసింది. వీటిలో అధ్యయన అనుమతులు, వీసాలు, ఎడ్యుకేషనల్ రికార్డులు, మార్కులు, అటెండెన్స్ వంటి పలు డాక్యుమెంట్లు ఉన్నాయి. ఐఆర్‌సీసీ ఆదేశాలతో భారత విద్యార్థులు సహా అంతర్జాతీయ విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. కాగా, వీరిలో చాలా మంది రెండేళ్లపాటు చెల్లుబాటు అయ్యే వీసాలు కలిగి ఉన్నారు. ఇప్పుడు డాక్యుమెంట్లను అడ్డుపెట్టుకుని ఏదైనా మెలిక పెట్టి తమ వీసాలను రద్దు చేస్తారేమోనని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐఆర్‌సీసీ వాదన మరో విధంగా ఉంది. ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల ప్రవేశాలను నియంత్రించాలని నిర్ణయించినట్టు తెలిపింది. విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం.. కెనడాలో 4.2 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారు. మరోవైపు, అమెరికాలోనూ సరైన ధ్రువపత్రాలు లేని 18 వేల మంది భారతీయ విద్యార్థులను దేశం నుంచి పంపించేందుకు రంగం రెడీ అవుతున్నట్టు తెలిసింది. వీరిలో గుజరాత్, పంజాబ్, ఏపీకి చెందిన విద్యార్థులు ఉన్నారు. ఇమిగ్రేషన్ అధికారుల కథనం ప్రకారం.. ఈ ఏడాది నవంబరు నాటికి 14.45 లక్షల మంది విద్యార్థులను అమెరికా నుంచి పంపేయాలని నిర్ణయించుకున్నారు. వీరిలో 17,940 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.

భార్య వేధింపులకు మరో భర్త బలి

» బెంగళూరులో పోలీసు ఆత్మహత్య


తిప్పణ్ణ(ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులు కారణంగా ఇటీవల బెంగళూరులో టెకీ అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. అదే తరహాలో బెంగళూరుకే చెందిన ఓ పోలీసు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య, మామ వేధింపులు భరించలేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తిప్పణ్ణ (34) తనువు చాలించాడు. విజయపుర జిల్లా సింధగి తాలూకా హందిగనూరు గ్రామానికి చెందిన తిప్పణ్ణ శుక్రవారం రాత్రి 10: 45 సమయంలో రైలు కింద పడి కన్నుమూశాడు. అతని మృతదేహం వద్ద లభించిన సూసైడ్ నోట్ ఆధారంగా భార్య, మామ వేధింపులే ఆత్మహత్యకు కారణమని పోలీసులు గుర్తించారు. తన భార్య వేధింపుల గురించి తన మామకు గురువారం ఫోన్ చేసి చెప్పానని, 'నువ్వు చస్తే నా కూతురు బాగుంటుంది' అని మామ దూషించాడని తిప్పణ్ణ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

దక్షిణ కొరియా అధ్యక్షుడి అభిశంసన

తీర్మానానికి 204 మంది ఎంపీల మద్దతు.. విధుల నుంచి సస్పెండ్ అయిన యోల్

» 'మార్షల్ లా' విధింపుపై సభ్యుల ఆగ్రహం

» రాజ్యాంగ ధర్మాసనానికి తీర్మానం ప్రతులు

» తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రధాని హన్ డక్

సియోల్, డిసెంబరు 14: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు పార్లమెంటు(నేషనల్ అసెంబ్లీ)లో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈ నెల 3న ఆయన దేశంలో 'మార్షల్ లా'(సైనిక పాలన) విధించడం.. దీనిపై ప్రతిపక్షాలు సహా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో గంటల వ్యవధిలోనే వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. అసలు మార్షల్ లా విధించడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్న పార్లమెంటు సభ్యులు ఆయనను పదవి నుంచి అభిశంసించాలని పట్టుదలతో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చట్టసభలో యోల్‌కు వ్యతిరేకంగా ఇటీవల అభిశంసన తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. అయితే.. అప్పట్లో అది వీగిపోయింది. అయినప్పటికీ.. సభ్యులు మరోసారి ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టడంతో తాజాగా దీనిపై సభలో ఓటింగ్ నిర్వహించారు. ఈ తీర్మానానికి అనుకూలంగా మొత్తం 300 మంది సభ్యుల్లో 204 మంది అనుకూలంగా ఓటేయగా కేవలం 85 మంది వ్యతిరేకించారు. దీంతో తీర్మానం ఆమోదం పొందినట్టు స్పీకర్ ప్రకటించారు. ఫలితంగా యోన్ తన విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. ఇక, ఇప్పుడు ఈ తీర్మాన ప్రతిని రాజ్యాంగ ధర్మాసనానికి నివేదిస్తారు. దీనిపై కోర్టు 180 రోజుల్లో నిర్ణయం ప్రకటించాల్సి ఉంటుంది. అధ్యక్షుడి అభిశంసనకు కోర్టు కూడా పచ్చజెండా ఊపితే.. అప్పటి నుంచి 60 రోజుల్లో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అప్పటి వరకు ప్రధాని హన్ డక్ సూ తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఇదిలావుంటే, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో దేశ ఆర్థిక భద్రత, విదేశీ సంబంధాల విషయంలో ప్రభుత్వం, చట్టసభ సభ్యులు కలివిడిగా ఉండాలని, దేశ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పీకర్ కిమ్-జిన్-ప్యో అభ్యర్థించారు. మరోవైపు, యోల్ అభిశంసనపై త్వరితగతిన నిర్ణయం వెలువరించేందుకు వీలుగా రాజ్యాంగ ధర్మాసనంలో న్యాయమూర్తులను వెంటనే నియమించేలా చర్యలు తీసుకోవాలని ప్యో సూచించారు. తద్వారా కొన్ని వారాల్లోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉంటుందన్నారు.

నాది రాక్షసులపై యుద్ధం: యోల్



తాను ప్రకటించిన మార్షల్ లా.. దేశంపై చేసిన తిరుగుబాటు చర్యకాదని అభిశంసన ఎదుర్కొంటున్న అధ్యక్షుడు యోల్ పేర్కొన్నారు. మార్షల్ లా ప్రకటన పాలనలో భాగమేనని తెలిపారు. దేశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ.. రాక్షసుల మాదిరిగా వ్యవహరిస్తున్న ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ సభ్యులను హెచ్చరించేందుకే తాను మార్షల్ లా ప్రకటించాల్సి వచ్చిందని సమర్థించుకున్నారు. తనపై ప్రవేశ పెట్టిన అభిశంసన తీర్మానం కేవలం వ్యక్తిగతంగా తనను బాధించడమే కాదని, ఉన్నతస్థాయిలో ఉన్న అధ్యక్ష పదవిని అగౌరవ పరచడం, అధికారాలను లాగేసుకోవడమేనన్నారు. తద్వారా వచ్చే ఏడాది ప్రవేశ పెట్టాల్సిన బడ్జెట్ బిల్లును కూడా బలహీన పరిచాయరని యోల్ విమర్శించారు. దేశాన్ని అస్థిరపరచేందుకు ప్రయత్నిస్తున్న క్రిమినల్ ముఠాలు అంతమయ్యే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.


గాయపడిన రైతును ఆస్పత్రికి తరలిస్తున్న రైతులు

రైతుల 'ఢిల్లీ చలో' ఉద్రిక్తం

» శంభు సరిహద్దు దాటేందుకు అన్నదాతల యత్నం

» వారిపైకి జలఫిరంగులు..17 మందికి గాయాలు

శంభు, డిసెంబరు14: కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్లతో 101 మంది రైతులు హరియాణా-పంజాబ్ సరిహద్దు వద్ద చేపట్టిన ఢిల్లీ చలో కార్యక్రమాన్ని హరియాణా పోలీసులు మూడోసారి భగ్నం చేశారు. శంభు సరిహద్దు దాటేందుకు యత్నించిన రైతులపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. జలఫిరంగులతో రైతులను చెల్లాచెదురు చేశారు. ఘటనలో 17 మంది రైతులకు గాయాలయ్యాయి. దీంతో శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ముందు జాగ్రత్తగా హరియాణా ప్రభుత్వం ఈ నెల 17 వరకు అంబాలా పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. వాస్తవానికి రైతులు ఇదే నెల 6, 8 తేదీల్లో కూడా ఈ సరిహద్దు దాటేందుకు యత్నించి పోలీసులు అడ్డుకోవడంతో విఫలమయ్యారు. శనివారం కూడా మరోసారి అడ్డుకోవడంతో తమ ఢిల్లీ చలో కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. మరోవైపు, ఈ నెల 16న పంజాబ్ బయట ట్రాక్టర్ల ర్యాలీ, ఈ నెల 18న పంజాబ్‌లో రైల్ రోకో చేపడ్తామని రైతు నాయకుడు సర్వాన్ సింగ్ పంధేర్ ప్రకటించారు. రైతుల డిమాండ్లను కేంద్రం వెంటనే పరిష్కరించాలంటూ పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ కన్నౌర్ సరిహద్దు వద్ద నవంబరు 26న నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారుతోందని రైతు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెంపుడు సింహానికి ఖైదీలే ఆహారం

» ఒక్కొక్కటిగా బయటకు అసద్ పాలనలోని అకృత్యాలు

» అసద్ టైగర్ ఫోర్స్ కీలక అధికారికి బహిరంగ ఉరి

డమాస్కస్, డిసెంబరు 14: దేశం విడిచి పారిపోయిన సిరియా అధ్యక్షుడు బషర్ అల్- అసద్ పాలనలో కొనసాగిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అసద్ ఇంటెలిజెన్స్ విభాగం 'టైగర్ ఫోర్స్'లో కీలక అధికారి అయిన తలాక్ దక్కాక్.. ఖైదీలను తీసుకెళ్లి తన పెంపుడు సింహాలకు ఆహారంగా వేసేవాడనే విషయం బయటకు వచ్చింది. తాజాగా తిరుగుబాటుదారులు అతడిని పట్టుకుని సిరియా పశ్చిమ ప్రాంతంలోని హమా పట్టణంలో బహిరంగంగా ఉరితీసినట్లు సమాచారం. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ట్యాక్సీ డ్రైవర్ అయిన తలాక్ దక్కాక్ అసద్ ప్రభుత్వంలో చేరి కీలక నేతగా ఎదిగాడు. తన ఆధీనంలో పనిచేసే దాదాపు 1500 మందిని అడ్డుపెట్టుకుని అసద్ అండదండలతో సొంతంగా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. తన అధికారాన్ని ఉపయోగించుకుని 2005లో జూ నుంచి ఓ సింహాన్ని తీసుకొచ్చాడు. తనకు ఎదురుతిరిగిన వాళ్లను ఆ సింహానికి ఆహారంగా వేసేవాడట.

అమెరికా గగనతలంలో 'మిస్టరీ డ్రోన్లు'

రాత్రి వేళల్లో దర్శనం.. కూల్చివేయాలన్న ట్రంప్

వాషింగ్టన్, డిసెంబరు 14: అమెరికా గగనతలంలో పలు చోట్ల 'మిస్టరీ డ్రోన్లు' దర్శనమిస్తుండడం కలవరం సృష్టిస్తోంది. వీటిని ఇరానో, చైనానో ప్రయోగించి ఉంటాయని కొందరు భావిస్తుండగా, ప్రభుత్వ వర్గాలు మాత్రం అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం న్యూజెర్సీలో ఈ అనుమానాస్పద డ్రోన్లు కనిపించాయి. ప్రస్తుతం న్యూయార్క్ నగరం సహా ఇతర రాష్ట్రాల్లోనూ రాత్రి వేళల్లో ఇవి దర్శనమిస్తున్నాయి. ప్రకాశవంతమైన వస్తువులు ఎగురుతున్నట్టుగా కనిపిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై శ్వేత సౌధం స్పందిస్తూ వీటి వల్ల జాతీయ భద్రతకు ముప్పులేదని, వీటి వెనుక విదేశీ హస్తం కూడా లేదని తెలిపింది. అధ్యక్షుడిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్ మాత్రం వీటిని కూల్చివేయాలని డిమాండ్ చేశారు.



రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిని అభినందిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కొనకళ్ల నారాయణ తదితరులు

బీసీలకు అండగా టీడీపీ: మంత్రి అనగాని

» ఘనంగా గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి ప్రమాణం

విజయవాడ(పటమట), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్న నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో మొదటి నుంచి బీసీలకు సముచిత స్థానం కల్పించిందని, సామాజిక ఆర్థిక రంగాల్లో ప్రోత్సహించిందీ టీడీపీయేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర గౌడ క్రెడిట్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా వీరంకి గురుమూర్తి పదవీ ప్రమాణ స్వీకారం విజయవాడలో శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి గురుమూర్తి పార్టీకి అంకితభావంతో పనిచేశాడని, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో అవినీతికి వ్యతిరేకంగా పోరాడి జైలుశిక్ష అనుభవించాడని, అతని పోరాట ఫలితమే ఈ పదవి అన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీలు అందరూ ఐక్యంగా మెలగాలని పిలుపునిచ్చారు. సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గురుమూర్తి, తాను వేర్వేరు పార్టీల్లో ఉన్నా వ్యక్తిగతంగా సన్నిహితంగా మెలిగేవారిమని, గత 30 సంవత్సరాల నుంచి గురుమూర్తి టీడీపీ ఆలోచనలకు అనుగుణంగానే పనిచేశాడని ప్రశంసించారు. గురుమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై ఉంచిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని, రాష్ట్రంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

10 నుంచి 19 వరకు వైకుంఠద్వార దర్శనాలు

తిరుమల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనాలు జరుగనున్నాయి. ఈ పది రోజుల్లో దర్శన టికెట్లు, టోకెన్లున్న భక్తులకు మాత్రమే దర్శనం కల్పించనున్నారు.

తిరుమల నడక దారిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



నవనీత్

తిరుమల నడక మార్గంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శనివారం మృతి చెందాడు. బెంగళూరుకు చెందిన నవనీత్(34) హైదరాబాద్‌కు చెందిన స్నేహితుడు మహేష్‌తో కలిసి అలిపిరి నుంచి శనివారం ఉదయం 8.30 గంటలకు తిరుమలకు బయలుదేరాడు. తిరుమలకు చేరుకోవడానికి 50 మెట్ల దూరంలో ఉండగా హఠాత్తుగా నవనీత్ కుప్పకూలిపోయాడు. వెంటనే అంబులెన్స్ ద్వారా తిరుమల అపోలో ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చెందిన రవికుమార్ అనే భక్తుడు అలిపిరి కాలినడక మార్గంలోనే మృతి చెందాడు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ CNB / పద్మశాలి/ 45y / 5'3" / M.A.,B.Ed., / Rtd. టీచర్ / Grade-II Officer MRO / ఏ బాదరబందీలేని వరుడు కావలెను. ఫోన్: 9603814038 AJH-002745

★ కుల ఆస్తిపట్టింపు లేదు / కమ్మ / 2nd మ్యారేజ్ /42y /5'6" / జనరల్ మెడిసిన్ / మంచి ఆస్తి గల అందమైన వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 7036453550 AJH-002745

★ కుల పట్టింపు లేదు / కమ్మ / డైవర్సీ / 43y/5'5"/ డాక్టర్ Gynacologist మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 9542494557, ఫోన్: 9666832809 AJH-002745

★ 60y / రెండవ పెళ్ళి / విడో / GOVT. ఫ్యామిలీ పెన్షనర్ / సొంత ఇల్లు రెంట్స్ / పిల్లలు లేరు / ఎలాంటి బాధరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 7995376608 AJH-4156

★ 62y / రెండవ పెళ్ళి /విడో/ఫెయిర్/ Govt. ఫ్యామిలీ పెన్షనర్ / పిల్లలు లేరు /సొంత ఇల్లు రెంట్స్, ప్రాపర్టీ / ఏలాంటి బాధరబందీలేని వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9030858258 AJH-4156

★ ఆర్యవైశ్య /21y & 22y & 24y & 26y & 27y & 29y & 30y & 32y & 34y & 36y & 37y & 39y & 40y & 42y & 43y & 45y & 46y & 48y & 49y & 51y & 53y & 55y & 57y & 59y / డి. సుజాత గుప్తా "చసేవా" (Since 1998):PH/WA 9291503949 AJH-4156

★ విశ్వబ్రాహ్మణ / CA / చార్టెడ్ అకౌంటెంట్ / 5'4" ఎత్తు / 24 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 6305007091 AJH-15340

★ 2వ పెళ్ళి / కుల ప్రసక్తి లేదు / B.Tech, NIT / GOVT. ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9963757612 AJH-15340

★ కమ్మ / కుల ఆస్తి పట్టింపు లేదు / 39y / 5'4"/ఫెయిర్ / B.Com / ఓన్ టెక్స్‌టైల్ బిజినెస్ / 10 ఎకరాల ల్యాండ్ / ఓన్ ఫ్లాట్ ఉన్న వధువుకి / బిజినెస్, పెన్షనర్, ఏదీ జాబ్, ఉన్న వరుడు కావలెను. వాట్సాప్: 9603148758 AJH-002745

★ రెడ్డి 2nd మ్యారేజ్ / వయస్సు: 30, H:5.4 / సొంత బిజినెస్ గల అందమయిన వధువుకి వరుడు కావలెను. 1st/2nd అన్ని కులాలు & వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్ : 8143011223 AJH-15341

★ రెడ్డి 2nd మ్యారేజ్ (కుల, ఆస్తి) పట్టింపు లేదు. Age:31, PVT JOB OWN PROPERTIES. గల వధువుకి, వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి 1st/2nd సంబంధాలు కలవు. ఫోన్ : 9059099496 AJH-15341

★ కుల పట్టింపు లేదు / రెడ్డి / 29y/BCom/ స్థిరాస్తి కలిగిన వధువుకు 1వ లేదా 2వ వరుడు కావలెను. ఆస్తి పట్టింపు లేదు. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 8142060040 AJH-15341

★ రెడ్డి విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / AGE:35y/QLY:B.Com/Pvt. Job, అందమయిన వధువుకి వరుడు కావలెను. All Caste Marriages Available. Ph: 8121347478 AJH-15341

★ కుల పట్టింపు లేదు / విడో/ 45y / Thirupathi / Govt. Employee / Good Salary / Own House / Rents / Agriculture Lands / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph:8374476725 AJH-002816

★ కుల ఆస్తి ప్రసక్తి లేదు / విడో / 50y / Andhra / Family Pensioner / Own Business / Good Salary / పిల్లలు సెటిల్డ్ / ఓన్ హౌస్ / ల్యాండ్స్ / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph:9652268405 AJH-002816

★ కుల పట్టింపు లేదు / 40-60y / Widow / Andhra / పిల్లలు లేరు / Govt. Job / Good Salary / సొంత ఇల్లు / పొలాలు / అందమైన వధువులకు వరులు కావలెను. Ph:9989350417 AJH-002816

★ కుల పట్టింపు లేదు / 58y / Widow / G.V.T./R.T.D./ మంచి జీతం / ఓన్ హౌస్ / రెంట్స్ / మనీ సపోర్ట్ చేయబడును. పిల్లలు లేరు / ఏలాంటి బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను. సెల్:9182070372 AJH-002816

★ గౌడ విడో Govt. 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి పట్టింపు లేదు / వయస్సు: 45, కలర్: తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 8125076013 AJH-002806

★ కుల పట్టింపు లేదు / విడో / 58 Y / Govt. Engineer / ఓన్ బిజినెస్ / రెంట్స్, లాండ్స్, మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 83413 13561 AJB-706

★ 30, 5.2, MD Radiology చదివిన అందమైన వధువుకు ANY PG DOCTOR (OR) WELL SETTLED బిజినెస్ చేయుచున్న అందమైన కమ్మ వరుడు మాత్రమే కావలెను. హైదరాబాదు, విజయవాడ ANY PLACE కమ్మ వరుడు కావలెను. (NO BROKERS) DIRECT Cell : 95428 15829 AJB-0269

★ రెడ్డి : 1st మ్యారేజ్, 26 సం॥రాలు, డిగ్రీ, 5.4., సొంత ఇల్లు, ఫాదర్ వ్యవసాయం, స్థిరాస్థి, ఉన్న అమ్మాయికి ఆంధ్ర, తెలంగాణలో వరుడు కావలెను. సెల్ : 83743 64076 AJL_202980

★ దేవాంగ, పద్మశాలి, పట్టుశాలి : మొదటి సంబంధం, 26 సం॥రాలు, సొంత ఇల్లు, ఫాదర్ మగ్గం వర్క్, బ్రదర్ జాబ్ ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : 83743 64076 AJL_202980

★ ఆచారులు(విశ్వబ్రాహ్మిన్స్),(గోల్డ్ స్మిత్) : వయస్సు 25 To 32 సం॥రాలు, 10 To డిగ్రీ, ఉన్న అమ్మాయికి ఏదైనా బిజినెస్ లేదా జాబ్ ఉన్న వరుడు కావలెను. సెల్ : 83743 64076 AJL_202980

★ కమ్మ (చౌదరి): 1st మ్యారేజ్, 26 సం॥రాలు, డిగ్రీ, 27 సం॥రాలు B.Tech., ఉన్న అమ్మాయిలకు ఆంధ్ర, తెలంగాణాలలో సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్ : 83743 64076 AJL_202980


★ బలిజ,(తెలగబలిజ, శెట్టిబలిజ, వాడబలిజ) : 1st మ్యారేజ్, 26 To 32 సం॥రాలు, సొంత ఇల్లు ఉన్న అమ్మాయిలకు వరుడు కావలెను. సెల్ : 83743 64076 AJL_202980

★ రాజులు,(సూర్యవంశం, చంద్రవంశం) క్షత్రియరాజులు : 10th To డిగ్రీ, B.Tech., 26 To 32 సం॥రాలు, ఉన్న అమ్మాయిలకు ఆంధ్ర, తెలంగాణలో జాబ్ లేదా బిజినెస్ వరుడు కావలెను. సెల్:83743 64076 AJL_202980

★ వెలమ : మొదటి సంబంధం, 26 సం॥రాలు, డిగ్రీ, 5.4., సొంత ఇల్లు, ఫాదర్ వ్యవసాయం, (బ్రదర్స్) మ్యారేజ్‌గా ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : 83743 64076 AJL_202980

★ గౌడ్స్, యాదవ్స్ : 25 To 35 సం॥రాలు, మొదటి సంబంధం, 2వ సంబంధం కొరకు 10 To డిగ్రీ, ఉన్న అమ్మాయిలకు సాంప్రదాయ వరులు కావలెను. సెల్ : 83743 64076 AJL_202980

వధువు కావలెను



★ రెడ్డి / B.Tech / Govt. జాబ్ / గెజిటెడ్ పోస్ట్ / మంచి జీతం /5'11" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 8790689274 AJH-4156

★ గౌడ / B.Tech / C.Govt. ఇంజనీర్ / R&B Dept. / మంచి జీతము / 6' ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9618008271 AJH-15340

★ రజక / కట్న ప్రసక్తి లేదు / ME / Govt. Asst. ఇంజనీర్ / ట్రాన్స్‌కో / మంచి జీతము / 5'11" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 6305007091 AJH-15340

★ పద్మశాలి / M.Tech / C.Govt. అకౌంటెంట్ ఆఫీసర్ / BHEL / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 8297439565 AJH-15340

★ ముదిరాజ్ / ఏకైక కుమార్తె / M.Tech (IIT) / GOVT. ASST. ఇంజనీర్ / జెన్‌కో / మంచి జీతము / 5'11" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్: 9618579861 AJH-15340

★ SC మాల / ఏకైక కుమారుడు / B.Tech / C.GOVT. డైరెక్టర్ / మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & IT / గెజిటెడ్ ఆఫీసర్ /మంచి జీతము / 5'11" ఎత్తు / 31 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్: 8897389698 AJH-15340

★ గౌడ / B.Tech / GOVT.G.S.T. ఇన్స్‌పెక్టర్ / మంచి జీతము / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి తగిన అందమైన వధువు కావలెను. ఫోన్: 7032058965 AJH-15340

★ 37 సం. గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో బ్రో. ఫోన్: 9866724586 / 6301943220 AJH-504

★ యాదవ 65 సం.లు విడోవరు రిటైర్డు ఒంటరి కుల మత ప్రసక్తిలేని ఏ బాదరబందిలేని తోడు కావలెను విజయవాడ Urgent. డైరెక్ట్. 99127 21805, 94919 25338 AJB-194135

★ క్రిస్టియన్ 40, 6', ప్రైవేట్ జాబ్ వరుడికి వధువు కావలెను. కుల, కట్నం పట్టింపులేదు. విడోవర్స్, డైవర్సీ వారు కూడా కాల్. నో బ్రోకర్స్ జెన్యూన్ పర్సన్స్ కాల్ డైరెక్ట్. 095509 13919 AJB-225279

★ కమ్మ/సెకండ్/47సం॥లు/5X9 Well. సెటిల్డ్ గల వరుడుకు తగిన వధువు కావలెను. (కుల పట్టింపు లేదు) డైరెక్ట్‌గా సంప్రదించండి. నో బ్రోకర్స్ సెల్:8341205769 Ajd:22

★ నో క్యాస్ట్ 36 Y లోపు విడో / డైవర్స్ Pvt. JOB వధువు కావలెను. డైరెక్ట్ : కె. హర్ష, గుళ్ళపల్లి, గుంటూరు జిల్లా. సెల్ : 6301554541. AJG-203599

కళ్యాణ వేదిక

★Arya Vysya, Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Ph: 7032018248 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002747

★ Kamma, Kapu, Reddy - పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002747

★ Padmashali - పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Ph: 7032018248 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002747

★ Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002747

★ కాపు వధూవరుల స్వయంవరం /Free Register 15/DEC/2024 న కమలానగర్ వెల్ఫేర్ ఆఫీస్, ECIL, Hyderabad నందు. ఫోన్ : 9704656103, 9533608887 - వాట్సాప్ AJH-4156

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matches కై సంప్ర: Ph: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-4156

★ అన్ని కులముల డాక్టర్స్ / ఇంజనీర్స్ / గవర్నమెంట్ జాబ్స్ / బిజినెస్ / విదేశీ సంబంధాలకై సంప్రదించండి. ఫోన్ : 9100357969/9640876803 AJH-4156

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే / అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 9885144375 AJH-4156

★ కురుప/కురుమ/కురుబ : వివాహ వేదిక : 05-01-2025, ఉ॥ 9:00 గం॥లకు జిల్లా పరిషత్‌లో, కర్నూలు. ఆంధ్ర, బయోడేటా, కలర్ ఫోటోలు, రిజిస్ట్రేషన్ ఫీజు : 800/-. సెల్ : 90327 41194, 94407 56199. AJL_202925

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506/9705588313 AJH-002968

V.I.P MATRIMONY
ONLY FOR KAMMA'S
కమ్మ వారి వివాహ సంబంధాలకై ప్రత్యేకముగా నడుపబడుచున్న సంస్థ
8143538383

వధువు కావలెను

★ కమ్మ (INDIA) : 27 6" IIT IIM 50LPA 75 Cr. Seeks Merit Girl From Good Family ★ 8143538383

★ కమ్మ (INDIA): 28 6'2" BE (Bits) IIM 66LPA 20 Cr. Seeks well settled Bride with Good Looking ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 25 5'10" MS BUSINESS 500Cr. Hyd Seeks V-Fair Bride From Well Settled Family ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 26 5'11" BS (USA) BUSINESS HYD 300Cr. Seeks V.Fair Girl with Settled Family ★ 8143538383

★ కమ్మ (USA): 28 5'8" MS $220K 50 Cr. ★ 26 5'11" MS $250K 70 Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 26 6'2" V.FAIR MS. Ph.D, $150K 100Cr. Seeks INDIA / USA Bride from Good Family ★ 8143538383

★ కమ్మ (AUS): 27 6'2" MS $150K P.R. 40Cr. ★ 28 5'11" MS $200K CITIZEN 30Cr. ★ 8143538383

★ కమ్మ (DOCTOR): 27 6'1" V.FAIR MD(GM) HYD. 200Cr. ★ 26 5'10" MS (ORTHO) 500Cr. ★ 8143538383

★ కమ్మ (DOCTOR): 28 5'11" MD(DERMA) 600Cr. Seeks Doctor / Engg. Well Settled Business Family Bride ★ 8143538383

★ కమ్మ (DIVORCE): 26 6'1" MBA BUSINESS 200Cr. Own Pharma Industry Hyd. Seeks 1st/2nd Bride From Good Family. ★ 8143538383

వరుడు కావలెను

★ కమ్మ (BUSINESS): 23 5'5" V.FAIR 5'6" MBA BUSINESS Family Hyd 700Cr. Seeks Well Settled Business Boy ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 25 5'4" V.FAIR M.Sc BUSINESS 500 Cr. Seeks Well Settled Boy Job Business ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 26 5'3" V.FAIR MS BUSINESS 500 Cr. Seeks Only Business Family Boy. ★ 8143538383

★ కమ్మ (USA): 24 5'6" V.FAIR BE(IIT), MS $220K 70Cr. ★ 25 5'4" V.FAIR BE(Bits), MS $195K 50Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 23 5'7" V.FAIR Green Card BS $140K 200Cr. ★ 26 5'8" CITIZEN (US) $100K 100Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 24 5'7" MS $100K 100Cr. ★ 23 5'5" MS $120K 8Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 23 5'4" MS, BE (NIT) $180K 150Cr. ★ 25 5'8" V.FAIR MS $100K 100Cr. ★ 8143538383

★ కమ్మ (INDIA): 24 5'5" V.FAIR MBA (IIM) 52LPA 50Cr. ★ 26 5'6" V.FAIR CA 30 LPA 20Cr. ★ 8143538383

★ కమ్మ (INDIA): 23 5'4" V.FAIR BE (IIT) 45LPA 30Cr. ★ 25 5'7" V.FAIR M.Tech 26LPA 50Cr. ★ 8143538383

★ కమ్మ (DIVORCE): 24 5'6" V.FIAR IIT MS $220K 40Cr. ★ 26 5'8" V.FAIR BE, MBA 100 Cr. ★ 8143538383

శారద వివాహ వేదిక
Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com
EXCLUSIVE CHOWDARY COMMUNITY
Hyderabad. Phone: 9849413031

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 15 Cr B.Tech 40 India / 15 Cr B.Tech MS USA Citizen / 30 Cr B.Tech MS 38 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(USA రెండో పెళ్ళి): 50 Cr USA Doctor 35 / 15 Cr USA Green Card 40 / B.Tech MS 40 Cr / 15 Cr Doctor Canada / 35 B.Tech MS / 45 B.Tech MS USA / 48 B.Tech MS / 38 B.Tech MS / 32 B.Tech MS వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 40 B.Tech 15 Cr / 43 MSc 50 Cr / 10 Cr B.Tech 24L PA 39 / 15 Cr B.Tech MS 35 / 20 Cr B.Tech MS 33 / 50 Cr B.Tech 30 / 5 Cr B.Tech 29 / 20 Cr B.Tech MBA 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 Cr B.Tech 28 / 20 Cr B.Tech IIT 29 / 10 Cr B.Tech 35 / 50 Cr Business 32 / 40 Cr B.Tech MS 31 / 20 Cr B.Tech 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr B.Tech MS 26 / 70 Cr MBA 27 / 75 Cr. B.Tech MS USA Citizen వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(రెండో పెళ్ళి): 31 B.Tech IIT MS Business Hyderabad 20 Cr / 37 B.Tech 30 Cr Hyd / 40 B.Tech 15 Cr 38L PA Hyderabad / 50 Cr Business 40 Hyderabad / 15 Cr B.Tech 40 Hyderabad రెండో పెళ్ళి వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 Cr. B.Tech 25 మరియు 50 Cr. B.Tech MS, SWEEDEN 75 Cr. B.Tech MS USA సిటిజెన్ 28 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 500 Cr. MBBS MD 34 / 100 Cr MBBS MD 25 / 50 Cr MBBS MD Pediatrics / 20 Cr MBBS MD 30 / 15 Cr MBBS MD GS 31 / 20 Cr MBBS MD Pediatrics 29 / 10 Cr MBBS MD GM 35 / 20 Cr MBBS MD Ortho 34 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం Australia: 20 Cr B.Tech MS 29 PR / 5 Cr B.Tech MS 28 / 2 Cr B.Tech MS 32 / 3 Cr B.Tech MS 30 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 Cr to 500 Cr 24 to 45 B.Tech / M.Tech / MS / CA / PG Doctors India / USA /ఆస్ట్రేలియా U.K. వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B Tech MS 29/30Cr B.Tech MS 27/100Cr B.Tech MS 29/20Cr B.Tech MS 28/40 Cr B.Tech MS 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 15Cr B.Tech 26 / 70Cr Architecture 30 / 50Cr B.Tech MS 25 / 20 Cr B.Tech 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : డాక్టర్స్ India 20Cr MS General 31/15Cr Dermatology 35 / 10Cr Radiology & Gynic & Skin Doctor and ENT Dental డాక్టర్స్ వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండవ పెళ్ళి, 40 B.Tech MS Business in India / 20 Cr. 35 B.Tech Hyderabad / 25 Cr. 35 PG Doctor వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 B.Tech MS / 27 B.Tech MS / 29 B.Tech MS / 31 B.Tech MS / 33 B.Tech MS / 35 B.Tech MS వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10 Cr 25. B.arch, MS. UK. US/10Cr. BBA.28/ 29.BTech / MS / Amazon, 300k USA. అందమైన యూఎస్. UK. India. Well settled వధువులకి వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. 37 / 70 Cr. 35 / 50 Cr. 39 / 20 Cr. 35 & 37 Doctors. రెండవ పెళ్లి వధువులకు సెటిల్డ్ వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 35 Cr. BDS,MBA 29 UK వధువుకు మరియు 30 Cr. B.Tech MS USA వధువులకు వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA డాక్టర్స్ 33 Cardiologist / 29 Neurology / 28 Internal Medicine వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30Cr B.Tech 28 / 20Cr B.Tech MBA 32 / 20Cr B.Tech 25 / 50Cr MBBS PG Doctor Hyderabad వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

గమనిక
ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ లకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

• ఆర్కే RK



కొత్తపలుకు

చంద్రబాబు: నాడు, నేడు, రేపు!

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయింది. ఉద్యోగుల విషయంలో వారి పనితీరును మదింపు చేసేందుకు ఆరు నెలల కాలాన్ని ప్రొబేషనరీ పీరియడ్‌గా పరిగణిస్తారు. పనితీరు సంతృప్తికరంగా ఉంటేనే సర్వీసు క్రమబద్ధీకరిస్తారు. నాయకులకు ఈ సూత్రం వర్తించదు. ఎందుకంటే వారు ఎప్పటికప్పుడు ప్రజల మనసు గెలుచుకుంటూనే ఉండాలి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరు నెలల పనితీరును సమీక్షించుకుందాం! గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనితీరు, వ్యవహార శైలి పట్ల విరక్తి చెందిన ప్రజలు కూటమికి భారీ మెజారిటీ కట్టబెట్టారు. ప్రతిపక్ష నాయకుడి హోదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలాన్ని కూడా ప్రజలు జగన్‌కు ఇవ్వలేదు. అయినప్పటికీ జగన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడు కాకుండా పోరు. ఈ కారణంగా ముఖ్యమంత్రితో పాటు ప్రతిపక్ష నాయకుడి పాత్రను కూడా సమీక్షించుకోవడం సముచితంగా ఉంటుంది. తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తే తప్ప శాసనసభ సమావేశాలకు హాజరు

> ముఖ్యమంత్రి అంటే సీఈవో మాత్రమే కాదు, స్వతహాగా రాజకీయ నాయకుడు. రాజకీయ నాయకుడైన ముఖ్యమంత్రికి రాష్ట్రాభివృద్ధి పైనే కాకుండా తన భవిష్యత్తు రాజకీయంపై కూడా విజన్ ఉండాలి. చంద్రబాబులో ఉన్న ప్రధానమైన అవలక్షణం ఏమిటంటే, అధికారంలోకి రాగానే ఆయన రాజకీయం మరచిపోయి సీఈవో అవతారం ఎత్తుతారు. ప్రభుత్వాలకు స్వల్పకాలిక లక్ష్యాలతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలూ ఉండాలి. రాజకీయానికి వస్తే దీర్ఘకాలిక లక్ష్యం ఉండాలి. ప్రజలు కూడా ప్రభుత్వం దీర్ఘకాలంలో ఏం చేస్తుందో తెలుసుకొని అంతవరకు వేచివుండరు. ప్రభుత్వం వల్ల తమకు ఇప్పటికిప్పుడు కలుగుతున్న ప్రయోజనాలను బట్టి ఎన్నికల్లో తీర్పు ఇస్తున్నారు. 2047 నాటికి పేదరికం లేని సమాజాన్ని సృష్టిస్తామని చెబితే ప్రజల చెవికెక్కదు. ఆమాట కొస్తే పేదరికం లేని సమాజం ఎలా సాధ్యం? రానున్న నాలుగున్నరేళ్లలో ఏమి చేయబోతున్నదీ చెప్పడానికి చంద్రబాబు ప్రయత్నించాలి. ఆయన ఆలోచనలు ఆ దిశగానే ఉండాలి.

కాబోనని ప్రకటించిన జగన్‌రెడ్డి శాసనసభను బహిష్కరిస్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోయినవారు ఓటమికి కారణాలను సమీక్షించుకొని ప్రజాభిమానాన్ని తిరిగి చూరగొనడానికి ప్రయత్నించడం - మెజారిటీ సాధించినవాళ్లు తమ పని తీరుతో ప్రజల మనసు మళ్లీ గెలుచుకొనే ప్రయత్నం చేయడం సహజం. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన జగన్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకొనే బదులు ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. తన అతి మంచితనం, అతి నిజాయితీ వల్లే ఎన్నికల్లో ఓడిపోయామని ఆయన ఆత్మవంచన చేసుకుంటున్నారు. మచ్చుకైనా తనలో కనిపించని సుగుణాలను ఆపాదించుకొనే ప్రయత్నం చేయడం విడ్డూరంగా కూడా ఉంది. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు గడవక ముందే ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొందని జగన్ తనను తాను వంచించుకొనే ప్రయత్నాలు మొదలెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం ఆరు నెలల పాలన పూర్తయిన సందర్భంగా జగన్‌రెడ్డికి చెందిన రోత పత్రికలో ఒక కథనాన్ని వండి వార్చారు. ఈ కథనం ప్రకారం... "ఈ ఆరు నెలల్లో హత్యలు, దాడులతో రాష్ట్రం అల్లకల్లోలమైంది. ఆగని హత్యాచారాలతో మహిళా లోకం భీతిల్లుతోంది. అధికార వ్యవస్థపై ప్రభుత్వం కక్ష గట్టడంతో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రెడ్ బుక్ బాధితులయ్యారు. ఏడు వేలకు పైగా ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. శాంతి భద్రతలు మృగ్యం అవడంతో సామాన్యుల జీవితం ఛిద్రమైంది" అని చెప్పుకొచ్చారు. నిజానికి ఈ దారుణాలన్నీ జగన్ పాలనలోనే జరిగాయన్నది నిర్వివాదాంశం. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేకుండా పోయిందని అప్పుడు హైకోర్టు పలుమార్లు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ హక్కులను కాలరాశారు. కొంత మంది పోలీసు అధికారులను కిరాయి సైనికులుగా మార్చుకొని జగన్‌రెడ్డిని ఎదిరించిన వారిపై కేసులు పెట్టి వేధించారు. ఎంపీ రఘురామకృష్ణ రాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను చెరబట్టారు. నిస్సహాయ స్థితిలోకి నెట్టివేయబడిన ప్రజలు ఈ అరాచకాలను ఎన్నికల వరకు మౌనంగా భరించి ఎన్నికల్లో మాడు పగిలేలా తీర్పు ఇచ్చారు. ఒక ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో నిరూపించిన జగన్‌రెడ్డికి ఇప్పుడు చంద్రబాబు పాలనలో, తన హయాంలో జరిగిన అక్రమాలు, అరాచకాలు అన్నీ జరుగుతున్నట్టుగా కనిపిస్తున్నాయట! అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలకే ప్రజా ఉద్యమాలకు పిలుపు ఇచ్చారు. శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద రైతు ధర్నాలకు పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో జగన్‌రెడ్డి ఊహించుకుంటున్నంత వ్యతిరేకత లేనందున రైతు ధర్నాలు పేలవంగా జరిగాయి. వైసీపీ నాయకులు సైతం అప్పుడే ఉద్యమాలు ఏమిటి? అని విసుక్కున్నారు. కొంత మంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వదిలి వెళ్లిపోతున్నారు. నిజంగానే చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారనే అనుకున్నా జగన్‌రెడ్డి ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలంటే మరో నాలుగున్నరేళ్లు ఆగాల్సిందే. ఎందుకంటే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను ఐదేళ్లు భరించారు కదా!

ఇదీ వైరుధ్యం...

విచిత్రమేమిటంటే, చంద్రబాబు పాలన అరాచకంగా ఉందని జగన్‌రెడ్డి భావిస్తూ ఉండగా, చంద్రబాబు మెతక వైఖరి వీడాలని తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు భావిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కొంత మంది వైసీపీ నాయకులు తాము ఇంకా అధికారంలోనే ఉన్నామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మరికొంత మంది తెలుగుదేశం పార్టీకి దగ్గరై తమ అరాచకాలను కొనసాగిస్తున్నారు. తెలుగు తమ్ముళ్ల ఆగ్రహానికి ఇది కూడా ఒక కారణం. 'చంద్రబాబు నాయుడు బతికుంటే 2029 తర్వాత మేము అధికారంలోకి వచ్చి ఆయనను జైల్లో పెడతాం' అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా నోరు పారేసుకున్నారు. మనిషి లక్షణాలు ఉన్నవారు ఎవరూ... 'బతికుంటే' అన్న మాట వాడరు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారిని కూడా జీవించాలని కోరుకుంటాం. చంద్రబాబును వృద్ధుడిగా పరిగణిస్తున్న విజయసాయిరెడ్డి కౌమార దశలో ఏమీ లేరే? ఆయనకు కూడా 68 ఏళ్లు వస్తున్నాయి. చంద్రబాబుకు, ఆయనకూ మధ్య వయసు తేడా ఆరేళ్లు మాత్రమే. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను ఎవరైనా 'బతికివుంటే' అని అనివుంటే అరెస్టు చేసి లాకప్‌లో చావగొట్టి ఉండేవారు. 'బోసడీకే' అన్న పదం వాడినందుకే కదా తెలుగుదేశం నాయకుడు పట్టాభిని అరెస్టు చేయించి పోలీసులతో దొంగ దెబ్బలు కొట్టించారు. ఆయన ఇంటిపై దాడి చేయించారు. చంద్రబాబును బతికివుంటే అని అంటున్న విజయసాయిరెడ్డి స్వేచ్ఛగానే తిరుగుతున్నారు కదా? ఆయనపై ఎవరూ దాడి చేయలేదే? హత్యకు కుట్ర చేస్తున్నారని కేసులు కట్టలేదే? ఈ తేడా చాలు- జగన్ హయాంలో జరిగిన అరాచకాలు, అక్రమాలు చంద్రబాబు పాలనలో జరగడం లేదని చెప్పడానికి! తాను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుంటేనే ప్రజలకు మంచి జరుగుతుందని అనుకోవడం జగన్‌రెడ్డి ఇష్టం. అదే నిజమైతే 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన తనను ప్రజలు 11 సీట్లకే ఎందుకు పరిమితం చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలి కదా? ఆత్మస్తుతి, పరనింద ఎన్నికల్లో ఓట్లు తెచ్చిపెట్టవు. చంద్రబాబు ఆరు నెలల పాలనలో నమోదైన కేసులు, జగన్‌రెడ్డి హయాంలో జరిగిన అరాచకాల్లో కొన్నింటికి సంబంధించినవి మాత్రమే. నాడు జరిగిన అక్రమాలు బయటపడుతున్న కొద్దీ ప్రజలకు మైండ్ బ్లాంక్ అవుతోంది. జగన్ అండ్ కో వెనకేసుకు వస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఆయనకు కిరాయి సైనికులుగా పనిచేసిన వారే. అందుకే తట్టుకోలేకపోతున్నారు. నిజానికి చంద్రబాబు ఇప్పటికీ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగానే విజయసాయిరెడ్డి వంటివారు నోరు పారేసుకోగలుగుతున్నారు.

అక్కడే ఎందుకో...

సెకీని అడ్డుపెట్టుకొని అదానీతో కుదుర్చుకున్న సౌర విద్యుత్ కుంభకోణంలో రూ.1750 కోట్లు ముడుపుల రూపంలో చేతులు మారాయని అమెరికాలోని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం జగన్‌పై చర్యలు తీసుకోకుండా మీన మేషాలు లెక్కిస్తున్నది. ఇందుకు రాజకీయ కారణాలు ఉండవచ్చునుగానీ ప్రజలు మాత్రం ఈ తాత్సారాన్ని హర్షించడం లేదు. ముఖ్యమంత్రి అనుసరిస్తున్న ఈ సాచివేత ధోరణి వల్ల జగన్ అండ్ కో రెచ్చిపోతున్నారు. దొంగతనం చేసినవాడే దొంగా దొంగా అని అరచినట్టుగా సౌర విద్యుత్ కుంభకోణంపై జగన్‌రెడ్డి మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబే తప్పు చేసినట్టుగా జగన్ అండ్ కో మాట్లాడుతున్నారు. చంద్రబాబు స్థానంలో జగన్‌రెడ్డి ఉండివుంటే ఈ వ్యవహారంలో చంద్రబాబును అరెస్టు చేయించకుండా ఉండేవారా? సౌర విద్యుత్ వ్యవహారంలో ఢిల్లీ హైకోర్టులో ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికలపై పరువు నష్టం దావా వేసిన జగన్‌రెడ్డి ఒక గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. కేసు పూర్వాపరాలను తెలుసుకోకుండానే, అవతలి పక్షం అభిప్రాయం తెలుసుకోకుండానే న్యాయస్థానాలు ఇలాంటి గ్యాగ్ ఆర్డర్లు ఎలా ఇస్తాయో తెలియదు! అంతకు ముందు విజయసాయిరెడ్డి కూడా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసి ఉపశమనం పొందారు. వీరందరూ ఢిల్లీ హైకోర్టునే ఎందుకు ఎంచుకుంటున్నారో తెలియదు. నేరం జరిగినట్టు ఆరోపణలు వచ్చిన ప్రాంతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండగా ఢిల్లీ హైకోర్టుకు వెళ్లడం ఏమిటి? ఏది ఏమైనా జగన్‌రెడ్డి అండ్ కో పెడబొబ్బలు పెడుతున్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులు లేవు. సోషల్ మీడియాలో పచ్చి బూతులతో విరుచుకుపడుతున్న వారిపై కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆగ్రహం ప్రదర్శించాకే ప్రభుత్వంలో కదలిక వచ్చింది. భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట అరాచకంగా ఇళ్లలోని ఆడవారి వ్యక్తిత్వ హననానికి పాల్పడటాన్ని ఏ చట్టం మాత్రం అనుమతిస్తుంది? ఈ ఆరు నెలల్లోనే రాష్ట్రంలో అరాచక పరిస్థితులు నెలకొన్నాయని జగన్ అండ్ కో భావిస్తుంటే అది వారి ఇష్టం.



> 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారని చంద్రబాబు చెప్పారు. అప్పుడు ఆయన ప్రజలతో మమేకం అయ్యారు. పాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. రాజకీయ కార్యాచరణకు కూడా తగిన సమయం కేటాయించారు. 1999లో మళ్లీ గెలిచిన తర్వాత పూర్తిగా సీఈవో అవతారం ఎత్తారు. ఆహా ఓహో అనే వాళ్ల మాటలు నమ్మి ప్రజలకు దూరం అయ్యారు. ఇప్పుడు మళ్లీ అటువంటి పరిస్థితి రాకూడదు. రాజకీయాలకు తగినంత సమయం కేటాయించకపోతే మళ్లీ కింద పడి లేవడానికి ఆయనకు వయసు సహకరించదు. ముఖ్యమంత్రిగా అద్భుత పనితీరును ప్రదర్శించడం అంటే విజన్‌తో ముందుకు వెళ్లడమే కాదు, రాజకీయ ప్రత్యర్థిని బలహీనపరుస్తూ తాను రాజకీయంగా బలపడటం కూడా! ఈ విషయంలో వెనుకాడితే అది చారిత్రక తప్పిదం అవుతుంది. జగన్‌రెడ్డి వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఏ కారణం వల్లనైనా అతను మళ్లీ బలపడి అధికారంలోకి వస్తే ఆ పాపం చంద్రబాబుదే అవుతుంది. తనకోసం కాకపోయినా రాష్ట్రంకోసమైనా జగన్‌రెడ్డి వంటి శక్తులు బలపడకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఇకపై చంద్రబాబు వ్యవహార శైలి, నిర్ణయాలు ఈ దిశగానే ఉండాలి, ఉంటాయనీ ఆశిద్దాం.

ఎప్పటి సంగతో సరే... ఇప్పుడు మాకేంటి?

ఇప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు పనితీరు విషయానికి వద్దాం. ఏ ముఖ్యమంత్రి కూడా ఆరు నెలల్లో అద్భుతాలు సృష్టించలేరు. అందునా కుప్పకూలిన వ్యవస్థలను గాడిలో పెట్టడమే ఇప్పుడు ప్రభుత్వానికి అతి పెద్ద సవాల్‌గా ఉంది. ఇక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చెప్పే పనిలేదు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలలో ప్రధానమైనవి ఇంకా అమలు కావడం లేదు. ప్రజలు కూడా వేచి చూసే ధోరణితోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రెండు రోజుల పాటు సమావేశం నిర్వహించారు. శుక్రవారం నాడు 'విజన్-2047' ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు వ్యవహార శైలిని నిశితంగా పరిశీలిస్తే, ఆయనలో కొన్ని పాత వాసనలు పోయినట్టుగా కనిపించడం లేదు. ముఖ్యమంత్రి అంటే సీఈవో మాత్రమే కాదు, స్వతహాగా రాజకీయ నాయకుడు. రాజకీయ నాయకుడైన ముఖ్యమంత్రికి రాష్ట్రాభివృద్ధి పైనే కాకుండా తన భవిష్యత్తు రాజకీయంపై కూడా విజన్ ఉండాలి. చంద్రబాబులో ఉన్న ప్రధానమైన అవలక్షణం ఏమిటంటే, అధికారంలోకి రాగానే ఆయన రాజకీయం మరచిపోయి సీఈవో అవతారం ఎత్తుతారు. ప్రభుత్వాలకు స్వల్ప కాలిక లక్ష్యాలతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలూ ఉండాలి. రాజకీయానికి వస్తే దీర్ఘకాలిక లక్ష్యం ఉండాలి. ప్రజలు కూడా ప్రభుత్వం దీర్ఘకాలంలో ఏం చేస్తుందో తెలుసుకొని అంత వరకు వేచివుండరు. ప్రభుత్వం వల్ల తమకు ఇప్పటికిప్పుడు కలుగుతున్న ప్రయోజనాలను బట్టి ఎన్నికల్లో తీర్పు ఇస్తున్నారు. దీని ప్రకారం విజన్-2047 డాక్యుమెంటు ప్రజలకు ఎక్కదు. 2004కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విజన్-2020 అని పలవరించేవారు. ఆ క్రమంలో విద్యుత్ సంస్కరణలను అమలు చేశారు. ఫలితంగా 2004లో అధికారాన్ని కోల్పోయారు. ప్రజలను సమాయత్తపరచకుండా సంస్కరణలను అమలు చేస్తే ఫలితం అలాగే ఉంటుంది. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పవర్ రిఫామ్స్ అమలు చేసి తాను పవర్ కోల్పోయానని చంద్రబాబు స్వయంగా చెప్పుకొన్నారు. రాష్ట్రాభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమేగానీ వాటి వల్ల ఓట్లు వస్తాయా లేదా అన్నది కూడా చూసుకోవాలి కదా! అందుకే ఈ ఐదేళ్లలో ఏం చెయ్యాలి, ఏం చేయగలమో చెప్పుకోవాలి. జగన్ హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారు కనిపించక నిరాసక్త వాతావరణం ఉండేది. ఇప్పుడు ఆరు నెలల్లోనే టీసీఎస్, గూగుల్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకోగలిగారు. ప్రజలు గుర్తించేది ఇలాంటి వాటినే! 2047 నాటికి పేదరికం లేని సమాజాన్ని సృష్టిస్తామని చెబితే ప్రజల చెవికెక్కదు. ఆమాట కొస్తే పేదరికం లేని సమాజం ఎలా సాధ్యం? సంపన్న దేశాలలో సైతం పేదరికం ఉంది. అక్కడి ప్రభుత్వాలు కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న నాలుగున్నరేళ్లలో ఏమి చేయబోతున్నదీ చెప్పడానికి చంద్రబాబు ప్రయత్నించాలి. ఆయన ఆలోచనలు ఆ దిశగానే ఉండాలి. "నా మటుకు నేను 2047 వరకు బతికే అవకాశమే లేదు. అలాంటప్పుడు అప్పుడు ఆవిష్కృతమయ్యే అద్భుతంపై నాకు ఆసక్తి ఏముంటుంది?" అందరూ ఇలాగే ఆలోచిస్తారు. చంద్రబాబు అద్భుతమైన విజన్ ఉన్న నాయకుడే, కాదనలేము. అయితే నాయకుడు అనేవాడు ప్రజలను తనతో పాటు నడిపించగలగాలి. ప్రజలను వదిలేసి వేగంగా ముందుకు పరిగెత్తకూడదు. అందుకే స్వల్పకాలిక, అంటే ఈ నాలుగున్నరేళ్లలో ఏమి చేయబోతున్నదీ ప్రజలకు స్పష్టంగా వివరించి ఆ తర్వాత దీర్ఘకాలిక ప్రణాళికల అమలుకు ప్రయత్నించాలి. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు ప్రధానంగా ఐవీఆర్ఎస్, ఆర్టీజీఎస్ వంటి వాటిపై ఆధారపడ్డారు. తాను నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రభుత్వం పట్ల 70 శాతానికి పైగా ప్రజలు సంతృప్తి చెందుతున్నారని వస్తోందని మురిసిపోయారు. ఎంత బాగా పనిచేసినా మనవంటి సంక్లిష్ట సమాజంలో 70 శాతం ప్రజలు ప్రభుత్వాల పట్ల సానుకూలంగా ఉండరు. ఈ మౌలిక విషయాన్ని మరచిపోయి చంద్రబాబు తనను తాను మభ్యపెట్టుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి కూడా తనను తాను మభ్యపెట్టుకున్నారు. ప్రజల మనసులో ఏముందో తెలుసుకోవడం ఆషామాషీ విషయం కాదు. అందుకే ఈ మధ్య ఎగ్జిట్ పోల్స్ అంచనాలు కూడా తప్పుతున్నాయి. అయినా ఐవీఆర్ఎస్ అని పట్టుకొని వేలాడటం ఎందుకు? ముఖ్యమంత్రిని సంతృప్తిపరిచే విధంగా నివేదికలు ఇవ్వడం అధికారులకు పరిపాటే. అంచేత అలాంటి నివేదికలపై ఆధారపడకుండా సొంత వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి. గత అనుభవాల నుంచి ఏమి నేర్చుకున్నాము అన్న దాన్ని బట్టి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. రియల్ టైం గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) కూడా ఈ కోవలోకే వస్తుంది. అమరావతిలోని కంట్రోల్ రూంలో కూర్చొని ఎక్కడ ఏం జరుగుతోందో తెలుసుకోవడం పాలకుడిగా ముఖ్యమంత్రికి అవసరం. అదే సమయంలో ప్రజలకు నష్టం కలిగించేవి ఏమీ జరగకుండా చూడటం, ప్రజలకు మేలు చేసే విధంగా వ్యవస్థలతో పనిచేయించడం చాలా ముఖ్యం. ఇది జరగనప్పుడు ప్రజలు సంతృప్తి చెందరు.

> ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా ఆయన ఎన్నికల్లో అనుకూల ఫలితాలే పొందుతున్నారు. తాజా ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ రాకపోయినా తన ప్రభుత్వం మనుగడకు ఇబ్బంది లేకుండా ఏం చేయాలో అది చేస్తూ, ఎవరిని ఎక్కడ కట్టడిచేయాలో అది చేస్తూ ప్రభుత్వాన్ని సాఫీగా నడుపుతున్నారు. చంద్రబాబు కూడా ఈ మోడల్‌నే అనుసరించాలి.

జనం మనసు తెలుసుకోవడమెలా?

2014-19 మధ్య రియల్ టైం గవర్నెన్స్‌ను అమలు చేసినా అధికారం పోవడానికి కారణం అన్వేషించాలి కదా? ఆ పని చేయకుండా పాత పాటే అందుకుంటే మళ్లీ ప్రతికూల ఫలితాలే వస్తాయి. అమరావతిలో కూర్చొని ఏ గ్రామంలో ఏ వీధిలైటు వెలుగుతున్నదో లేదో చెప్పగలను అని గతంలో చంద్రబాబు ఒక సందర్భంలో చెప్పారు. పాలనలో మెరుగులు దిద్దడానికి మాత్రమే ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. ప్రజలకు ఉపశమనం కలగనప్పుడు, నువ్వు తెలుసుకుంటే మాకేమిటి? నువ్వు తెలుసుకోకపోతే మాకేమిటి? అని ప్రశ్నిస్తారు. టెక్నాలజీ వాడకం విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ముఖ్యమంత్రి ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఏఐ వల్ల ప్రజలకు ఏమి మేలు జరుగుతుందో వివరించి వారికి ఆ మేలు జరిగేలా చూడాలి. అప్పుడు మాత్రమే రాజకీయంగా ఉపయోగం ఉంటుంది. టెక్నాలజీ వాడకంలో గానీ, కష్టపడటంలో గానీ చంద్రబాబుకు మరెవరూ సాటిరారు. అయినా తాను రాజకీయంగా ఇన్ని ఒడుదొడుకులు ఎందుకు ఎదుర్కోవలసి వచ్చిందో చంద్రబాబు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే తీసుకుందాం. ఆయన పెద్దగా కష్టపడినట్టు కనిపించరు. కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లయినా ఆయన ఎన్నికల్లో అనుకూల ఫలితాలే పొందుతున్నారు. తాజా ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ రాకపోయినా తన ప్రభుత్వం మనుగడకు ఇబ్బంది లేకుండా ఏం చేయాలో అది చేస్తూ, ఎవరిని ఎక్కడ కట్టడి చేయాలో అది చేస్తూ ప్రభుత్వాన్ని సాఫీగా నడుపుతున్నారు. చంద్రబాబు కూడా ఈ మోడల్‌నే అనుసరించాలి. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌నే తీసుకుందాం. రెండు రోజులపాటు ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేవరకు సమావేశాలు జరిగాయి. అంత సుదీర్ఘ సమావేశాలు అవసరమా? తన ప్రభుత్వానికి ఏమి కావాలి? ఏం జరుగుతోంది? ముందుగానే తెలుసుకొని ఆ విధంగా అధికారులకు దిశా నిర్దేశం చేస్తే సరిపోతుంది కదా! గంటల తరబడి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల మనసు చూరగొనలేరు. నాయకుడు అంటే తీరికగా ఉంటూ, తెలివిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకొనేవాడు అయి ఉండాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీలో ఈ లక్షణం పుష్కలంగా ఉంది. అందుకే ఆయన సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారు. క్షణం తీరిక లేదు దమ్మిడీ ఆదాయం లేదు అన్నట్టుగా ఉండకూడదు. చంద్రబాబులో పాత వాసనలు పోని పక్షంలో 2029 పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంటుంది. కలెక్టర్ల సమావేశంలో మద్యం విధానం చర్చకు వచ్చినప్పుడు మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారా? బెల్టు షాపులు ఎక్కడైనా పెట్టారా? లేదా? అన్నది తెలుసుకోవడానికి మందు బాబులకు ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ చేసి ఫీడ్ బ్యాక్ తెలుసుకుందామని చంద్రబాబు సూచించగా ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా వ్యతిరేకించారు. మందుబాబులకు ఫోన్ చేస్తే నోటికి తోచింది చెబుతారు కనుక అది సరైనది కాదని ఆ అధికారి చెప్పుకొచ్చారు. ప్రజల్లో అసంతృప్తి ఉంటే ఏదో ఒక రూపంలో బయటపడుతుంది. జగన్ పాలనలో నాసి రకం మద్యం తాగి అనేక మంది రోగాల బారినపడ్డారు. ఐవీఆర్ఎస్ సర్వే జరిపించకపోయినా మందుబాబులు అసంతృప్తితో ఉన్నారన్న విషయం తెలిసిపోయింది. అయినా జగన్ పట్టించుకోలేదు. అది వేరే విషయం. జగన్‌రెడ్డి పాలన పట్ల ప్రజలు విరక్తి చెందడానికి కారణాలు గుర్తించి ప్రస్తుత ప్రభుత్వంలో అవి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఏ సర్వేలూ అవసరం ఉండవు. కలెక్టర్ల సమావేశంలో కూడా స్వల్పకాలిక కార్యాచరణతో కూడిన టార్గెట్లపై చర్చ జరగలేదు. క్షేత్ర స్థాయి పరిస్థితులు నిత్యం ప్రజల్లో ఉండే పార్టీ కార్యకర్తలకు తెలిసినట్టుగా అధికారులకు తెలియవు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కార్యకర్తల అభిప్రాయాలు సేకరించే కార్యక్రమం నిర్వహిస్తే కావాల్సినంత ఫీడ్ బ్యాక్ లభిస్తుంది. ముఖ్యమంత్రుల మెప్పు పొందడానికే అధికారులు పరిమితం అవుతారు. 'తల్లికి వందనం' అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని ఒక్క కలెక్టర్ కూడా చెప్పలేదే? మంచా- చెడా అన్నది పక్కన పెడితే ప్రజలు సంక్షేమ పథకాలకు అలవాటు పడ్డారు. వారికి అవి సకాలంలో అందకపోతే ఎంత గొప్ప భవిష్యత్తును ఆవిష్కరించినా పోపోవయ్యా అనే అంటారు. పాలనలో వాట్సాప్ విధానాన్ని ప్రవేశపెడతారో లేక మరో రకంగా పాలిస్తారో మాకెందుకు? మాకు రావాల్సినవి ఇవ్వండి, ఇస్తామన్నవి ఇవ్వండి అని మాత్రమే అడుగుతారు. ఇదే స్వల్పకాలిక కార్యాచరణ అంటే. స్వల్పకాలిక కార్యాచరణను అమలు చేసుకుంటూ దీర్ఘకాలిక కార్యాచరణకు పూనుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. అలా కాకుండా ఐవీఆర్ఎస్, ఆర్టీజీఎస్ వంటి పదాలను వల్లెవేయడం వల్ల ఫలితం ఉండదు. 2004, 2019లో తెలుగుదేశం పార్టీ ఎందుకు ఓడిపోయిందో కారణం చంద్రబాబుకు తెలుసు. ఆయన విజన్‌ను మెచ్చుకునేవాళ్లు ఓటర్లు

> 'చంద్రబాబు నాయుడు బతికుంటే 2029 తర్వాత మేము అధికారంలోకి వచ్చి ఆయనను జైల్లో పెడతాం' అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా నోరు పారేసుకున్నారు. మనిషి లక్షణాలు ఉన్నవారు ఎవరూ... 'బతికుంటే' అన్నమాట వాడరు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారిని కూడా జీవించాలని కోరుకుంటాం. చంద్రబాబును వృద్ధుడిగా పరిగణిస్తున్న విజయసాయిరెడ్డి కౌమార దశలో ఏమీ లేరే? ఆయనకు కూడా 68 ఏళ్లు వస్తున్నాయి. చంద్రబాబుకు, ఆయనకూ మధ్య వయసు తేడా ఆరేళ్లు మాత్రమే. చంద్రబాబును బతికివుంటే అని అంటున్న విజయసాయిరెడ్డి స్వేచ్ఛగానే తిరుగుతున్నారు కదా? ఆయనపై ఎవరూ దాడి చేయలేదే? హత్యకు కుట్ర చేస్తున్నారని కేసులు కట్టలేదే? ఈ తేడా చాలు- జగన్ హయాంలో జరిగిన అరాచకాలు, అక్రమాలు చంద్రబాబు పాలనలో జరగడం లేదని చెప్పడానికి!

కారు. అందుకే ఆయన పరిస్థితి ఇంట్లో ఈగల మోత బయట పల్లకీ మోత అన్నట్టుగా ఉంటోంది.


రాష్ట్రం కోసమైనా...

తాను ఇప్పుడు చంద్రబాబు ఫోర్ పాయింట్ ఓ (4.0) అని ఆయన చెప్పుకొంటున్నారు. 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారని కూడా చెప్పారు. అప్పుడు ఆయన ప్రజలతో మమేకం అయ్యారు. పాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. రాజకీయ కార్యాచరణకు కూడా తగిన సమయం కేటాయించారు. 1999లో మళ్లీ గెలిచిన తర్వాత పూర్తిగా సీఈవో అవతారం ఎత్తారు. ఆహా ఓహో అనేవాళ్ల మాటలు నమ్మి ప్రజలకు దూరం అయ్యారు. ఇప్పుడు మళ్లీ అటువంటి పరిస్థితి రాకూడదు. రాజకీయాలకు తగినంత సమయం కేటాయించకపోతే మళ్లీ కింద పడి లేవడానికి ఆయనకు వయసు సహకరించదు. ముఖ్యమంత్రిగా అద్భుత పనితీరును ప్రదర్శించడం అంటే విజన్‌తో ముందుకు వెళ్లడమే కాదు, రాజకీయ ప్రత్యర్థిని బలహీనపరుస్తూ తాను రాజకీయంగా బలపడటం కూడా! ఈ విషయంలో వెనుకాడితే అది చారిత్రక తప్పిదం అవుతుంది. జగన్‌రెడ్డి వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఏ కారణం వల్లనైనా అతను మళ్లీ బలపడి అధికారంలోకి వస్తే ఆ పాపం చంద్రబాబుదే అవుతుంది. తనకోసం కాకపోయినా రాష్ట్రం కోసమైనా జగన్‌రెడ్డి వంటి శక్తులు బలపడకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఇకపై చంద్రబాబు వ్యవహార శైలి, నిర్ణయాలు ఈ దిశగానే ఉండాలి, ఉంటాయనీ ఆశిద్దాం. కూటమి ప్రభుత్వం పట్ల ప్రస్తుతం ప్రజల్లో సంతృప్తిగానీ, అసంతృప్తిగానీ లేవు. ఇకపై ప్రభుత్వ పనితీరు, కూటమి ఎమ్మెల్యేల వ్యవహార శైలిని బట్టి ప్రజల అభిప్రాయం మారుతుంది. తాజా ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పరిగెత్తారు. ఈ విషయాన్ని కూటమి నేతలు అనుక్షణం గుర్తుపెట్టుకుంటే వారికే మంచిది!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

భాషా ప్రయుక్త రాష్ట్రాల పథనిర్దేశకుడు

> బ్రిటిష్ వారి హయాంలో రెండుసార్లు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రెండు సార్లు నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు, ఐదవ నిరాహార దీక్షను తెలుగు రాష్ట్రం కోసం చేస్తూ 1952 డిసెంబర్ 15న ఆత్మార్పణమయ్యారు. ఆయన మృతికి అనకాపల్లి, విశాఖపట్నం, నెల్లూరు, సూళ్లూరుపేట, అనంతపురం, ఆదోని, అరక్కోణం, బళ్లారి, కోలారు... ఇలా స్పందించని తెలుగు ప్రాంతం లేనేలేదు.



పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల నిరాహార దీక్ష ఫలితంగా ఆంధ్రరాష్ట్రం 1953 అక్టోబర్ 1న ఏర్పడింది. ఇది దేశంలో పలుచోట్ల భాష ఆధారంగా రాష్ట్రాలు రావాలని ఆకాంక్షకు కొత్త జీవం పోసింది. తెలుగు ప్రాంతాలను కొన్నిటిని కలిపి, మరి కొన్నింటిని ఇతర రాష్ట్రాలకు జోడించి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మిగిలిన మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రాంతం, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రూపొందాయి. 1960లో మహారాష్ట్ర, గుజరాత్; 1966లో పంజాబ్, హర్యానా రాష్ట్రాలేర్పడ్డాయి. పొట్టి శ్రీరాములు దీక్ష ఫలితంగానే భారతదేశపు రాజకీయ చిత్రపటం పునర్లిఖితమైంది. కాబట్టే పొట్టి శ్రీరాములును 'మెర్కేటర్ ఆఫ్ ఇండియా' అంటారు. మరోరకంగా చెప్పాలంటే భారతదేశపు భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు.

1901 మార్చి 16న మద్రాసులో జన్మించిన పొట్టి శ్రీరాములు. 1930 ఏప్రిల్ 1న గాంధీజీని కలిసిన రెండు వారాల తరువాత తను చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాన్ని వదిలేసి, సత్యాగ్రహిగా సబర్మతి ఆశ్రమంలో చేరారు. కఠోర జైలు శిక్షలననుభవించిన శ్రీరాములు, గాంధీజీ సలహా మీద బీహార్ భూకంప బాధితులకు ఎనలేని సేవ చేశారు. 1937-38 కాలంలో అద్దంకికి 20 కిలోమీటర్ల దూరంలో ఉండే మార్రేళ్ల గ్రామంలో చందాలు పోగు చేసి, తాగుడు నుంచి బయటపడిన మిత్రుల చేత వైద్యశాలను నిర్మింపజేశారు.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూనే ఖాదీ ప్రచారం, హిందూ-ముస్లిం ఐక్యత, రెల్లి కార్మికుల సమస్యలు, మద్యపాన నిర్మూలన, జైలు సంస్కరణలు, విద్యార్థుల సమస్యలు వంటి వాటి కోసం కృషి చేసిన సాహసి. హరిజన దేవాలయ ప్రవేశం కోసమే కాకుండా, వారి ఇతర హక్కుల కోసం బ్రిటిష్ వారి హయాంలో రెండుసార్లు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రెండు సార్లు నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు ఐదవ నిరాహార దీక్షను తెలుగు రాష్ట్రం కోసం చేస్తూ 1952 డిసెంబర్ 15న ఆత్మార్పణమయ్యారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకి తొలి స్పీకరైన బులుసు సాంబమూర్తి అద్దె ఇల్లు (126, రాయపేట హైరోడ్, మద్రాస్)లో 1952 అక్టోబర్ 19 ఉదయం 10 గంటలకు శ్రీరాములు తన నిరాహార దీక్షను ప్రారంభించారు. దీక్షకు ముందు 17 ముఖ్యాంశాలతో కూడిన పత్రాన్ని పొట్టి శ్రీరాములు విడుదల చేశారు. ఆయన ఆరోగ్యాన్ని గమనించి, సలహాలు ఇవ్వడానికి తొలుత డాక్టర్ కేఎల్ కాంతారావు, ఆ తర్వాత డా. ఎ.వి అవధాని, లెఫ్టినెంట్ కల్నల్ తాడేపల్లి శంకర శాస్త్రి, డా. కస్తూరి నారాయణమూర్తితో ఒక మెడికల్ బోర్డుగా ఏర్పాటయ్యారు.

అక్టోబర్ 19న 54 కిలోల బరువున్న శ్రీరాములు, 43వ రోజుకి 42 కిలోలకు తగ్గారు. డిసెంబర్ 15 రాత్రి 11గంటల 20 నిమిషాలకు పొట్టి శ్రీరాములు శ్వాస ఆగిపోయింది. అప్పటికి ఆయన బరువు 38 కిలోలు. దీక్ష సమయంలో పొట్టి శ్రీరాములు ఆరోగ్యానికి సంబంధించి డాక్టర్ కస్తూరి నారాయణమూర్తి తర్వాతి కాలంలో చాలా వివరమైన మెడికల్ రిపోర్టు తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించారు. పొట్టి శ్రీరాములు తమ్ముడు రంగయ్య గుప్త, మేనల్లుడు ఎన్నార్ గుప్త అక్కడే ఉన్నారు. ఈ సమాచారం తెలియగానే మద్రాసు మాంబళంలో ఉన్న స్వామి సీతారామ్ హుటాహుటిన వచ్చేసారు. విజయవాడలో ఉన్న ప్రకాశం పంతులుకు టెలిఫోన్ ద్వారా సమాచారం అందించారు. విజయవాడ పురపాలక సంఘం అధ్యక్షుడైన తెన్నేటి చలపతిరావు మద్రాసుకు బయలుదేరారు.

సాంబమూర్తి ఇల్లు ఒక తీర్థంగా మారి ఉదయానికి 'శ్రీరాములకు జోహార్, 'ఆంధ్ర రాష్ట్రం కావాలి' అనే నినాదాలతో మార్మోగింది. అనకాపల్లి, విశాఖపట్నం మొదలుకొని నెల్లూరు, సూళ్లూరుపేట అటు అనంతపురం, ఆదోని ఇటు అరక్కోణం, బళ్లారి, కోలారు... ఇలా స్పందించని తెలుగు ప్రాంతం లేనేలేదు. ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకి తెన్నేటి విశ్వనాథం శాసనసభ సభ్యత్వానికి రాజీనామా ఇస్తున్నట్టు ప్రకటించారు. ఇటీవల కాలంలో వాట్సప్‌లో గిరికీలు కొట్టే మెసేజ్‌లో పొట్టి శ్రీరాములు అనామకంగా కన్నుమూశారన్న సమాచారం ఆధారరహితం, పూర్తిగా తప్పు. మధ్యాహ్నం రెండున్నరకు జన సమూహం ఇసుక వేస్తే రాలనంతగా పెరిగింది.

'కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్' సభలో డా. సర్వేపల్లి రాధాకృష్ణ నిర్వివాద ప్రాంతాలతో తెలుగు రాష్ట్రం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్య తీసుకుందనే ప్రకటన చేసినప్పటికీ, పొట్టి శ్రీరాములును పోగొట్టుకున్న విషాదాన్ని తెలుగు జనం హృదయాల నుంచి అది తీసివేయలేకపోయింది. నినాదాల మధ్య, అలంకరించిన రథం మీద పొట్టి శ్రీరాములు భౌతిక దేహాన్ని ఉంచి ఊరేగింపుగా సాంబమూర్తి ఇంటి నుంచి సాగిన యాత్ర పొట్టి శ్రీరాములు పుట్టిన అణ్ణాపిళ్ళై వీధిలో 163 నెంబర్ ఇంటి దగ్గర కొంతసేపు ఆగి, చూళైలోని వైశ్యదహన స్థానానికి సాయం కాలానికి చేరింది.

2003లో రామచంద్ర గుహ 'ది హిందూ' పత్రికలో వ్యాసం రాస్తూ తెలుగు ప్రాంతంలో పొట్టి శ్రీరాములును కొందరు గుర్తుపెట్టుకుని ఉండవచ్చు కానీ, ఇతర భాషాప్రయుక్త రాష్ట్రాల్లో ఆయన త్యాగాన్ని దాదాపు గుర్తుంచుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ ప్రతి నవంబర్ ఒకటవ తేదీ వివిధ రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల రాజభవన్ కార్యాలయాల్లో ఫౌండేషన్ డే కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయని వార్తలు చూస్తూ ఉంటాం. కనీసం ఆ సందర్భంలో అయినా పొట్టి శ్రీరాములు దార్శనికమైన త్యాగాన్ని ప్రస్తుతించినట్టు కనబడటం లేదు.

పొట్టి శ్రీరాములు జీవితం అనుక్షణం సమరం, అవిరళ కష్టగాథ, మహత్తర త్యాగ గీతం, అపూర్వ ప్రేమ పుష్పాంజలి, కరుణార్ద్ర కావ్యం.

• డా. నాగసూరి వేణుగోపాల్



సుమధురం

వైభవంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

• అలరించిన అలనాటి మధుర గీతాలు • సందడి చేసిన సినీ, రాజకీయ రంగ ప్రముఖులు

"లేచింది.. నిద్ర లేచింది మహిళా లోకం.. దద్దరిల్లింది పురుష ప్రపంచం".. అంటూ గుండమ్మ కథ సినిమాలోని ఎన్టీఆర్ పాట మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసింది.

"చిలక కొట్టుడు కొడితే చిన్నదానా.. పలకమారి పోతావే పడుచుదానా" అంటూ యమగోల సినిమాలోని ఈ పాట కుర్రకారు హృదయాలను కట్టిపడేసింది.



ఇలా ఎన్టీఆర్ సినిమాల్లోని ఎన్నో ఎన్నెన్నో అద్భుత సినీ గీతాలు నాటి నుంచి నేటి వరకు సినీ అభిమానులకు వినోదాన్ని పంచుతూనే ఉన్నాయి. ఎన్టీఆర్ సినీ జీవితం 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పోరంకిలో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల వేళ ఆ మధుర గీతాలు మరోసారి ఎన్టీఆర్ అభిమానుల హృదయాలను దోచుకున్నాయి. ఎన్టీఆర్ సినిమాల్లోని చారిత్రక పాటలకు సత్య అండ్ టీం వారి నాటకరూప ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. 'ఏ పేరు వింటే తెలుగోడు తన రొమ్ము విరుచుకొని'... అనే సాగర్ రచించిన ఎన్టీఆర్ యాంథమ్‌ను ప్రదర్శించినప్పుడు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రముఖ నటి, అలనాటి అందాల తార జయప్రద, నటి ప్రభ, దివంగత సినీ హీరో కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, సీనియర్ నేత నన్నపనేని రాజకుమారి, ఎంపీ కేశినేని చిన్ని, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్‌రావు, యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, శ్రీరాం రాజగోపాల్, కొలికపూడి శ్రీనివాస్, కామినేని శ్రీనివాస్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ప్రముఖ నటుడు బాబూ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, కృష్ణంరాజు సతీమణి శ్యామల, హీరోయిన్లు జయప్రద, ప్రభ, టీడీ జనార్దన్, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణప్రసాద్, కామినేని శ్రీనివాస్



డోకిపర్రులో సీఎం చంద్రబాబు

డోకిపర్రు భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రికి ఆలయ వేద పండితులతో వేద ఆశీర్వచనాలు పలికారు. ఆలయ ధర్మకర్తలైన కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఆయనకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని, స్వామి లడ్డూ ప్రసాదాన్ని బహూకరించారు. 6లో

ఉత్సాహంగా శ్రీమతి అమరావతి పోటీలు 8లో

కూటమి హవా!

నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుదారుల విజయం

ఎన్టీఆర్ జిల్లాలో 242.. కృష్ణాజిల్లాలో 209 సాగు నీటి సంఘాలకు ఎన్నికలు

- తొమ్మిది చోట్ల ఆగిన ఎన్నికలు.. సరిహద్దు పంచాయితీతో కొయ్యూరు ఎన్నిక వాయిదా
- టీడీపీలో ఆధిపత్య పోరుతో పలుచోట్ల గొడవలు.. పెడనలో ఎన్నికల అధికారిపై కత్తితో దాడి


జగ్గయ్యపేట మండలం పోచంపల్లిలో సాగునీటి సంఘానికి ఎన్నిక నిర్వహిస్తున్న అధికారులు

సాగునీటి సంఘాల ఎన్నికల్లో 'కూటమి' అభ్యర్థుల హవా కొనసాగింది. అధికశాతం స్థానాలను టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుదారులే దక్కించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 242, కృష్ణాజిల్లాలో 209 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. తొమ్మిది చోట్ల గొడవలతో, ఒక చోట కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. టీడీపీలోని ఆధిపత్య పోరు కారణంగా పెడనలో ఎన్నికల అధికారి కత్తిదాడిలో గాయపడి ఆస్పత్రిపాలయ్యారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. కొన్నిచోట్ల టీడీపీ నేతల మధ్య వర్గపోరు కారణంగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. మరికొన్ని చోట్ల నామినేషన్లు దాఖలు కాకపోవడంతో ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు ఎక్కువశాతం ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కూటమి మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 1,978 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉండగా 242 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కృష్ణాజిల్లాలో 2,317 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉండగా 209 సాగునీటి సంఘాలు ఉన్నాయి. మొత్తం మీద ఆరు చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి.

కోరం లేక ఎన్నిక వాయిదా

బాపులపాడు మండలంలోని నాగార్జునసాగర్ డబ్ల్యూఏ(వాటర్ యూజర్స్ అసోసియేషన్) 104 కొయ్యూరుకు 12 పీసీలు ఉండగా ఆరు ఏలూరు జిల్లా పల్లెర్లమూడిలోను, మరో ఆరు కృష్ణాజిల్లా కొయ్యూరు, మడిచర్ల, బొమ్ములూరులో ఉన్నాయి. ఓటర్ల జాబితాలోని తప్పులతోపాటు అధికారుల ఆదేశాల మేరకు 6, 7 పీసీలకు అటు పల్లెర్లమూడిలోను, ఇటు కొయ్యూరులోను ఎన్నికలు జరిగాయి. దీనితో పల్లెర్లమూడి గ్రామానికి చెందిన రైతులు తమకే అత్యధిక పీసీలు ఉన్న కారణంగా అధ్యక్ష ఎన్నికలు పల్లెర్లమూడిలోనే జరగాలని పట్టుబట్టారు. అదే సమయంలో మడిచర్ల, కొయ్యూరు, బొమ్ములూరు గ్రామాలకు చెందిన రైతులు కూడా కొయ్యూరు డీసీగా పేరు ఉందని అందుకే కొయ్యూరులోనే ఎన్నిక జరగాలని పట్టుబట్టారు. చివరికి అధ్యక్ష ఎన్నికల్లో కోరం లేని కారణంగా ఎన్నిక వాయిదా వేశారు.

టీడీపీ రెండు వర్గాల ఘర్షణ

మైలవరం నియోజకవర్గం గణపవరం గ్రామంలో తూర్పు చెరువు నీటి సంఘానికి ఆరుగురు టీసీ(ప్రాదేశిక నియోజకవర్గం)లు ఉండగా, దీనికి టీడీపీ, వైసీపీ నుంచి నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ గ్రామంలో టీడీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. బుజ్జిరెడ్డి, నంబూరి శ్యాంప్రసాద్ ఒక వర్గంగా ఏర్పడ్డారు. ఉదయం నుంచి ఎన్నిక వాయిదా వేయాలని పట్టుబట్టారు. రెండో వర్గంగా ఉన్న అక్కల రమణారెడ్డి వర్గం పోటీకి దిగింది. దీంతో వైసీపీ పోటీకి సై అంది. నాలుగు వైసీపీకి, రెండు రమణారెడ్డి వర్గానికి ఇచ్చుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఆనందకుమారికి అందజేశారు. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఉంది. టీడీపీ రెండు వర్గాలు ఘర్షణ పడటంతో ఆర్వో నామినేషన్లు స్వీకరించలేదు. 12.30 గంటల తర్వాత పోలీసులు రావడంతో ఆర్వో నామినేషన్లు స్వీకరించారు. సమయం దాటిన తర్వాత నామినేషన్లను ఎలా స్వీకరిస్తారని టీడీపీలోని బుజ్జిరెడ్డి వర్గం ఆందోళనకు దిగింది. దీంతో ఆర్వో ఎన్నికను వాయిదా వేశారు. ఎన్నికను ఎందుకు వాయిదా వేశారో రాతపూర్వకంగా లేఖ ఇవ్వాలని వైసీపీ వర్గీయులు ఆందోళనకు దిగారు.

రెండు ఓట్లే వచ్చాయని..

పెడన మండలం నందిగామ నీటి సంఘం ఎన్నికల్లో ఎన్నికల అధికారి మధుశేఖర్‌పై కత్తితో దాడి చేశారు. టీడీపీలో ఆధిపత్య పోరు కారణంగా ఈ ఘటన జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లపాటి ప్రసాద్ బలపర్చిన పామర్తి వెంకటేశ్వరరావుకు రెండు ఓట్లు రావడంతో రెచ్చిపోయిన వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారి చేతిలో ఉన్న కాగితాలను లాక్కుని చింపేశారు. ఆయనపై కత్తితో దాడి చేశారు. గాయపడిన మధుశేఖర్‌ను ఆసుపత్రికి తరలించి, నందిగామ నీటి సంఘం ఎన్నికలను వాయిదా వేశారు.

జనసేన రెండు వర్గాల మధ్య వివాదం

బంటుమిల్లి మండలంలో ఎనిమిది నీటి సంఘాలు ఉన్నాయి. 105 టీసీలు ఉన్నాయి. వాటిలో 14 టీసీ స్థానాలకు ఎన్నికలు మిగతా 8లో..

పోలీసులు పట్టుకున్న వాహనాన్ని ఏదో ఒకలా విడిపించుకొంటారు యజమానులు. చలానా చెల్లించి కొందరు, రాజకీయ నేతలతో సిఫార్సులు చేయించుకొని మరికొందరు తమ వాహనాలను తీసుకెళ్లారు. అయితే ఈ రెండింటికి భిన్నంగా ఉంది మందుబాబుల తీరు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులు వాహనాలు పట్టుకుంటే చాలు ఇక మాకు అవసరంలేదులే అన్నట్లు వదిలేసి వెళ్లి పోతున్నారు. కోర్టులకు హాజరై జరిమానాలు చెల్లించాల్సి ఉండడంతో ఏకంగా వాహనాలనే వద్దనుకుంటున్నారు. పోతేపోని అంటూ లైట్‌గా తీసుకుంటున్నారు. దీంతో పోలీసుల వద్ద వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది.

పోతేపోనీ..!

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వాహనాలను వదిలేస్తున్న నిందితులు

- కోర్టులు, జరిమానాలు తప్పించుకునేందుకు కొత్త ఎత్తులు
- రోజురోజుకు పెరుగుతున్న పట్టుబడిన వాహనాల సంఖ్య



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) ట్రాఫిక్ పోలీసులు వారాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారులపై పోలీసులు బ్రీత్ ఎనలైజర్లతో కనిపించే సరికి మందుబాబులు పక్క వీధుల్లో నుంచి తప్పించుకుని వెళ్లిపోతున్నారు. ముఖ్యంగా యువకులు రాత్రిపూట బయటకు వచ్చి బారుల్లో పీకల దాకా తాగుతున్నారు. తర్వాత అక్కడి నుంచి ఫుడ్‌కోర్టుకు వచ్చి టిఫిన్లు చేస్తున్నారు. శుక్ర, శనివారాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు. పోలీసులకు ఈ పరీక్షల్లో మత్తుతో చిక్కుతున్న వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు. ఇలా పోలీసులకు పట్టుబడుతున్న యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండడం లేదు. కొద్దిరోజుల క్రితం రమేష్ ఆస్పత్రి జంక్షన్‌కు ముందు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇదే విషయం తేలింది. నలుగురు యువకులు రెండు స్కూటీలపై బయటకు వచ్చి మద్యం తాగారు. తర్వాత ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఈట్‌స్ట్రీట్‌లో టిఫిన్ చేసి రామవరప్పాడు రింగ్ వైపు వెళ్తుండగా కారు ఢీ కొట్టిన విషయం తెలిసిందే. మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు స్నేక్ డ్రైవింగ్ చేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు గుర్తించారు.

వారానికి 50 మందిపైనే..

రాత్రిపూట ఇళ్ల నుంచి బయటకు వచ్చి రహదారులపై తిరగడం యువతకు ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. ప్రధాన రహదారుల మీద పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పెరగడంతో వాటికి అనుసంధాన రహదారుల్లో మందుబాబులు జారుకుంటున్నారు. కొంతమంది పోలీసులు ఆపినా బ్రీత్‌ఎనలైజర్‌ను ఊదడానికి సమయం తీసుకుంటున్నారు. ఈలోపున ఎవరో ఒకరితో సిఫార్సు చేయించుకుంటే కేసు నుంచి తప్పించుకోవచ్చని యువకులు భావిస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే పోలీసులు వ్యూహాన్ని మార్చారు. ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారుల్లోనూ పోలీసులు ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు. ఈ పరీక్షల్లో వారానికి 50 నుంచి 60 మంది వరకు పోలీసులకు చిక్కుతున్నారు.

జరిమానాలు పెరగడంతో..

బ్రీత్ ఎనలైజర్‌ను ఊదిన తర్వాత రీడింగ్ 30 మిల్లీగ్రాములకు పైబడి చూపిస్తే ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. కొంతమందిలో మత్తు శాతం 90 ఎంజీలుగా ఉంటోంది. బ్రీత్ ఎనలైజర్‌లో రీడింగ్ 30 మిల్లీగ్రాములు దాటగానే పోలీసులు వారి నుంచి వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారు. వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఉన్న గ్రౌండ్‌లోకి తరలిస్తున్నారు. తర్వాత మత్తుతో చిక్కిన వారిని కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నారు. ఒకప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కిన వారికి జరిమానాలు రూ.2వేల నుంచి రూ. 5వేల వరకు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ కేసులో కోర్టు ముందుకు వెళ్తే రూ.10వేలు జరిమానా చెల్లించాల్సిందే. లైసెన్స్ లేకుండా మద్యం తాగి వాహనాలు నడిపితే దీనికి మరో రూ.5వేలు అదనం. అదే మత్తు శాతం 50 దాటి ఉంటే న్యాయస్థానాలు మందుబాబులకు జైలు శిక్ష విధిస్తున్నాయి. పాత వాహనాలతో పోలీసులకు చిక్కిన మందుబాబులు దాని విలువను జరిమానాతో పోల్చి చూసుకుంటున్నారు. వాహనం ఖరీదు జరిమానా కంటే తక్కువగా ఉంటే ఇక దాన్ని వదిలేస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద గ్రౌండ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వదిలేసిన వాహనాలు పేరుకుపోతున్నాయి. వాటి నంబర్ల ఆధారంగా చిరునామాను తీస్తే ఆ వాహనాలకు సంబంధించిన వ్యక్తులు అక్కడ ఉండడం లేదు. దీనితో చేసేది లేక పోలీసులు ఆ వాహనాలను గ్రౌండ్‌లోనే వదిలేస్తున్నారు.

మరో మోసం!

- సొంత భూములు, ప్లాట్ల రేట్లు పెంచుకోవడానికి ల్యాంకో పక్కా ప్లాన్
- తన స్థలాల్లోని టవర్లను తొలగించి ప్రైవేట్ వెంచర్లు, రైతుల భూముల్లో ఏర్పాటుకు కుట్ర
- బోరుమంటున్న అప్రూవ్డ్ లే అవుట్ వెంచర్ ప్లాట్ల కొనుగోలుదారులు


అప్రూవ్డ్ లేఅవుట్ వెంచర్ ప్లాట్లలో చేస్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/విజయవాడ రూరల్) : మొన్న.. టవర్ల షిఫ్టింగ్ పేరుతో ఎన్ 'క్యాష్'. నిన్న విద్యుత్ అంతరాయానికి డ్యామేజీ చార్జీల వసూలు ఎత్తుగడ. మరి నేడు తన భూముల్లో టవర్లను తొలగించుకునేందుకు రైతులు, ప్లాట్లదారుల భూముల్లోకి అలైన్‌మెంట్ మార్పు. ఆహా.. ఏం ప్లాన్ వేశారు! విజయవాడ వెస్ట్ బైపాస్ పేరుతో ఎన్ని ప్రయోజనాలను పొందాలో అన్నింటిని అందుకోవడానికి ల్యాంకో సంస్థ ప్రయత్నిస్తోంది. ఈ అడ్డగోలు వ్యవహారాలకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ఆర్వో కార్యాలయ అధికారులు సహకరిస్తున్నారన్న విమర్శలు తీవ్రస్థాయిలో వస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల ఏర్పాటుకు సంబంధించి నున్న, జక్కంపూడి ప్రాంతాల్లో పూర్వం ల్యాంకో సంస్థ సొంతంగా భూములు కొనుగోలు చేసింది. హైటెన్షన్ అలైన్‌మెంట్ ప్రకారం ఎక్కడెక్కడ టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందో అక్కడ రైతుల నుంచి భూములను కొనుక్కొంది. ఈ భూములను ల్యాంకో పవర్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కొంది. పవర్ ప్రాజెక్ట్ విషయానికి వస్తే ల్యాంకో పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్ కిందకు వస్తుంది. ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూత పడిన నేపథ్యంలో అందులోని మూడు యూనిట్లను ఆక్షన్ పిలిచిన సందర్భంలో టవర్లలోని భూముల అంశం ఎక్కడా లేదు. ఎందుకంటే ఈ భూములను చాలా తెలివిగా ల్యాంకో పవర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెట్ పేరుతో కొనుగోలు చేసింది. దీంతో ఈ భూములన్నీ కూడా ల్యాంకో పాత యాజమాన్యం ఆధీనంలోనే ఉన్నాయి. ప్రస్తుతం విజయవాడ పశ్చిమ బైపాస్ వెంబడి నున్న, జక్కంపూడి ప్రాంతంలో ఎకరం రూ.5 కోట్లు ఆ పైన విలువ చేస్తోంది. దీంతో తమ భూములకు విలువ పెంచుకునేందుకు ల్యాంకో యాజమాన్యం తెలివిగా బైపాస్‌కు 105 మీటర్ల దూరంలో అలైన్‌మెంట్‌ను మార్చినట్టుగా తెలుస్తోంది. ల్యాంకో ప్లాంట్ మూత పడక ముందు లేఖ ఇవ్వటం, మూత పడ్డ తర్వాత ల్యాంకో లేఖను ఎన్‌హెచ్ అధికారులు పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టడంతో ఈ రెండు సంస్థల మధ్య ఆర్థిక లావాదేవీలు నడిచాయని రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ల్యాంకో అలైన్‌మెంట్‌కు ట్రాన్స్‌కో నుంచి ఎలాంటి అనుమతులు లేవన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటపుడు ఎన్‌హెచ్ అధికారులు ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారన్నది తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

అప్రూవ్డ్ లే అవుట్ ప్లాట్ల కొనుగోలుదారుల అవస్థలు

నున్న గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న విద్యుత్ హైటెన్షన్ వైర్ల డైవర్షన్ మిగతా 8లో..


కలశజ్యోతులతో భవానీల ప్రదర్శన

జ్యోతి స్వరూపిణి

- వైభవంగా కలశజ్యోతి ఊరేగింపు
- ప్రత్యేక ఆకర్షణగా కళా ప్రదర్శనలు

వన్‌టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భవానీ దీక్షలను పురస్కరించుకుని ఏటా నిర్వహించే కలశ జ్యోతి ఉత్సవం విజయవాడలో శనివారం అంగరంగ వైభవంగా సాగింది. సత్యనారాయణపురం బీఆర్‌టీఎస్ రోడ్డు శివరామకృష్ణక్షేత్రం వద్ద ఈ ఉత్సవాన్ని దుర్గగుడి ఈవో రామారావు ప్రారంభించారు. భవానీ దీక్షాదారులు, భక్తులు జ్యోతులను అరచేతిలో పట్టుకుని జైదుర్గా.. జైజై దుర్గా నామస్మరణతో ముందుకు సాగారు. రామకోటి నుంచి గాంధీనగర్, గవర్నర్‌పేట, కంట్రోల్ రూమ్ పై వంతెన మీదుగా సుమారు ఏడు కిలో మీటర్లు ప్రయాణం గల ఈ కలశ జ్యోతి ఊరేగింపులో కళా ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భవానీ నామం ఎక్కడ వినపడుతుందో అక్కడ క్షామం ఉండదని, జ్యోతి స్వరుపంలో అమ్మని ఆరాధించడం వల్ల సకలసౌభాగ్యాలు కలుగుతాయని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు అన్నారు. ప్రధాన అర్చకుడు శివప్రసాద్ మాట్లాడుతూ మార్గశిర పౌర్ణమి రోజున జ్యోతి కలశ ఉత్సవం జరుగుతుందన్నారు. 1980లో జ్యోతి కలశమహోత్సవం 9 మందితో ప్రారంభమైందన్నారు. ఇప్పుడు సుమారు 9 లక్షలకు పైగా అమ్మవారిని దర్శించుకుంటున్నారని వివరించారు.



ఎన్టీఆర్ వేషధారణలో కళాకారుడు





జ్యోతి ప్రజ్వలన, తారకరామం పుస్తకావిష్కరణలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు

సూర్యచంద్రులున్నంత వరకూ

తెలుగుజాతి గుండెల్లో ఎన్టీఆర్

» ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభలో వక్తలు

పెనమలూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సూర్యచంద్రులు ఉన్నంత వరకూ తెలుగుజాతి గుండెల్లో నందమూరి తారకరామారావు శాశ్వతంగా నిలిచిపోతారని సినీ, రాజకీయ ప్రముఖులు వ్యాఖ్యానించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అధ్యక్షతన శనివారం పోరంకి మురళి రిసార్ట్సులో నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు మాట్లాడారు. గతంలో పోరంకిలోనే నిర్వహించిన ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను స్ఫూర్తిగా తీసుకుని ఎన్టీఆర్ తనయులు బాలకృష్ణ, రామకృష్ణ, మోహనకృష్ణ, ముఖ్యమంత్రి చంద్రబాబుల ప్రోత్సాహంతో ఎన్టీఆర్ సినీ జీవితం 75ఏళ్లు నిండిన సందర్భంగా సినీ వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ అధ్యక్షుడు టీడీ జనార్దన్ తెలిపారు. ఏడాది పాటు సినీ వజ్రోత్సవాలను చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో నిర్వహించి ఎన్టీఆర్ తన సినీ, రాజకీయ జీవితంలో సాధించిన విజయాలను ప్రజలకు ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రపంచంలో ఏ నాయకుడికీ జరగని విధంగా శతజయంతి ఉత్సవాలు వందదేశాల్లో వైభవంగా జరగడం విశేషమన్నారు. సినిమాల్లో ఉన్నప్పుడు రాయలసీమలో కరువు తాండవిస్తే రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో నిధులు సమీకరించి ఫండ్ రైజింగ్ చేసిన మొట్టమొదట వ్యక్తి ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. దివిసీమ ఉప్పెన, చైనా యుద్ధంలో అన్నార్తులను ఆదుకున్న ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. పౌరాణికాలు, జానపదాలు, సాంఘిక సినిమాలను వ్యాపారకోణంలో కాకుండా సందేశాత్మకంగా తీసి ప్రపంచ మెప్పును పొందారని తెలిపారు. రాజకీయ జీవితంలో ఎన్నో ప్రజోపయోగ పథకాలను ప్రవేశపెట్టి అప్పటి వరకు ఉన్న ఊకదంపుడు రాజకీయాల స్థితిగతులను మార్చిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. అప్పటి స్వాతంత్ర్యం వచ్చి 35ఏళ్లయినా పేదవాడికి ఆహార భద్రత లేని రోజుల్లో రెండు రూపాయల కిలో బియ్యం పథకం, పేదలందరికీ పక్కా ఇళ్లు, పింఛన్ పథకాలను ప్రవేశపెట్టి తాను పేదల పక్షపాతినని నిరూపించుకొన్న ఏకైక మహా నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.

పాఠ్యాంశంగా ఎన్టీఆర్ జీవితం

ఎన్టీఆర్ జీవిత విజయాలను పాఠ్యాంశాలుగా ప్రవేశపెడతామని టీడీ జనార్దన్ తెలిపారు. ఎన్టీఆర్ చారిత్రక ప్రసంగాలను తర్వాతి తరాలకు వారసత్వ సంపదగా అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ వందడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్టీఆర్ సినీ జీవితంలో ఇచ్చిన ఇంటర్వ్యూలను కలిపి రచించిన తారకరామం అనే సంకలన పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విడుదల చేసి తొలి ప్రతిని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ సభ్యులకు చంద్రబాబు, వెంకయ్యనాయుడులు జ్ఞాపికలు అందించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పనీరాజనం గావించారు. మాజీ పోలీసు ఉన్నతాధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ స్పీకర్ ప్రతిభాభారతి, నన్నపనేని రాజకుమారి, ఎంపీ కేశినేని చిన్ని, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, శ్రీరాం తాతయ్య, కొలికపూడి శ్రీనివాస్, కామినేని శ్రీనివాస్, మాజీ మంత్రులు నెట్టెం రఘురాం, బాబూమోహన్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌తో నటించడం అదృష్టం

ఎన్టీఆర్‌తో నటించడం నా అదృష్టం. ఎన్టీఆర్‌కు ఎంతో ఇష్టమయిన విజయవాడలో వజ్రోత్సవాలను మొదట నిర్వహించడమంటే ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించినట్టే. టీడీపీలో నేను రాణించడానికి సహకరించిన ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక తెలుగువారి మోముల్లో ఆనందం చూస్తున్నా. **- సినీనటి జయప్రద**



ప్రపంచం గర్వించదగ్గ నటుడు

ఎన్టీఆర్ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప నటుడు. ఒక మంచి ఫిల్మ్ మేకర్. సినిమా మేకింగ్‌లో ఎవరికీ లేని క్లారిటీ ఆయనకు ఉండేది.

- సురేష్ ప్రొడక్షన్స్ అధినేత దగ్గుబాటి సురేష్‌బాబు



కల్మషం లేని మనస్తత్వం

ఎన్టీఆర్‌ది కల్మషం లేని మనస్తత్వం. అది బాలకృష్ణకు వచ్చింది. టీడీపీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు స్వర్ణయుగాన్ని చూస్తారు. ప్రస్తుత రోజుల్లో తల్లిదండ్రులు ఎన్టీఆర్ సినిమాలను తమ పిల్లలకు చూపించి బంధాలను బాంధవ్యాలను నేర్పించాలి. ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు వస్తుందని నమ్మకముంది. **- నటి ప్రభ**



క్రమశిక్షణకు మారుపేరు

క్రమశిక్షణకు ఎన్టీఆర్ మారుపేరు. ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో ఉన్న క్రమశిక్షణ ఎన్టీఆర్ నేర్పిందే.

- నిర్మాత ఆదిశేషగిరిరావు



ఫిల్మ్‌ఇండస్ట్రీ తరలిరావడానికి కృషి చేశారు

చెన్నై నుంచి హైదరాబాద్‌కు ఫిల్మ్ ఇండస్ట్రీ రావడంలో ఎన్టీఆర్, చంద్రబాబుల కృషి ఎంతో ఉంది. ఆనాడు ఎన్టీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రస్తుతం 5600మంది సభ్యులున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫిల్మ్ ఇండస్ట్రీ అభివృద్ధి చెందాలంటే వైజాగ్, విజయవాడ, తిరుపతి లాంటి నగరాల్లో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్స్ ఏర్పాటు చేయాలి.

-నిర్మాత కేఎస్ రామారావు



వజ్రోత్సవ వేడుకలకు హాజరైన ప్రముఖులు



ఎన్టీఆర్..ఓ ఎన్‌సైక్లోపీడియా

ఎన్టీఆర్ పేరు వింటే యావత్ తెలుగు జాతి గుండెలు పులకించిపోతాయి. ఎన్టీఆర్‌ను ఒక ఎన్‌సైక్లోపీడియా. ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఇరవై భాషల్లో తెలుగు భాషకు 20వస్థానం దక్కడం ఎన్టీఆర్, చంద్రబాబు చలవే.

-ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ



సినీజీవితాన్ని ప్రసాదించినందుకు కృతజ్ఞతలు

మీర్జాపూర్ జమీందార్ కృష్ణవేణి నా తండ్రి ఎన్టీఆర్‌తో మనదేశం సినిమా నిర్మించి నాకు సినీ జీవితాన్ని ప్రసాదించారు. అందుకు కృతజ్ఞతలు.

- ఎన్టీఆర్ తనయుడు మోహనకృష్ణ



కృష్ణంరాజుతో అనుబంధం

ఎన్టీఆర్‌కు, కృష్ణంరాజుకు మంచి అనుబంధం ఉండేది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వచ్చారు. రాష్ట్ర ప్రజలు ఇక ఊపిరి పీల్చుకోవచ్చు.

-దివంగత సినీ హీరో కృష్ణంరాజు సతీమణి శ్యామాలాదేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇంధన పొదుపు సామాజిక బాధ్యత

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఇంధన పొదుపు చర్యలు పాటించాలని, భావితరాలకు భరోసా కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. రాష్ట్ర ఇంధనశాఖ-ఇంధన పరిరక్షణ మిషన్(ఎస్ఈసీఎం), జిల్లా విద్యుత్ శాఖ అధ్వర్యంలో శనివారం జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల ప్రత్యేక ర్యాలీని నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలని, పథకం అమలులో జిల్లాను నంబరు 1గా నిలపాలని సూచించారు. సొంత ఇల్లు, విద్యుత్ కనెక్షన్ ఉన్నవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎంసూర్యఘర్.జీవోవీ.ఇన్ ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఏపీసీపీడీసీఎల్ సీజీఎం(ఓ అండ్ ఎం) సాంబశివరావు, ఎనర్జీ ఆడిట్ జీఎం విజయకృష్ణ, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎ.మురళీమోహన్, డీఆర్డీయే పీడీ కె.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

» ఎస్‌హెచ్‌జీ జిల్లా సమావేశంలో మహిళలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

గొల్లపూడి: స్వయం సహాయక సంఘాల్లోని(ఎస్‌హెచ్‌జీలు) ప్రతి మహిళా మంచి పారిశ్రామికవేత్తగా ఎదగాలని తనతో పాటు మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. గొల్లపూడిలోని డీఆర్డీయే కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వయం సహాయ సంఘాల జిల్లా సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. పీఎం సూర్యఘర్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా ఆర్థిక సాధికారత లక్ష్యంగా అమలు చేస్తున్న పథకాలను, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 26,200 స్వయం సహాయక సంఘాల సభ్యులు సేవ్ ఎనర్జీ..సేవ్ మనీ స్ఫూర్తితో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈపథకం కింద కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, బ్యాంకు రుణం పొందవచ్చని చెప్పారు. ఇంటి పైకప్పుపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. డీఆర్డీయే పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన పాల్గొన్నారు.

మాతా, శిశుమరణాలు గణనీయంగా తగ్గించాలి

» వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

» వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ జిల్లాలో మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించాలి. అందుకోసం ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలి. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి అవసరమైన అన్ని వైద్యపరీక్షలు చేయించుకునేలా, పోషకాహారం తీసుకునేలా, వైద్యసేవలు పొందేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది, వైద్యులు బృందంగా పనిచేయాలి. వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు.' అని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో మాతా శిశుమరణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అక్టోబరులో నమోదైన ఒక మాతృ, రెండు శిశు మరణాల నివేదికలను పరిశీలించి, కారణాలను విశ్లేషించారు. గ్రామస్థాయి సిబ్బంది గర్భిణుల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం, మందులు తీసుకునేలా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి గర్భిణుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, ముప్పు అధికంగా(హైరిస్క్) ఉన్న వారి పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అనుభవమున్న వైద్య నిపుణులతో కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆస్పత్రుల వైద్యసేవల్లో నిర్లక్ష్యం రుజువైతే క్రిమినల్ కేసులు పెట్టేందుకూ వెనుకాడేది లేదని స్పష్టంచేశారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ), స్వర్ణాంధ్ర 2047 సాకారానికి చేసే కృషిలో భాగంగా జిల్లాలో ప్రసూతి మరణాల రేటు(ఎంఎంఆర్)ను 15 కంటే తక్కువకు చేర్చేలా కృషి చేయాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఐ.ఇందుమతి, లైజనింగ్ అధికారి డాక్టర్ ఎస్.పద్మావతి, డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ లిడియా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



డోకిపర్రు వేంకటేశ్వరస్వామికి

పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సీఎం పట్టువస్త్రాల సమర్పణ

గుడ్లవల్లేరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): డోకిపర్రు భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. బేడీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి స్వామికి చంద్రబాబు పట్టువస్త్రాలను తీసుకురాగా వేదపండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసి స్వామిని దర్శించుకుని సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులను సీఎం అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రికి ఆలయ వేద పండితులతో వేద ఆశీర్వచనాలు పలికారు. కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఆయనకు వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని, స్వామి లడ్డూ ప్రసాదాన్ని బహూకరించారు. తర్వాత ఆలయం నుంచి బయటికి వచ్చిన సీఎం..నిర్వాహకుల గెస్ట్‌హౌస్‌ను సందర్శించేందుకు వెళ్లారు. గెస్ట్‌హౌస్‌లోని సమావేశ మందిరం, మినీ థియేటర్, భోజన శాల, ముఖ్యమైన గదులను కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ముఖ్యమంత్రికి చూపించారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. గెస్ట్ హౌస్ నుంచి బయటికి వచ్చి అభిమానులకు అభివాదం చేస్తూ హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లిపోయారు.

సీఎంకు ఘన స్వాగతం

డోకిపర్రులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో చాపర్ నుంచి దిగిన ముఖ్యమంత్రికి ఆలయ ధర్మకర్తలు పీవీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి స్థానిక టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా

శిలాఫలకంతో సరిపెట్టారు!

» మూడేళ్లయినా మొదలవ్వని విత్తనశుద్ధి కర్మాగారం నిర్మాణ పనులు.. ప్లాంట్ నిర్మించాలని కోరుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): తిరువూరు నియోజకవర్గ రైతులతో పాటు మరో 7 నియోజకవర్గాల పరిధిలోని రైతులకు మేలురకం విత్తనాలు అందించేందుకు 2021 జూన్ 23న మండలంలోని లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎంఎస్పీ అండ్ ఎన్ఎఫ్ఎస్ఎం పథకం(సబ్ మిషన్ సీడ్ ప్లాంట్ మెటీరీయల్, నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్)నిధులు రూ.47.37 లక్షలతో విత్తనశుద్ధి, విత్తన తయారీ కర్మాగారాన్ని నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రైతులకు మేలురకం విత్తనాలు అందించడంతో పాటు, విత్తనాలు తయారుచేసేందుకు రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. సాగుప్రారంభంలో విత్తనాల కోసం పరుగులు పెట్టే అవసరం ఉండదని, మేలురకం విత్తనాలు దొరుకుతాయని ఈ ప్రాంత రైతులూ ఎంతో ఆశపడ్డారు. కానీ, శిలాఫలకం ఆవిష్కరించి మూడేళ్లవుతున్నా కర్మాగారం కోసం కేటాయించిన స్థలంలో ఎటువంటి పనులు ప్రారంభించలేదు. ఈ ప్రాంతంలో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కర్మాగారం శిలాఫలకం మాత్రం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాలకు దిష్టిబొమ్మలా ఉంది. కర్మాగారం పనులు ప్రారంభించేలా పాలకులు చూడాలని రైతాంగం కోరుతోంది. విత్తనశుద్ధి కర్మాగారం పనులపై స్థానిక వ్యవసాయశాఖాధికారులను పలువురు రైతులు సంప్రదించగా, ఇది సీడ్ కార్పొరేషన్ పరిధిలోనిదని, సమస్యను ఆ సంస్థ దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు.



విత్తనశుద్ధి కర్మాగారం నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం లక్ష్మీపురంలో ఆవిష్కరించిన శిలాఫలకం

విద్యారంగ ప్రయోజనాల కోసం పనిచేస్తాం

» ఎమ్మెల్సీలు బి.గోపీమూర్తి, ఐ.వెంకటేశ్వరరావు

గవర్నర్‌పేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ, ఉద్యోగుల ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా శాసనమండలిలో పనిచేస్తామని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, టీచర్స్ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి స్పష్టం చేశారు. శనివారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సుందరయ్య అధ్యక్షతన యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. 14 ఏళ్లుగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రయోజనాలు సాధించేందుకు అనేక పోరాటాలు చేశారని ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రయోజనాలు కాపాడేందుకు కేఎస్ లక్ష్మణరావును మరోసారి ఎన్నుకోవాలన్నారు. మెరుగైన ఫిట్మెంట్ ఇప్పించడంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు చేసిన కృషిని ఇటీవల ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గోపీమూర్తి వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

నందిగామ, పెందుర్రులో..

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

» నందిగామ పోటీకి దిగిన టీడీపీలోని రెండు వర్గాలు

» వీఆర్వో చేతిలోని పత్రాలు లాక్కునేందుకు ఓడిపోయిన అభ్యర్థి పామర్తి వెంకటేశ్వరరావు యత్నం

» స్టీలు స్కేలు కోసుకుపోయి వీఆర్వో చేతికి గాయం


» వేలికి గాయమవడంతో స్పృహకోల్పోయిన 'పామర్తి'

» ఎన్నిక వాయిదా వేసిన అధికారులు

పెడన, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాలకు సంబంధించి మండలంలోని 10 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రాదేశిక నియోజకవర్గాలు(టీసీ) ఎన్నికలు నిర్వహించారు. 120 టీసీలకు 108 టీసీలు ఏకగ్రీవమయ్యాయి. 12 టీసీల ఎన్నికలు వాయిదాపడ్డాయి. నందిగామ జడ్పీ హైస్కూల్‌లో 12 టీసీలకు నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీలోని రెండు వర్గాలు పోటీ పడ్డాయి. సర్పంచ్ బొడ్డు చినబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు శలపాటి ప్రసాద్‌లు వారి వర్గం అభ్యర్థులను పోటీ పెట్టారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ నాయకుడు అర్జా వెంకటనగేష్, శీరం ప్రసాద్ రాజీకి ప్రయత్నించినా ఫలించలేదు. ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఎన్నికలు నిర్వహించారు. చినబాబు వర్గానికి 10 ఓట్లు రాగా, శలపాటి ప్రసాద్ వర్గానికి 2 ఓట్లు వచ్చాయి. శలపాటి ప్రసాద్ వర్గానికి చెందిన ఓడిపోయిన పామర్తి వెంకటేశ్వరరావు సబ్‌డివిజన్ 3వ నెంబరు టీసీ ఎన్నికల అధికారి, వీఆర్వో మధు చేతిలో ఉన్న పత్రాలను లాక్కునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో స్టీల్ స్కేలు కోసుకుపోయి వీఆర్వో మధు ఎడమచేతికి గాయమై రక్తం వచ్చింది. వెంకటేశ్వరరావు ఎడమ చేతివేలికీ గాయమైంది. అనంతరం వెంకటేశ్వరరావు స్పృహ తప్పి కిందపడిపోయారు. వీరిద్దరిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో నందిగామలోని 12 టీసీల ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి అనిల్‌కుమార్ ప్రకటించారు.



తన చేతికి గాయాన్ని చూపిస్తున్న వీఆర్వో మధు



స్పృహతప్పి కిందపడిపోయిన పామర్తి వెంకటేశ్వరరావు

పెందుర్రులో నామినేషన్‌పత్రాల చించివేత

బంటుమిల్లి: పెందుర్రులో నామినేషన్ పత్రాలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడం, ఉద్రిక్త పరిస్థితులు తలెత్త డంతో నీటి సంఘం ఎన్నిక లను అధికా రులు వాయిదా వేశారు. శనివారం పెందుర్రు హైస్కూల్లో 128వ నీటి సంఘం ఎన్నికల సందర్భంగా పోటీచేసిన ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఓట ర్లను రానివ్వకుండా అడ్డుకుంటున్నారని, కొంతమందిని కిడ్నాప్ చేశారని, రాజ్యాంగ బద్ధంగా న్యాయంగా ఎన్నికలు జరిపించాలంటూ, ఎన్నికలను వాయిదా వేయాలంటూ కొందరు డిమాండ్ చేశారు. నామినేషన్ ప్రక్రియ జరుగుతుండగానే 11, 12 సెగ్మెంట్లలో గుర్తుతెలియని వ్యక్తి నామినేషన్ పత్రాలు చింపివేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఐ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎంటుమిల్లి ఎస్సై గణేష్‌కుమార్, కృత్తి వెన్ను ఎస్సై పైడిబాబు ఇరువర్గాలకు సర్దిచెప్పి వివాదాన్ని సర్దుమణించేయడంలో సఫ లీకృతులయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి దుర్గాప్రసాదరావు, ఉన్నతాధికారులతో మాట్లాడి ఎన్నికలను వాయిదా వేసినట్లు ప్రకటించారు. దీంతో మరో వర్గం ఎందుకు వాయిదా వేస్తున్నారో చెప్పాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. నామినేషన్‌పత్రాలు చిం పిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కిడ్నాపైన రైతులను గుర్తిం చాలని కోరారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



పెందుర్రు నీటి సంఘం ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న అధికారులు

విజయవాడ తూర్పు

సృజనాత్మతకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని, సాంస్కృతిక కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి వస్తుందని శ్రీచైతన్య కళాశాల రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్, సత్యనారాయణపురం కార్యనిర్వహక డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. డేస్కాలర్ ఆధ్వర్యంలో శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. సత్యనారాయణపురం బ్రాంచ్ వార్షికోత్సవం సింగ్‌నగర్ రవీంద్ర కన్వెషన్‌లో నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల కార్యనిర్వహక కార్యదర్శి ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు, ఏజీఎం కొమ్మినేని రంగారావు పాల్గొన్నారు.

ఖర్చు ఘనం.. ఫలితాలు కనిష్టం

●తూతూ మంత్రంగా యాంటీ లార్వా ఆపరేషన్ ●అవగాహన చర్యలు నిల్ ●కొరవడిన అధికారుల పర్యవేక్షణ ●జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు

చిట్టినగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. సాధారణంగా ప్రతి ఏటా జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వర్షాకాలం నాలుగు నెలలు దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. అయితే డిసెంబరు వచ్చినా దోమల బెడద తగ్గలేదు. పగలు రాత్రి తేడలేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు వ్యాధుల బారి నపడుతున్నారు. దానికి కారణం మలేరియా విభాగం నిర్లక్ష్య మన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో 286 వార్డు సచివాలయాలున్నాయి. 245 మంది శానిటరీ కార్యదర్శులతో ప్రతివారం డ్రై డే పాటిస్తున్నట్లు అధికారులు చెబుతున్నా ఫలితాలు అంతగా లేవంటున్నారు. దోమల నిర్మూలన, యాంటీ లార్వా ఆపరేషన్ సక్రమంగా జరగటంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సాయంత్రం అయితే మున్సిపల్ సిబ్బంది అక్కడక్కడ పొగతో సరిపెడుతున్నారే తప్ప పూర్తి స్థాయిలో యాంటీ లార్వా ఆపరేషన్ జరగటం లేదంటు న్నారు. ఎంఎల్ ఆయిల్ బాల్స్ డ్రెయిన్‌లలో వదిలటం, పైరత్నం స్ప్రే, మంచినీటి నిల్వ ప్రాంతాల్లో గంబూసియా చేపలు విడిచిపెట్టడం, యాంటీ లార్వా పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకోవడంలేదు.



విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్

అవగాహన, పర్యవేక్షణ నిల్..

దోమల నిర్మూలన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం, యాంటీ లార్వా ఆపరేషన్ పనుల పర్యవేక్షణ తదితర అంశాల్లో అధికారులు చిత్తశుద్ధితో లేరని ప్రజలు అంటున్నారు. దోమలు వృద్ధి చెందే మంచినీటి ట్యాంక్ మూతలు వేయించడం, డ్రెయినేజి గొట్టాలకు వలలు ఏర్పాటు చేసుకోవడం, వర్షపునీటి డ్రైయిన్‌ల ఖాళీలు లేకుండా చూసుకోవడం, పల్లపు ప్రాంతాలు మెరక చేయించడం వంటి చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించడంలేదన్న విమర్శలున్నాయి.

రూ.లక్షల ఖర్చు..

దోమల నివారణ చర్యలకు ప్రభుత్వం ఎబెట్, పైరత్రం, ఎంఎల్ ఆయిల్ బాయిల్ తదితర మందులు ఉచితంగా అందిస్తుంది. నగరపాలక సంస్థ ప్రతి సంవత్సరం రూ.లక్షలలో ఖర్చు చేస్తోంది. 2018-19లో దోమల నివారణకు రూ.95లక్షలు, 2019-20లో రూ.కోటి, 2020-21లో రూ.87 లక్షలు, 2021-22లో రూ.85 లక్షలు, 2022-23 సుమారు రూ.80లక్షలు, 2023-24 రూ. కోటి కేటాయించారు. నిధులు ఖర్చు అవుతున్నా.. ఫలితాలు అంతగా కనిపించడలేదని ప్రజలంటున్నారు.

విషజ్వరాలు అధికం..

దోమల విజృంభనతో నగర ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు డెంగ్యూ, మలేరియా వంటి కేసులు వస్తే మినహా నివారణ చర్యలు అంతగా పట్టించుకోవడంలేదు. ఇటీవల ముందుస్తు చర్యలు కనిపించడంలేదని నగర ప్రజలు అంటున్నారు. అధికారులు, సిబ్బంది విధులు అంతంత మాత్రంగా నిర్వమిస్తున్నారని ప్రజలంటున్నారు.

ప్రతి కుటుంబంపై అదనపు భారం..

కొండప్రాంతాలతోపాటు మురుగునీరు సక్రమం పారుదల లేనిచోట ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగ్ నగర్, భవానీపురం, ఊర్మిళానగర్, కె.ఎల్.రావునగర్, కొత్తపేట కొండప్రాంతం, గొల్లపాల్లెం గట్టు, ఫ్రైజర్‌పేట, పాతరాజరాజేశ్వరిపేట వాంబేకాలనీ, కృష్ణలంక, రాణిగారితోట, కండ్రిక ప్రాంతాలోపాటు సర్కిల్-3లో పగలకూడా దోమల నివారణకు లిక్విడ్లు, అగరవత్తులు, చక్రాలు వంటివి వాడటం చేస్తున్నారు. దీంతో నెలకు రూ.500 వరకు భారం అధికం పడుతుంది.

చర్యలు తీసుకుంటున్నాం...

దోమల నివారణకు ప్రతి వారం డ్రై డే అమలు చేస్తున్నాం. ఇటీవల మలేరియా, డెంగ్యూ కేసులు తగ్గాయి. కేసులున్న ప్రాంతాల్లో సుమారు 50, 60 ఇళ్ల వరకు దోమల వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు తీసుకుంటు న్నాం.

-సూర్యకుమార్ బయాలజిస్టు ఇన్‌చార్జి

కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల కోసం పీబీ సిద్ధార్థ ఒప్పందం

మొగల్రాజపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పీబీ సిద్ధార్థ, కళాశాల హైదరాబాద్‌కు చెందిన ఫిక్సిటీ ఎడ్ఎక్స్ సంస్థకు మధ్య శనివారం ఒప్పందం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, ఫిక్సిటీ ఎడ్ఎక్స్ వ్యవస్థాపకులు వినయ్ వెలివల తెలిపారు. కళాశాలలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్ధార్థలో కంప్యూటర్ సైన్స్ చదివే విద్యార్థులకు ఈ ఒప్పందం వల్ల కృత్రిమ మేదస్సు, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ ఇచ్చి అర్హత ఉన్న వారికి ఉపాధి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల, కంప్యూటర్ విభాగం హెచ్‌వోడీ రవికిరణ్, డిప్యూటీ హెడ్ కె. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద ప్రతాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

గోరిపర్తి మృతి టీడీపీకి తీరనిలోటు

వర్ధంతి సభలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక 21వ డివిజన్ టీడీపీ మాజీ కార్పొరేటర్ గొరిపర్తి నర్సింహారావు (నర్సి) మృతి చెంది నాలుగేళ్లయినా నేటికీ ఆయన ప్రజలందరి గుండెల్లో బతికే వున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నర్సి వర్ధంతి సభ శనివారం సత్యం హోటల్ సెంటర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఏమాత్రం ఆలస్యమైనా నర్సి తనతో కూడా మాట్లాడకుండా అలిగే వారన్నారు. సొంత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల కోసం పాటుపడే వ్యక్తి నర్సింహారావు అని ప్రశంసించారు. టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, సీపీఐ నాయకుడు మందలపు శ్రీనివాసరావులు మాట్లాడుతూ స్నేహం కోసం ప్రాణం ఇచ్చే వ్యక్తి నర్సింహారావు అని కొనియాడారు. కార్యక్రమంలో గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, పలిశెట్టి అన్నారావు, మోటేపల్లి చిన్నా, గోగుల రమేష్, వల్లూరు మధు, చందన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్ధంతి సభలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

విజన్ డాక్యుమెంట్ 2047 చరిత్రాత్మకం : గద్దె

భారతీనగర్: స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్ అభివృద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజక వర్గ పరిధిలోని మూడో డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్, శ్రీరామచంద్రనగర్ కాలనీ ఆయుష్ ఆసుపత్రి రోడ్డులో శనివారం ఎమ్మెల్యే పర్యటించి స్థానిక నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిరుపేదలకు జీవనోపాధి నిమిత్తం తన సొంత నిధులు నుంచి రూ.80వేలతో కొనుగోలు చేసిన నాలుగు తోపుడు బండ్లను నలుగురికి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించడమే కాకుండ రాయితీలను కూడా భారీగా కూటమి ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కాలనీ అధ్యక్షుడు దాడి సుబ్బారావు, జాగర్లపూడి వెంకటేశ్వరరావు, తాడి బాబురావు, గద్దె రామేష్, పొట్లూరి బాలజీ, బండి కొమలి, ఆరేపల్లి రామచంద్రరావు, అట్లూరి విశ్వేశ్వరరావు, సీతారామ స్వామి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణ బాధ్యత మీదే

అధికారులకు కమిషనర్ ఆదేశం

చిట్టినగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నోడల్ ఆఫీసర్లు నిరంతరం అన్న క్యాంటీన్ల నిర్వహణ పరిశీలిస్తుండాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శనివారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అన్న క్యాంటీన్ల నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని 11 ప్రాంతాల్లో ఉన్న అన్న క్యాంటీన్లలో తాగునీటి సరఫరా, వాడకపునీరు, కిచెన్‌లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, భోజనంలో నాణ్యత ప్రతి రోజు నోడల్ ఆఫీసర్లు పరిశీలిస్తుండాలని ఆదేశించారు. ఎటువంటి మరమ్మతులు ఉన్న వెంటనే చేయించాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

3 నుంచి ట్రేడ్ ఎక్స్‌పో

ధర్నాచౌక్ : స్మైలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5 తేదీల్లో ట్రేడ్ ఎక్స్‌పో 2025ను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు బొలిశెట్టి శేషుబాబు, చుండూరు ఉమామహేశ్వరరావు తెలిపారు. నగరంలోని వెన్యూ కన్వెక్షన్‌లో ఈ ఎక్స్‌పో జరుగుతుందన్నారు. ఆహ్వాన పత్రికను గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. 120కు పైగా ప్రముఖ వ్యాపార సంస్థలు ఈ ఎక్స్‌పోలో పాల్గొంటున్నాయన్నారు. స్టాల్స్ ఏర్పాటు చేయాలనుకునేవారు 94927 34365లో సంప్రదించాలన్నారు.

కార్పెంటర్స్‌కు అండగా ఉంటా : కేశినేని చిన్ని

వన్‌టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేదారేశ్వరపేట కాల్వ గట్టు వద్ద ఉంటున్న కార్పెంటర్లకు అండగా ఉంటానని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు ఆధ్వర్యంలో 34వ డివిజన్‌లోని కార్పెంటర్లు గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల అధికారులు కార్పెంటర్లను ఖాళీ చేయమని సూచించగా ఎంపీ వారితో మాట్లాడి సమస్యను పరిష్క రించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంపీని సత్కరించారు. 34వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎ.కొండలరావు, కాశీం, నజీర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీని సత్కరిస్తున్న కార్పెంటర్స్ అసోసియేషన్ సభ్యులు

ఫుట్‌బాల్ చాంపియన్ కేబీఎన్

వన్‌టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలలో ఈనెల 10, 11 తేదీల్లో జరిగిన కృష్ణా విశ్వ విద్యాలయ అంతర కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో అద్భుతమైన ఆటతీరుతో అత్యధిక గోల్స్ చేసిన తమ కళాశాల జట్టు యూనివర్శిటీ చాంపియన్ షిప్ కైవసం చేసుకుందని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. కళాశాలలో జట్టును శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాల జట్టు సభ్యులు బి.ప్రేమ్ తేజ, ఎం.లీలా మనోహర్. పి. జాషువా. కె.దీపక్ చందు, బి.దుర్గాప్రసాద్ త్వరలో క్యాలికెట్ యూనివర్శిటీ కేరళలో జరగబోయే దక్షిణ భారత అంతర్విశ్వ విద్యాలయాల పురుషుల ఫుట్‌బాల్ పోటీలకు అర్హత సాధించారన్నారు. శిక్షణ ఇచ్చిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావును డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.



ఫుట్‌బాల్ జట్టును అభినందిస్తున్న కేబీఎన్ కళాశాల ప్రతినిధులు

కృష్ణలంక సర్వీసు రోడ్డులో యథేచ్ఛగా ఆక్రమణలు

● కుచించుకుపోయిన రోడ్డు ● చోద్యం చూస్తున్న కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు

(ఆంధ్రజ్యోతి, కృష్ణలంక) : కృష్ణలంక సర్వీసు రోడ్డులో ఎం హోటల్ సెంటర్ నుంచి సత్యం హోటల్ సెంటర్ వరకు రోడ్డుకు రెండు వైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. వీటి వెనుక కూటమి నేతలు భరోసా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు వాటిని అంగుళం కూడా కదపలేకపోతున్నారంటున్నారు. టిఫిన్ బండ్లు, టీ కొట్లు, బడ్డీ కొట్లు, మెకానిక్ షాపులు, నూడిల్స్, పానీపూరీ, మషాలా, కొబ్బరిబోండాం, కూరగాయల బండ్లు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు వచ్చి వీరిని కదపాలనుకొంటే వెంటనే ఫోన్‌లు వెళ్లిపోతాయి. వారు వచ్చి ఆక్రమణదారులకు వత్తాసు పలకడంతో చేసేదిలేక కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు వెనుకంజ వేస్తున్నారు. మరికొందరు ఆక్రమణదారులు తాము రోడ్డుపై హాకర్‌ను పెట్టి వ్యాపారం చేసుకొంటూ పక్కనే వున్న స్థలంలో మరో తోపుడు బండిని పెట్టి ఆ స్థలాన్ని రిజర్వ్ చేసుకొని మరొకొందరికి అద్దెకు ఇస్తున్నారు. ఇలా మూడు ఆక్రమణలు ఆరు దందాలు ఈ ప్రాంతం మారిపోయింది. ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదంటున్నారు. ఆక్రమణలను తొలగించి కుచించుకుపోయిన రోడ్డును రాకపోకలకు వెడల్పుగా వుండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



కృష్ణలంక సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ ఇలా

కలశజ్యోతికి సకల కళార్చన

ఏడు కిలోమీటర్ల ఊరేగింపులో ఇవే ప్రధాన ఆకర్షణ



కలశజ్యోతి ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న దుర్గగుడి ఈవో రామారావు

వన్‌టౌన్, సత్యనారాయణపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ భవానీ మండల దీక్షలను పురస్కరించుకుని కలశజ్యోతి ఊరేగింపు శనివారం సాయంత్రం శివరామ నామ క్షేత్రం ప్రాంగంణ సకల కళార్చనలతో శోభిల్లింది. దుర్గగుడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో సనాతన ధర్మ ప్రచారం, ధర్మప్రచారం, ఆధ్యాత్మిక వ్యాప్తి కొనసాగింది. ఆధ్యాత్మిక, ధార్మిక, ప్రాచీన, సంప్రదాయ కళా ప్రదర్శనల మేళవింపులో వికారాబాద్ అటవీ ప్రాంతానికి చెందిన గిరిజనుల కొమ్ము కోయ నృత్యం (కొమ్ము డోలు), కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్‌కు చెందిన సంప్రదాయ చెండా మేళం - పంచ వాయిద్యం, తూర్పు గోదావరి పిఠాపురానికి చెందిన సంప్రదాయ గరగ నృత్యం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడకు చెందిన మహిళా కోలాట నృత్య బృందాలు, కృష్ణాజిల్లా గరికపర్రుకి చెందిన జానపద డప్పులు (తప్పెట్లు) కళా బృందం, అమలాపురానికి చెందిన వీరనాట్యం (వీర భద్ర నృత్యం) బృందం, విజయవాడకి చెందిన శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ నాట్యాచార్య సప్పా శివకుమార్ ఆధ్వర్యంలో దుర్గాదేవి, పరమేశ్వరుని వేషధారణతో కూచిపూడి కళాకారులు ప్రదర్శన చేశారు. విభిన్న అరుదైన కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం పట్ల భవానీ భక్తులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈవో కె.ఎస్.రామారావు కళా బృందాలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఆలయ సంప్రదాయ ప్రదర్శనల ఏర్పాటు భవిష్యత్తు తరాలకి భక్తి, సంస్కృతులను నేర్పిస్తుందన్నారు. అంతరించిపోతున్న కళారూపాలైన కొమ్ము కోయ (ఈ ప్రదర్శనలో అడవి దున్న కొమ్ములు ధరించిన గిరిజన పురుషులు డోలు వాయిస్తుండగా, నెమలీకలు ధరించిన గిరిజన స్త్రీలు లయబద్ధంగా నృత్యం చేస్తారు. తెలంగాణ వికారాబాద్, ఆదిలాబాద్, ఆంధ్ర అల్లూరి జిల్లా చింతూరులో మాత్రమే ఈ కళాకారులు ఉన్నారు). వీర నాట్యం (వీర భద్ర నృత్యం) ఈ కళ గోదావరి జిల్లాల్లో కొంత మంది కళాకారులు మాత్రమే ఉన్నారు. దక్షయజ్ఞంలో తనకు జరిగిన అవమానంతో సతీదేవి అగ్నికి ఆహుతవ్వగా, పరమశివుని ఆగ్రహంతో ఆయన జటాజూటం నుంచి ఆవిర్భవించిన వీరభద్రుని అంశతో చేసే నృత్యమే ఈ వీర నృత్యం. ఇలాంటి కళారూపాలు ఏర్పాటు చేయడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఊర్వశిసెంటర్, గాంధీనగర్, అలంకార్ సెంటర్, బీసెంట్ రోడ్డు, ఏలూరు రోడ్డు, పాతబస్టాండ్, బందరు రోడ్డు, పోలీస్ కంట్రోల్ రూమ్, ఫ్లైఓవర్, కెనాల్ రోడ్డు, వినాయకుడి గుడి, రథం సెంటర్ మీదుగా ఉత్సవం సాగింది. ఈ ఉత్సవంలో పలు ప్రాంతాల నుంచి భవానీ దీక్షాదారులు సంప్రదాయ ఎర్రని దుస్తులు ధరించి ఉత్సవంలో పాల్గొన్నారు. ఎర్రటి కాంతులతో వెలుగుతున్న దీపాలను ఎర్రటి దుస్తులు ధరించి, భవానీ దీక్షాదారులు అత్యంత భక్తి ప్రపత్తులతో చేతబూని జై దుర్గా, జైజైదుర్గా అంటూ నామ స్మరణ చేస్తూ ఉత్సవానికి ప్రత్యేకత తీసుకువచ్చారు. ఈవో రామారావు దంపతులు శివరామకృష్ణ క్షేత్రంలో జ్యోతులకు నిర్వహించిన పూజలో పాల్గొన్నారు. వైదిక కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంతరించిపోతున్న కళారూపాలను ఒక్కచోట చేర్చే ప్రయత్నం దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు చేపట్టారు. శనివారం కలశ జ్యోతి ఊరేగింపులో ఈ సంఘటన జరిగింది. మన రాష్ట్రానికి చెందిన సంప్రదాయ కళలెన్నో ఉన్నాయి. చాలా వరకు కనుమరుగవగా ఉన్నవాటిని మనముందుకు తెచ్చే ప్రయత్నం చేశారు. శనివారం దుర్గగుడి ఆధ్వర్యంలో జరిగిన కలశస్థాపన ఊరేగింపులో ఈ కళారూపాలను ప్రదర్శించారు. వీటిని చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు.



గరగ నృత్యం



కోలాట నృత్యం



తప్పెట్లు



కూచిపూడి నృత్యం



వీరనాట్యం



చెండా మేళం - పంచ వాయిద్యం



కొమ్ము డోలు

18న దుర్గగుడిలో కానుకల లెక్కింపు

వన్‌టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 18న ఉదయం 8 గంటల నుంచి మల్లికార్జున మహామండపంలోని 6వ అంతస్తులో కానుకల లెక్కింపు జరుగుతుందని ఈవో కె.ఎస్.రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కానుకల లెక్కింపు పూర్తి పారదర్శకతతో జరుగుతుందని, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది, సేవాదారులు పాల్గొంటారని, ముందస్తు అనుమతితో లెక్కింపులో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

మరో మోసం!

(5వ పేజీ తరువాయి)

పనులు పలు విమర్శలకు తావిస్తున్నాయి. సొంత స్థలాల రేట్లను పెంచుకోవడానికి ల్యాంకో ఎన్‌హెచ్ అధికారులు, మేఘా కంపెనీతో కలసి పక్కా ప్లాన్ చేసుకుని తమను బలిచేసిందని అప్రూవ్డ్ లేఅవుట్ ప్లాట్ల కొనుగోలుదారులు బావురుమంటున్నారు. ల్యాంకో సంస్థ ప్రయోజనం కోసం తమను నాశనం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నున్న పంచాయతీ పరిధిలో 2008లో జనచైతన్య సంస్థ అప్రూవ్డ్ లేఅవుట్‌ను వేసింది. మొత్తం 200 ప్లాట్లతో వేసిన వెంచర్‌లో అనేక మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. 2009లో ల్యాంకో సంస్థకు చెందిన హైటెన్షన్ విద్యుత్ వైర్లు వెంచర్ మీదుగా వెళ్లడంతో అప్పట్లో ఆ సంస్థ 15 ప్లాట్ల వరకు కొనుగోలు చేసి టవర్లను ఏర్పాటు చేసుకుంది. పశ్చిమ బైపాస్ పనుల్లో భాగంగా వైర్ల డైవర్షన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ల్యాంకోకు చెందిన స్థలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను పూర్తిగా తొలగించే విధంగా పనులు చేపట్టడంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే కాంట్రాక్ట్ సంస్థతో కుమ్మక్కైన ల్యాంకో సంస్థ టవర్ల డైవర్షన్ పేరుతో వారి భూముల్లోని స్తంభాలను తొలగించి ఇతర ప్లాట్లలోకి మళ్లిస్తుందని వెంచర్‌లోని ప్లాట్ల కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. డైవర్షన్ పనుల కారణంగా ల్యాంకోకు చెందిన 15 ప్లాట్లలో స్తంభాలు, వైర్లు తొలగించుకుని ఆ భారాన్ని 45 ప్లాట్ల యజమానులపై మోపుతోందని విమర్శిస్తున్నారు. విద్యుత్ టవర్ల ఎత్తు పెంచితే రెండింటితో అయిపోయే పనులను ఐదు టవర్లను అదనంగా వేసి సమీప ప్లాట్ల యజమానులు, రైతులను నష్టపరుస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ల్యాంకో చర్యల కారణంగా సుమారు రూ.17 కోట్లు రైతులు, ప్లాట్ల యజమానులు నష్టపోతున్నారని ఇది దుర్మార్గమని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ భూములను కాపాడాలని వేడుకుంటున్నారు.



మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేతలు

జర్నలిస్టులకు మేలు చేస్తాం

● మంత్రి పార్థసారథి

వన్‌టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు మేలుచేసే పలు అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సీనియర్ నేతలు ధవళేశ్వరపు రవికుమార్, గొడబ రాంబాబు మంత్రిని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందజేశారు. అర్హులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. నిబంధనల పేరుతో గత ప్రభుత్వం అనేకమంది వర్కింగ్ జర్నలిస్టులను అక్రిడిటేషన్లకు దూరం చేసిందని వివరించారు. సీనియర్ వర్కింగ్ జర్నలిస్టులకు ఫ్రీలాన్సర్స్ విభాగంలో అక్రిడేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు దశాబ్దాల సొంతింటి కలను సాకారం చేయాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టులకు ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, పాత్రికేయులపై దాడుల నియంత్రణకు జిల్లాల్లో అటాక్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. సావధానంగా విన్న మంత్రి సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులకు మేలుచేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

కృష్ణా వర్సిటీ టీటీలో పీబీ సిద్ధార్థకు కాంస్యం

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో కేవీఎస్ఆర్ స్కాప్స్ కళాశాలలో ఇటీవల జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీల్లో మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల క్రీడాకారులు కాంస్యంతో సత్తా చాటారు. క్రీడాకారులు మరిన్ని విజయాలను సాధించాలని కళాశాల యాజమాన్యం ఆకాంక్షించింది. కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రెసిడెంట్ డాక్టర్ పీ నాగేశ్వరరావు, సెక్రటరీ లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎం రమేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి అభినందించారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

● గురుమూర్తి ప్రమాణస్వీకారోత్సవంతో

ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ

పటమట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతే లక్ష్యం గా అన్ననందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ చెప్పారు. విజయవాడ బెంజిసర్కిల్‌లో శనివారం లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన వీ రంకి వెంకట గురుమూర్తి ప్రమాణ స్వీకారానికి రామకృష్ణ ముఖ్యఅతిథి గా హాజరై మాట్లాడారు. సమసమాజ స్థాపన ధ్యేయంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, అప్పటి నుంచి బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తూ బీసీల అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు. పార్టీలో కష్టపడినవారికి గుర్తింపు లభిస్తుందనటానికి వీరంకి గురుమూర్తి ఒక ఉదాహరణ అన్నారు. టీడీపీ సీనియర్ నేత టీడీ జనార్ధన్ మాట్లాడుతూ గురుమూర్తి నిబద్ధత గల నేతని కొనియాడారు. పలువురు మంత్రులు, నేతలు గురుమూర్తి నాయకత్వ లక్షణాలను కొనియాడారు. కొలుసు పార్థసారధి, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ మంత్రులు పాల్గొన్నారు

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ దగ్ధం

విద్యాధరపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసినట్టు శనివారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం, గుడివాడ రామారావు వీధిలో షేక్ నజీర్ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఫ్రూట్ మార్కెట్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈనెల 12న రాత్రి 9 గంటలకు తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఆ రోజు అర్ధరాత్రి 2.40 గంటలకు బండి దగ్ధమవుతుండగా ఇంటి ఓనర్ నజీర్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం చెప్పాడు. వారు బైక్ దగ్గరకు వచ్చి చూడగా అప్పటికే పూర్తిగా బైక్ దగ్ధమైంది. వెంటనే వారు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి, బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నజీర్ తల్లి షేక్ తహేరున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. .

రైళ్ల అభిమానులకూ ప్రత్యేక లోగో!

రైల్వేస్టేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైల్వేకు సంబంధించిన ఫొటోగ్రాఫ్‌లు, కథనాలు, తదితరాలను సులభంగా పొందేందుకు రైలు అభిమానుల కోసం ప్రత్యేకంగా ఒక లోగోను ఆవిష్కరించారు. ఈ లోగోను విజయవాడ రైల్వే డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ నుస్రత్ ఎం మండ్రూపకర్ రూపొందించారు. దాన్ని శనివారం డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ భారతీయ రైల్వేకు అభిమానులు ఆత్మగా నిలుస్తున్నారన్నారు. రైల్వేల ఎదుగుదలకు మిలియన్ల మంది ప్రయాణికులు ఎంతో దోహదం చేస్తున్నారన్నారు. ఈ లోగో వారి ప్రయత్నాలకు ఊతమిస్తుందని, రైల్వే ఉజ్వల భవిష్యత్తు వైపుకు దారితీస్తుందన్నారు. వివిధ సామాజిక కార్యక్రమాల్లో ప్రయాణికుల భాగస్వామ్యం కోసం రైలు భద్రత, వారసత్వ పరిరక్షణ గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆధునికత జోడించి రైల్వే వ్యవస్థ స్థిరమైన అభివృద్ధికి తాము దృష్టి సారించామని, ఇందుకు రైలు అభిమానుల, ప్రయాణికుల మద్దతు కీలకమన్నారు. ఎస్‌సీఆర్ రైల్వే ఫ్యాన్స్ లోగో 125 మంది కంటే ఎక్కువ ఉన్న ఔత్సాహిక, వృత్తి ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, బ్లాగర్లు ఉన్నారన్నారు. హైదరాబాద్, విజయవాడ, కడప, బెంగళూరు, రాజమండ్రి, విశాఖపట్నం ప్రాంతాల నుంచి 25 మంది రైలు అభిమానులు పాల్గొన్నారు. పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

కూటమి హవా!

(5వ పేజీ తరువాయి)

నిలిచాయి. పెందూరులో జనసేన రెండు వర్గాలు ఏర్పడడంతో వివాదం రేగింది. దీనితో ఎన్నిక నిలుపుదల చేశారు. మనిమేశ్వరంలో ఏడు టీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. పెదతుమ్మిడి 12 టీసీలకు నామినేషన్లు దాఖలు కాలేదు. ఎన్నికలు జరిగిన ఏడు నీటి సంఘాలను టీడీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది.

లాటరీలో గెలిచాడు

జగ్గయ్యపేట మండలంలో పోచంపల్లి నీటి సంఘం పరిధిలో 12 టీసీలు ఉన్నాయి. ఆరో టీసీకి టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ రెబల్‌గా పింగళి రామకృష్ణారెడ్డి, టీడీపీ నుంచి వెల్లంపల్లి సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. ఇద్దరు అభ్యర్థులకు చెరో 22 ఓట్లు వచ్చాయి. దీనితో అధికారులు లాటరీ విధానంలో వెల్లంపల్లి సత్యనారాయణ ఎన్నికైనట్టు ప్రకటించారు. అనుమంచిలో 12 టీసీలు ఉండగా మూడు స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఎన్నిక ఆగింది. బూదవాడలో 12 టీసీలు ఉన్నాయి. ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్ష పదవి జనసేన కైవసం చేసుకుంది.

● పెదపారుపూడి మండలం మోపర్రు నీటి సంఘానికి ఉన్న 12 టీసీలు ఏకగ్రీవమయ్యాయి. ఈ టీసీలను కూటమి సొంతం చేసుకుంది. 11 టీసీలను టీడీపీ, ఒక టీసీని జనసేన తమ ఖాతాలో వేసుకున్నాయి.

● పెనుగంచిప్రోలు మండలంలో 13 టీసీలు ఉండగా అన్నింటినీ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. పెనుగంచిప్రోలులో మేజర్ ఇరిగేషన్ కింద రెండు, ముళ్లపాడు రెండు, తోటచర్ల ఒకటి, నవాబుపేట ఒకటి, అనిగండ్లపాడు ఒకటి టీసీ ఉన్నాయి. మీడియంలో ముచ్చింతాల ఒకటి, పెనుగంచిప్రోలు ఒకటి, అనిగండ్లపాడు ఒకటి, గుమ్మడిదుర్రు ఒకటి ఉండగా మైనర్‌లో నవాబుపేట ఒకటి, కొనకంచి ఒకటి చొప్పున టీసీ స్థానాలు ఉన్నాయి. మండలంలో 13 నీటి సంఘాల అధ్యక్ష పీఠాలను టీడీపీ కైవసం చేసుకోగా, పెనుగంచిప్రోలు నీటి సంఘ అధ్యక్షుడి స్థానాన్ని జనసేన తీసుకుంది.

● గుడివాడ రూరల్ మండలంలో ఐదు నీటి సంఘాలు ఉన్నాయి. 60 టీసీ స్థానాలు ఉన్నాయి. ఈ ఐదు నీటి సంఘాల అధ్యక్ష పదవులను టీడీపీ కైవసం చేసుకుంది.

● రెడ్డిగూడెం మండలంలో 26 నీటిసంఘాలు ఉన్నాయి. వాటిలో 24 నీటి సంఘాలను కూటమి ఏకగ్రీవంగా గెలుచుకుంది. రంగాపురం చెరువులకు రెండు నీటి సంఘాలు ఉన్నాయి. రావుల ట్యాంక్, జంట కుంటల ట్యాంక్ ఉన్నాయి. ఇందులో ఒక చెరువు సంఘం పరిధిలో వైసీపీ బలం ఎక్కువగా ఉంది.

● తిరువూరు మండలంలో ఆరు మేజర్‌లో 72 టీసీలు, 16 మైనర్‌లో 96 టీసీలు ఉన్నాయి. మొత్తం 168 టీసీలు ఏకగ్రీవమయ్యాయి. వత్సవాయిలో 12 టీసీలు ఉండగా అన్నీ ఏకగ్రీవమయ్యాయి.

● ఏ.కొండూరు మండలంలో మొత్తం 12 నీటి సంఘాలు ఉన్నాయి. కొత్తరేవూడి తాళ్ల చెరువు నీటి సంఘాన్ని ఏకగ్రీవం చేసుకోవాలనుకున్నారు. ఆరు స్థానాలకు మార్కెటింగ్ మాజీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి వర్గంగా కొప్పుల బాబూరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో ఐదు స్థానాలను రమేష్‌రెడ్డి వర్గం గెలుచుకుంది.

సీఎం రాకకు ఏర్పాట్ల పరిశీలన

● అధికారులతో మంత్రి చర్చలు ● నేడు తుమ్మలపల్లిలో పొట్టి శ్రీరాములు వర్ధంతి

వన్‌టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరగనున్న పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని జరగనున్న సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా శనివారం సమాచార శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఏర్పాట్లను పరిశీలించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణదినంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న సభకు సీఎం చంద్రబాబు హాజరు కానున్నారని, ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ఏపీ ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, పశ్చిమ కార్యాలయం కార్యదర్శి పి.శ్రీధర్ ఉన్నారు.

ఏర్పాట్లలో లోపాలు ఉండరాదు: వీఎంసీ కమిషనర్

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరగనున్న సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్న దృష్ట్యా చేపట్టిన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. తాగునీటి సరఫరాలో అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. వీఎంసీ చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, సూపరింటెండెంట్ ఇంజనీర్లు సత్యకుమారి, సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి



గుజరాత్ స్పోర్ట్సు హాస్టల్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జట్ల మధ్య మ్యాచ్

జాతీయ ఇన్విటేషన్ వాలీబాల్‌లో

ఎస్ఆర్ఎం వర్సిటీ ముందంజ

● నేటితో ముగియనున్న టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న నాదెళ్ల బసవపూర్ణయ్య (ఎన్‌బీపీ) ట్రస్ట్ అఖిలభారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నమెంట్‌లో మూడోరోజు జరిగిన మ్యాచ్‌లతో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ముందంజలో నిలిచింది. శనివారం నాటి మ్యాచ్‌లతో మొత్తం 12 జరగ్గా 8 పాయింట్లతో ఆ జట్టు అగ్రస్థానంలో నిలిచింది. 6 పాయింట్లతో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జేఈపీఏఐఆర్ యూనివర్సిటీ టీమ్‌లు రెండో స్థానంలో కొనసాగుతున్నాయి. తమిళనాడు క్రీడాప్రాధికార సంస్థ(ఎస్‌ఏటీ) నాలుగోస్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా మాజీ వాలీబాల్ ప్లేయర్స్ డి ప్రభాకరరాజు, సింహారావు, తులసీరెడ్డి, రామకృష్ణంరాజును ముఖ్య అతిథులు ఉయ్యూరు మున్సిపల్ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), వీఆర్ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ బి పాండురంగారావు మెమెంటో, దుశ్శాలువాలతో సత్కరించారు. సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ లలిత్ ప్రసాద్ పాల్గొనగా, నిర్వాహకులు నాదెళ్ల బ్రహ్మాజీరావు, దోనేపూడి దయాకర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం టోర్నీ ముగుస్తుందని, విజేతలకు రూ.2.25 లక్షల నగదు బహుమతులు, ట్రోఫీలను ప్రధానం చేయనున్నారు.

రాష్ట్ర సీనియర్ కబడ్డీ టోర్నీలో ఉమ్మడి కృష్ణా జట్ల సత్తా

ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి 71వ సీనియర్, మహిళల, పురుషుల కబడ్డీ టోర్నీలో ఉమ్మడి కృష్ణా జట్లు ముందంజ వేశాయి. మహిళా జట్టు తన సత్తా చాటి విన్నర్‌గా నిలవగా, పురుషుల జట్టు మూడో స్థానంలో నిలిచిందని జిల్లా అసోసియేషన్, అధ్యక్షుడు నాంచారయ్య, కార్యదర్శి రవికుమార్ తెలిపారు. సత్తా చాటిన జట్లను ఏపీ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, యలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.

నేడు ఉమ్మడి కృష్ణా కబడ్డీ ఎంపికలు

ఉమ్మడి కృష్ణా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న మధ్యాహ్నం 2 గంటలకు తాడంకిలోని జెడ్పీహైస్కూల్ ప్రాంగణంలో జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ పీ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు 2005 జనవరి 11 తర్వాత పుట్టిన వారై బాలుర బరువు 70 కేజీలు, బాలికల బరువు 65 కేజీలు ఉండాలన్నారు. ఎంపికైన వారిని రావులపాలెంలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9704063555 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



ఉత్సాహంగా శ్రీమతి అమరావతి పోటీలు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళుతున్నారని ప్రముఖ సినీ హాస్యనటుడు, మాజీ ఎంపీ బాబూమోహన్, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ అంబికా కృష్ణ అన్నారు. తేజాస్ ఎలైట్ ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ గ్రౌండ్స్‌లో శనివారం శ్రీమతి అమరావతి సంప్రదాయ ఫ్యాషన్ షో 9వ సీజన్ గ్రాండ్ ఫైనల్స్ అత్యంత ఘనంగా జరిగాయి. సంప్రదాయ వస్త్రధారణతో మొత్తం 50 మంది ఈ పోటీల్లో పాల్గొనగా 30 మంది రన్నర్స్‌గా నిలిచారు. మొదటి రన్నరప్‌గా ప్రదీపిక, రెండో రన్నరప్‌గా శాంతి నిలవగా శ్రీప్రియ విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులతో పాటు నటీమణులు సురభి, దివి వైద్య, అర్చన, కామ్నా జెఠ్మలానీ, తేజాస్ ఎలైన్ ఎండీ తేజశ్వీ తాతినేని, సీఈవో టి.ప్రదీప్ చౌదరి పాల్గొని మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా దిగ్విజయంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల వల్ల మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకత, సమర్థత వెలికి తీయడం ఎంతో తేలికవుతుందన్నారు.

सत्यमेव जयते

GOVERNMENT OF GUJARAT

Gujarat Tourism



Shri Narendra Modi
Hon'ble Prime Minister

"Absolutely thrilled to see Dhordo in Kutch being celebrated for its rich cultural heritage and natural beauty. This honour not only showcases the potential of Indian tourism but also the dedication of the people of Kutch in particular.

May Dhordo continue to shine and attract visitors from around the world!"



Shri Bhupendrabhai Patel
Hon'ble Chief Minister, Gujarat

rann utsav

01st DEC, 2024 to 28th FEB, 2025

Rann Ek Rang Anek

Imagine a place where the earth glows white under the moonlight and where every sunrise paints the desert in hues of gold. This is the magic of Rann Utsav - an unforgettable experience that will stay with you for a lifetime.









Stay in luxury tents or Kutchi Bhungas	Explore attractions with guided tours	Enjoy ziplines, ATVs & more	Savour culture, cuisine & crafts

Kutch Nahi Dekha Toh Kuch Nahi Dekha

TOURISM CORPORATION OF GUJARAT LIMITED
Udyog Bhavan, Block No. 16, 4th Floor, Sector - 11, Gandhinagar - 382 010, Gujarat
www.gujarattourism.com • Toll-Free Number: 1800 203 1111

DHORDO BEST TOURISM VILLAGE 2023 BY UNWTO

UNWTO World Tourism Organization


పరేడ్‌లో క్యాడెట్స్‌ను అభినందిస్తున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్

భవిష్యత్ యుద్ధాలకు ఏరోస్పేస్ కీలకం

- ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్
- దుండిగల్‌లో 214 కోర్సు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరు

అల్వాల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో యుద్ధాలకు గగనతల సైనిక శక్తి, సామర్థ్యాలు(ఏరోస్పేస్ పవర్) కీలకం కానున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన 214 కోర్సు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత వైమానిక దళం గౌరవాన్ని, సంప్రదాయాలను యువ అధికారులు కాపాడాలన్నారు. యుద్ధ రంగంలో ఏ శాఖ కూడా ఒంటరిగా పని చేయదని, విజయం అనేది ఆకాశంలో ఉన్నా, భూమిపై అయినా.. సహకారం, పరస్పరం నేర్చుకోవడంపై ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. కొత్తగా నియమించిన అధికారుల్లో 178 మంది యువకులు, 26 మంది యువతులు ఉన్నారు. మొత్తం 204 మంది గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసుకున్నారు. ఐఏఎఫ్‌లో వివిధ శాఖల్లో వీరు చేరారు. మరోవైపు, భారత నావికాదళానికి చెందిన 9 మంది అధికారులు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ నుంచి 9 మంది అధికారులు, వియత్నాం పీపుల్స్ ఎయిర్‌ఫోర్స్ నుంచి ఒకరు ఈ వేడుకల్లో 'వింగ్స్' అవార్డును అందుకున్నారు. మరోవైపు, భారత వైమానికదళంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆయుధ వ్యవస్థ విభాగం(వెపన్ సిస్టమ్ బ్రాంచ్)లోకి ఈ గ్రాడ్యుయేషన్ బృందం నుంచే అధికారులను నియమించారు. పరేడ్ తర్వాత, ఎయిర్ ఫోర్సు అకాడమీలో ప్రదర్శించిన స్కైడైవింగ్, ఎయిర్ క్రాఫ్ట్ విన్యాసాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. వాయుసేనకు చెందిన ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్ నిర్వహించిన డ్రిల్ విశేషంగా ఆకట్టుకొంది.

బెయిల్ ఉత్తర్వులు అందినా..

అక్రమంగా నిర్భందించారు

- ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- అల్లు అర్జున్ అడ్వొకేట్ అశోక్‌రెడ్డి
- కాంగ్రెస్ వీడే యోచనలో అల్లు అర్జున్ మామ


అల్లు అర్జున్ తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధ్యంతర బెయిల్ ఉత్తర్వులు అందిన తర్వాత కూడా అల్లు అర్జున్‌ను విడుదల చేయకుండా అక్రమంగా నిర్బంధించారని ఆయన తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వుల్లో తక్షణమే విడుదల చేయాలని స్పష్టంగా ఉన్నా జైలు అధికారులు పాటించలేదని విమర్శించారు. అందుకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయమై న్యాయ ప్రక్రియ కొనసాగిస్తామని పేర్కొన్నారు. కాగా అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ వీడనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎలాంటి తప్పు లేకున్నా అల్లుడిని అరెస్టు చేశారని, బెయిల్ వచ్చినా జైలుకి పంపారని అనుచరుల వద్ద ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితిలో పార్టీలో కొనసాగితే అవమానం అనే భావనతో కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

నేను రమ్మంటేనే మీడియా లోపలికి..

- నిస్సహాయ స్థితిలో నేనే ఆశ్రయించా
- వాళ్ల తప్పులేదు.. ఎక్స్‌లో మంచు మనోజ్
- నాపై రెండ్రోజుల్లో రెండు సార్లు దాడి
- ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని వ్యాఖ్య

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్ బాబు నివాసంలో మీడియాపై దాడి ఘటనపై అతని కుమారుడు మంచు మనోజ్ స్పందించారు. ఈ విషయంలో మీడియా వారి తప్పేమీ లేదని, తాను రమ్మంటేనే మీడియా వారు తమ ఇంట్లోకి వచ్చారని స్పష్టం చేశారు. నిస్సహాయ స్థితిలో తానే మీడియాను ఆశ్రయించానని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో శనివారం ఓ పోస్టు చేశారు. తొమ్మిది నెలల వయస్సున్న తన బిడ్డను జల్‌పల్లిలోని ఇంట్లోనే ఉంచి.. తనకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు డిసెంబరు 10న తన భార్యతో కలిసి డీజీపీ కార్యాలయానికి వెళ్లానని మనోజ్ పేర్కొన్నారు. అయితే, సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంట్లోకి వెళ్లకుండా తనని అడ్డుకున్నారని తెలిపారు. దీంతో గేటును బద్దలుకొట్టి తాను లోపలికి వెళుతుండగా బౌన్సర్లు, భద్రతా సిబ్బంది తనపై దాడి చేశారని ఆరోపించారు. ఈ క్రమంలో తన చొక్కా చిరిగిందని, తెల్ల దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి ఛాతీపై కొట్టాడని పేర్కొన్నారు. ఆత్మరక్షణ కోసం తాను అతన్ని దూరంగా నెట్టానని తెలిపారు. ఆ సమయంలో తాను మద్యం మత్తులో లేనని స్పష్టం చేశారు. రెండు రోజుల్లో తనపై రెండు సార్లు దాడి జరిగిందని చెప్పారు. ఇలా తనని అడ్డుకుంటుండంతో చిరిగిన చొక్కాతో నిస్సహాయ స్థితిలో బయటకు వచ్చి మీడియా సాయం కోరినట్టు మనోజ్ వివరించారు. ఆ రెండు రోజులు తమ నివాసంలో ఏం జరిగిందో తెలియాలంటే సీసీ కెమెరా ఫుటేజీలను బయటపెట్టాలని తన సోదరుడు మంచు విష్ణుకు సన్నిహితుడైన రాజ్ కొండూరును డిమాండ్ చేశారు. ఈ వివాదానికి సంబంధించి కిరణ్, విజయ్ అనే ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నారని, సీసీ ఫుటేజీల ఆధారంగా వారిని విచారిస్తే వాస్తవాలు బయటికి వస్తాయని మనోజ్ పేర్కొన్నారు.

ఆ కాసేపు కనిపించని విష్ణు

ఇక, తనపై దాడి చేసి చొక్కా చిరిగిన సమయంలో మంచు విష్ణు కాసేపు కనిపించకుండా పోయాడని మనోజ్ ఆరోపించారు. తన తండ్రి మోహన్ బాబు మీడియా వారిపై దాడి చేసి ఇంట్లోకి తిరిగి వెళ్లిన తర్వాత తిరిగి విష్ణు బయటికొచ్చాడని తెలిపారు. తమ తండ్రిని విష్ణు ఆస్పత్రికి తీసుకెళ్లాడని చెప్పారు. దీనిని కొన్ని గంటల ముందు తనకు మద్దతుగా వచ్చిన వారిని విష్ణు భయపెట్టేందుకు యత్నించారని ఆరోపించారు. అవసరమైతే ఆయుధాలు కూడా తెప్పిస్తానని తన బౌన్సర్లకు విష్ణు చెప్పాడని అన్నారు. అయితే, తన కుటుంబం పట్ల వినయ్ వ్యవహరిస్తున్న తీరు అన్యాయం, అనైతికమని మనోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎక్కడికీ పారిపోనని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని పేర్కొన్నారు.

13 గంటలు జైల్లో!

శనివారం ఉ. 6:30 గంటలకు జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్

- అరెస్టయిన రోజు సాయంత్రం చాయ్, బిస్కెట్లు.. జైలులో ఎగ్‌ఫ్రైడ్ రైస్‌తో డిన్నర్
- బ్యారక్‌లో బెడ్, కుర్చీ ఏర్పాటు
- ఇదే కేసులో మరో ఇద్దరు బెయిల్‌పై విడుదల
- బాధిత కుటుంబాన్ని త్వరలో పరామర్శిస్తా: అల్లు అర్జున్


చంచల్‌గూడ జైలు నుంచి వచ్చిన అల్లు అర్జున్‌కు నివాసం వద్ద దిష్టి తీస్తున్న బామ్మ

సైదాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, పుష్ప చిత్రం కథానాయకుడు అల్లు అర్జున్ 13 గంటలు చంచల్‌గూడ జైల్లో ఉన్నారు. అరెస్టయిన రోజు రాత్రి జైలు క్యాంటీన్‌లో వండిన ఎగ్‌ఫ్రైడ్ రైస్ తిన్నారు. రాత్రిపూట చలితో ఇబ్బందిపడ్డారు. చాలాసేపు మెలకువగానే ఉన్న ఆయన, అర్ధరాత్రి తర్వాత నిద్రపోయారు. ఎక్స్‌రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట, మహిళ మృతి కేసులో శుక్రవారం అరెస్టయి రిమాండ్ ఖైదీగా సాయంత్రం 5:30 గంటలకు చంచల్‌గూడ జైలుకు వెళ్లారు. శనివారం ఉదయం 6:30 గంటలకు మధ్యంతర బెయిల్ మీద జైలు నుంచి విడుదలయ్యారు. అల్లు అర్జున్ అరెస్టయిన గంటలోనే హై కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినప్పటికీ.. బెయిల్ పత్రాలు సమయానికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో విడుదల జాప్యమైంది. జైల్లో అల్లు అర్జున్‌ను అధికారులు అండర్ ట్రయల్ ఖైదీ నంబర్ 7697 కేటాయించి మంజీరా బ్యారక్‌లో గట్టి బందోబస్తు మధ్య ఉంచారు. జైలు అధికారులు అల్లు అర్జున్‌కు తొలుత చాయ్, బిస్కెట్లు ఇచ్చారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందన్న సమాచారం మేరకు అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. న్యాయస్థానం ఆదేశాల మేరకు స్పెషల్ కేటగిరి సదుపాయాలు కల్పించాల్సి ఉండటంతో ఆయనకు ఒక బెడ్, కుర్చీ ఏర్పాటు చేశారు. రాత్రి ఎగ్‌ఫ్రైడ్ రైస్ తిన్నారు. వాస్తవానికి డిన్నర్ చేయడానికి ఆయన ఇష్టపడలేదు. ఏదైనా తినాలి కదా? బయట నుంచైనా భోజనం తెప్పించుకుంటారా? అని జైలు అధికారులు ఆయన్ను అడిగినట్లు తెలిసింది. దీనికి అల్లు అర్జున్.. ఇక్కడే ఏదైనా దొరుకుతుందా? అని అడగడంతో క్యాంటీన్‌లో ఎగ్ ఫ్రైడ్‌రైస్ చేయిస్తామని అధికారులు చెప్పారు. రాత్రిపూట చలి ఎక్కువగా ఉండటంతో అధికారులు అల్లు అర్జున్‌కు కొత్త రగ్గు, దుప్పట్లను అందజేశారు. అర్ధరాత్రి చాలాసేపటి వరకు మెలకువగా ఉన్న అల్లు అర్జున్ ఆ తర్వాత తనకు కేటాయించిన బెడ్‌పై నిద్రపోయారు. తెల్లవారుజామున 5.30 గంటలకు ఆయన్ను జైలు సిబ్బంది నిద్రలేపి విడుదలకు సిద్ధం చేసినట్లు తెలిసింది. విడుదల సమయంలో ఆయన తండ్రి అల్లు అరవింద్, మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి జైలు వద్దకు చేరుకున్నారు. ఉదయం 6.30 గంటలకు అల్లు అర్జున్ జైలు బయటకొచ్చారు. ఈ సందర్భంగా జైలు సిబ్బంది ఆయనతో సెల్ఫీ తీసుకునేందుకు పోటీ పడ్డారు. సెక్యూరిటీ కారణంగా పోలీసుల ఆదేశాలతో అల్లు అర్జున్‌ను జైలు వెనుక మార్గం నుంచి పంపించారు. అక్కడి నుంచి తండ్రి అల్లు అరవింద్‌తో కలిసి ఆయన వెళ్లిపోయారు. ఇదే కేసులో అరెస్టయిన నిందితుల్లో ఇద్దరు.. థియేటర్ పార్టనర్స్ అగమాటి పెద్ద రామారెడ్డి, అగమాటి చిన్న రామారెడ్డికి బెయిల్ మంజూరైంది. వారు కూడా శనివారం బెయిల్‌పై విడుదలైనట్లు జైలు అధికారులు వెల్లడించారు.

ఒంటిపై డీజిల్ పోసుకొని అభిమాని హంగామా

అల్లు అర్జున్‌ను వెంటనే విడుదల చేయాలంటూ ఓ అభిమాని జైలు ముందు ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించాడు. అతడిని పోలీసులు అడ్డుకున్నారు. అల్లు అర్జున్‌ను ఎందుకు అరెస్ట్ చేశారంటూ పోలీసులతో అతడు వాగ్వివాదానికి దిగాడు. అతడిని పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యక్తి బాలాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ముదావత్ రాజు(31)గా గుర్తించారు. అతడిపై డబీర్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్టాన్ని గౌరవిస్తాను: అల్లు అర్జున్

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తన ప్రమేయం లేదని, 20 ఏళ్ల నుంచి ప్రేక్షకులతో కలిసి ఆ థియేటర్‌లో సినిమా చూస్తున్నానని సినీ నటుడు అల్లు అర్జున్ అన్నారు. థియేటర్‌లో మహిళ మృతిచెందడం ప్రమాదవశాత్తు జరిగిన ఘటన అని, అది చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తాను అండగా ఉంటానని, త్వరలోనే ఆ కుటుంబసభ్యులను పరామర్శిస్తానని చెప్పారు. తాను బాగానే ఉన్నానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. తనకు మద్దతు తెలిపిన అభిమానులు, సినీ ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక మహిళ మృతి ఘటనలో తన కుమారుడికి సంబంధం లేదని, ఆ ఘటన దురదృష్టకరం అని అల్లు అరవింద్ అన్నారు. బన్నీని జైలు నుంచి బయటకు తీసుకొచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, మీడియాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు.

అరెస్టుతో ప్రభుత్వానికి

సంబంధం లేదు

- అల్లు అర్జున్‌పై సర్కారు ఎలాంటి ద్వేషం లేదు
- చట్టం తన పని తాను చేసుకుపోతుంది: సీతక్క
- అల్లు అర్జున్ మామ కాంగ్రెస్ నేతే
- ఫార్ములా 1 స్కామ్‌లో అక్రమాలు తేలితే.. కేటీఆర్‌పైనా చర్యలు : మహేశ్ కుమార్ గౌడ్

ఖానాపూర్/ఉట్నూర్, హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సినీ కథానాయకుడు అల్లు అర్జున్ అరెస్టుతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట, ఓ మహిళ మృతి కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుందని చెప్పారు. శనివారం నిర్మల్ జిల్లా కడెం మండలంలో పర్యటించిన సందర్భంగా అల్లు అర్జున్ అరెస్టుపై మాట్లాడారు. అల్లు అర్జున్‌పై తమ ప్రభుత్వానికి ఎటువంటి ద్వేషం లేదని, ఆ మాటకొస్తే అల్లు అర్జున్ మామ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బంధువేనని చెప్పారు. సినీ హీరో చిరంజీవి కూడా కాంగ్రెస్ నేపథ్యం ఉన్న వారేనన్నారు. చట్టపరంగా జరిగే అంశాలపై రాద్ధాంతం తగదన్నారు. ఇక చట్టానికి ఎవరూ అతీతులు కాదని, దాని ముందు అందరూ సమానమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సంజయ్‌గాంధీ 44వ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో శనివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం విలేకరులతో ఆయన అల్లు అర్జున్ అరెస్టుపై మాట్లాడారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో ఒక సామాన్యురాలు ప్రాణాలు కోల్పోయిందని, ఆమె కుమారుడు చావు, బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నాడని గుర్తు చేశారు. అల్లు అర్జున్‌కు పిల్లనిచ్చిన మామ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడేనని, సీఎం రేవంత్‌రెడ్డికీ.. అల్లు అర్జున్ కుటుంబంతో బంధుత్వం ఉందన్నారు. అయినా చట్టం ముందు అందరూ సమానమేనని చెప్పారు. తెలుగు చిత్రసీమకు, కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందన్నారు. కాగా.. ఫార్ములా 1 రేసింగ్‌లో నిధుల్లో గోల్‌మాల్ జరిగినట్లుగా అధికారులు గుర్తించారని, ఇందులో కేటీఆర్ అక్రమాలకు పాల్పడినట్లు తెలితే ఆయనపైనా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పైనా ఎందుకు ధ్యాస పెట్టలేదో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత చెప్పాలన్నారు.

నవ్య | చిత్రజ్యోతి



నరసింహం చేసే సవారి

బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ డియోల్, శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, చాందినీ చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. శనివారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ద రేజ్ ఆఫ్ డాకు'ను విడుదల చేశారు మేకర్స్. అనంత శ్రీరామ్ రచించిన ఈ గీతాన్ని నకాశ్ అజీజ్, భరత్‌రాజ్, రితేశ్.జి.రావు, కె.ప్రణతి ఆలపించారు. తమన్ సంగీతం అందించారు. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 12న ఈ సినిమా విడుదలవుతోంది.



మరో విజయం ఖాయం

నాని

సుబ్బు మంగదేవి దర్శకత్వంలో అల్లరి నరేశ్, అమృత అయ్యర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బచ్చలమల్లి'. రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈనెల 20న విడుదలవుతోందీ చిత్రం. ఈ సందర్భంగా ట్రైలర్‌ను హీరో నాని శనివారం లాంచ్ చేశారు. ఆయన మాట్లాడుతూ "బచ్చలమల్లి' సినిమాతో అల్లరి నరేశ్ మరో విజయం సాధించడం ఖాయం. టీజర్, ట్రైలర్ అదిరిపోయాయి. నాకు బాగా నచ్చిన సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్. ఆయన సంగీతం ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది" అన్నారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'సుబ్బు ఎంత అద్భుతంగా ఈ కథ చెప్పారో అంతకన్నా విన్నగా తెరపైకి తెచ్చారు. ఈ సినిమా నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది' అని అన్నారు. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించాలని హీరోయిన్ అమృత అయ్యర్ కోరారు. సుబ్బు మాట్లాడుతూ 'కథను అర్థం చేసుకొని నరేశ్ పాత్రోచితంగా నటించినందువల్లే ఈ సినిమా ఇంత గ్రాండ్‌గా వచ్చింది' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ ' ఈ క్రిస్మస్‌కి 'బచ్చలమల్లి' మోత మోగిపోద్ది. సినిమాపై అంత కాన్ఫిడెంట్‌గా ఉన్నాను' అని తెలిపారు.


పుష్ప ఇంటికి సినీ ప్రముఖులు

- కంటతడి పెట్టిన సురేఖ, సుకుమార్
- పలువురు సినీ ప్రముఖుల పరామర్శ



'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో అరెస్టయిన అల్లు అర్జున్ మధ్యంతర బెయిలుపై శనివారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. అక్కడి నుంచి తన తండ్రి అల్లు అరవింద్‌తో కలసి నేరుగా గీతా ఆర్ట్స్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ న్యాయవాది అశోక్ రెడ్డితో అరగంట చర్చించిన అనంతరం ఇంటికి వెళ్లారు. ఆయన ఇంటికి చేరుకోగానే అక్కడ వాతావరణం అంతా ఒక్కసారిగా ఉద్విగ్నభరితంగా మారింది. అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అయాన్, కూతురు అర్హ భావోద్వేగానికి గురయ్యారు. ఆయనను చూడడానికి అభిమానులు భారీగా తరలివచ్చారు. పలువురు సినీ ప్రముఖులు అల్లు అర్జున్‌ను కలసి పరామర్శించారు. దర్శకుడు సుకుమార్, చిరంజీవి సతీమణి, సురేఖ.. అల్లుఅర్జున్‌ను హత్తుకుని కంటతడి పెట్టారు. దర్శకుడు కె.రాఘవేంద్రరావు, వంశీ పైడిపల్లి, కొరటాల శివ, హరీష్ శంకర్, బోయపాటి శ్రీను నిర్మాత నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, దిల్‌రాజు, డి. సురేశ్‌బాబు హీరో వెంకటేశ్, విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, దగ్గుబాటి రానా, నాగచైతన్య, ఉపేంద్ర, సిద్ధు జొన్నలగడ్డ, సుధీర్‌బాబు, శర్వానంద్, ఆర్.నారాయణమూర్తి, సంగీత దర్శకుడు తమన్, రాజశేఖర్, జీవిత తదితరులు అల్లు అర్జున్‌ను కలిశారు. ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్ అల్లు అర్జున్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శ్రీలీల, మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా బన్నీకి మద్దతు తెలిపారు.

అల్లు అర్జున్‌కు చంద్రబాబు ఫోన్



సినీ హీరో అల్లు అర్జున్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి మాట్లాడారు. శనివారం అల్లు అర్జున్ జైలు నుంచి విడుదలై ఇంటికి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఆయనకు ఫోన్ చేసి పరామర్శించారని తెలుగుదేశం పార్టీ వర్గాలు తెలిపాయి. ఏం జరిగిందో అడిగి తెలుసుకొని భరోసా ఇచ్చారని వివరించాయి. అల్లు అర్జున్ అరెస్టు జరిగిన తర్వాత శుక్రవారం రాత్రి ఆయన తండ్రి అల్లు అరవింద్‌కు చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడారు. ఆందోళన చెందవద్దని, సమస్య పరిష్కారం అవుతుందని ధైర్యం చెప్పారని సమాచారం.

-అమరావతి (ఆంధ్రజ్యోతి)

నేను పారిపోలేదు



తాను ఎక్కడికీ పారిపోలేదని, తన ముందస్తు బెయిల్‌ను న్యాయస్థానం తిరస్కరించలేదని సినీ నటుడు మోహన్‌బాబు వెల్లడించారు. ఈ విషయాన్ని శనివారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నానని, జల్‌పల్లిలోని ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నానని వెల్లడించారు. మీడియా వాస్తవాలను వెల్లడించాలని, తప్పుడు ప్రచారాలు చేయొద్దని కోరారు. జర్నలిస్టుపై జరిగిన దాడి కేసులో 'మోహన్‌బాబుకు న్యాయస్థానంలో ఊరట లభించలేదు, ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది' అంటూ జరుగుతున్న ప్రచారంలో నిజంలేదని ఆయన తెలిపారు. జల్‌పల్లిలోని తన నివాసంలో మీడియాపై దాడి చేసిన ఘటనలో పహాడీషరీఫ్ పోలీసులు ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణను న్యాయస్థానం ఈనెల 19కి వాయిదా వేసినట్లు తెలిసింది.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్‌కు రూ.1,522 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (గతంలో హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్).. చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ నుంచి రూ.1,522.40 కోట్ల విలువైన ఆర్డర్‌ను చేజిక్కించుకున్నట్లు ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా 2,200 లోకోమోటివ్స్‌కు ఆన్-బోర్డ్ కొలిషన్ అవాయిడెన్స్ సిస్టమ్ (టీసీఏఎస్, కవచ్) పరికరాల సరఫరా, ఇన్‌స్టలేషన్, కమిషనింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. 12 నెలల కాలంలో ఈ ఆర్డర్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ వెల్లడించింది.

సీఐఐ అమరావతి చాప్టర్ యంగ్ ఇండియన్స్ అధ్యక్షుడిగా హరికృష్ణ



విజయవాడ (ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అమరావతి చాప్టర్ యంగ్ ఇండియన్స్ విభాగ అధ్యక్షుడిగా కంకణాల హరికృష్ణ ఎన్నికయ్యారు. శనివారం నాడిక్కడ జరిగిన తొమ్మిదో వార్షిక సమావేశంలో 2025 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చిట్టినేని బాలకృష్ణ, దక్షిణ ప్రాంతీయ విభాగ అధ్యక్షుడిగా శ్రీనివాస్ జోషి, విజయవాడ జోన్ చైర్మన్‌గా డీవీ రవీంద్రనాథ్ ఎన్నికయ్యారు.

2025 డిసెంబరు నాటికి నిఫ్టీ @ 26,100

కోటక్ సెక్యూరిటీస్ అంచనా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్ భారీ ఒడుదుడుకులకు లోనైంది. వరుస రికార్డులు మురిపించగా.. భారీ పతనాలు కుదిపేశాయి. ఈ సెప్టెంబరులో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి 26,277 వద్దకు ఎగబాకిన నిఫ్టీ.. విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలు పోటెత్తించడంతో అక్టోబరు, నవంబరులో భారీ నష్టాలను చవిచూసింది. ప్రస్తుతం సూచీ 24,750 ఎగువ స్థాయిలో ట్రేడవుతోంది. అయినప్పటికీ, ఈ ఏడాదిలో ఇప్పటివరకు సూచీ 11 శాతం మేర వృద్ధి కనబరిచింది. అయితే, వచ్చే ఏడాదిలో మార్కెట్ పనితీరుపై కోటక్ సెక్యూరిటీస్ అప్రమత్తతతో కూడిన ఆశాభావాన్ని వ్యక్తపరిచింది. 2025 డిసెంబరు నాటికి నిఫ్టీ 26,100 వద్దకు చేరవచ్చని తాజా నివేదికలో అంచనా వేసింది. ప్రస్తుత స్థాయితో పోలిస్తే, వచ్చే ఏడాది కాలంలో సూచీ కేవలం 6 శాతం వృద్ధి కనబరిచే అవకాశం ఉంది.

వచ్చే డిసెంబరు నాటికి నిఫ్టీ అంచనా

బుల్ ట్రెండ్	28,800
బేరిష్ ట్రెండ్	23,300
బేస్ కేస్	26,100

ఐటీ, ఫార్మా పనితీరు మెరుగ్గా ఉండే చాన్స్

సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి జారుకుంది. అక్టోబరులో రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 6 శాతానికి ఎగువన నమోదైంది. నవంబరులో 5.48 శాతానికి దిగివచ్చినప్పటికీ.. ఇంకా ఆందోళనకర స్థాయిలోనే ఉంది. నెమ్మదించిన వృద్ధి, దిగిరానంటోన్న ధరలతో పాటు అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య విధానాలు, సుంకాల వడ్డనలు, బలోపేతమవుతున్న డాలర్ వంటి అంశాలు మార్కెట్లకు సవాళ్లుగా పరిణమించవచ్చని కోటక్ సెక్యూరిటీస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఈక్విటీ రిటర్నులపై పెద్దగా ఆశలు పెట్టుకోవద్దని సూచిస్తోంది.

కొత్త సంవత్సరంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), ఐటీ, రియల్టీ, ఫార్మా అండ్ హెల్త్‌కేర్ రంగాలు మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం ఉందని నివేదికలో పేర్కొంది. ఇప్పటికే చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్న నేపథ్యంలో ఆకర్షణీయ ధరల్లో లభిస్తోన్న నాణ్యమైన స్టాక్స్‌ను ఎంచుకోవడం మేలని కోటక్ సూచిస్తోంది.

రూపాయి మరింత పతనం

వచ్చే ఏడాదిలో రూపాయి విలువ మరింత క్షీణించవచ్చని కోటక్ సెక్యూరిటీస్ భావిస్తోంది. వచ్చే ఏడాది చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.86/87 స్థాయికి చేరవచ్చని అంచనా వేసింది. డాలర్ ఆధిపత్యమే లక్ష్యంగా ట్రంప్ చేపట్టనున్న ఆర్థిక, వాణిజ్య విధానాలు, సుంకాలు వడ్డనలు ప్రపంచ మార్కెట్లను, కరెన్సీలను తీవ్రంగా ప్రభావితం చేయవచ్చని బ్రోకరేజీ సంస్థ అభిప్రాయపడింది.

గోల్డెన్ ఇయర్

ఈ ఏడాదిలో 30 శాతానికి పైగా పెరిగిన పసిడి

» దశాబ్దకాలంలో ఇదే అత్యుత్తమ వృద్ధి

» సెంట్రల్ బ్యాంకులు, ఇన్వెస్టర్ల డిమాండే కారణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది (2024) బంగారం మదుపరులకు అద్భుతమైన రిటర్నులు అందించింది. ఈ ఏడాది ఇప్పటివరకు పసిడి ధర గ్రాముకు ఏకంగా రూ.7,300 మేర (30 శాతానికి పైగా) పెరిగింది. బులియన్ ఇన్వెస్టర్లకు దశాబ్ద కాలంలో ఇదే అత్యుత్తమ వార్షిక ప్రతిఫలమని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లతో పాటు పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు భారీగా బంగారం కొనుగోళ్లకు పాల్పడటం ఇందుకు కారణమైంది. అయితే, ధర అమాంతం పెరగడంతో సామాన్య ప్రజానీకం స్వర్ణాభరణాల కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి.

ఈ ఏడాదిలో సెప్టెంబరుతో ముగిసిన మూడు త్రైమాసికాల్లో ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకులు మొత్తం 694 టన్నుల బంగారం కొనుగోలు చేశాయి. అందులో భారత్ వంటి వర్ధమాన దేశాల సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లే అధికమని రిపోర్టు పేర్కొంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అక్టోబరులోనే 27 టన్నులు కొనుగోలు చేసింది. ఈ ఏడాది అక్టోబరు వరకు ఆర్‌బీఐ బంగారం నిల్వలను 77 టన్నుల మేర పెంచుకుంది. 2023తో పోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ కొనుగోలు చేసింది. కాగా, టర్కీ 72 టన్నులు, పోలాండ్ 69 టన్నుల కొనుగోళ్లు జరిపింది. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య ఉద్రిక్తతలు, యూఎస్ ఫెడ్ రేట్ల తగ్గుదల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారంలో పెట్టుబడులకు డిమాండ్ ఊపందుకుంది. దాంతో ఈ ఏడాది ద్వితీయార్ధంలో పసిడి వేగంగా పరుగు తీసింది.

2025లో రిటర్నులు అంతంతే..

అయితే 2025లో మాత్రం పసిడి పరుగు నెమ్మదించవచ్చని బులియన్ మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక సేవల మార్కెట్‌పై ఆయన వాణిజ్య విధానాల ప్రభావంతో పాటు బులియన్ ర్యాలీకి పలు సవాళ్లు ఎదురుకావచ్చన్నారు. ప్రపంచంలో అతిపెద్ద బంగారం వినియోగదారైన చైనా ఆర్థిక పరిస్థితులూ బులియన్ డిమాండ్‌ను ప్రభావితం చేయనున్నాయి. ధరలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో చైనాలోనూ వినియోగదారులు బంగారం కొనుగోళ్ల విషయంలో వేచి చూసే ధోరణిని కనబరుస్తున్నారని డబ్ల్యూజీసీ పేర్కొంది. సెంట్రల్ బ్యాంకులు, ఇన్వెస్టర్ల కొనుగోళ్లు అంచనాలను మించితే తప్ప వచ్చే ఏడాదీ పసిడి జోరు కొనసాగకపోవచ్చని భావిస్తున్నారు.

2025 డిసెంబరు నాటికి ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,000-3,150 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. అంటే, ప్రస్తుత 2,650 డాలర్ల స్థాయితో పోలిస్తే వచ్చే ఏడాది పసిడి 17 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి. కాగా, వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఔన్స్ గోల్డ్ 2,900-3,000 డాలర్లకు చేరవచ్చని స్విస్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ అంచనా వేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,890 ▼	71,400 ▼	1,00,000 ▼
విజయవాడ	78,000 ▼	72,000 ▼	93,000 ▲
విశాఖపట్నం	77,220 ▼	70,790 ▼	90,920 ▲
రాజమండ్రి	77,780 ▼	71,300 ▼	92,000 ▼
ప్రొద్దుటూరు	78,000 ▼	72,230 ▼	92,000 ▼
ముంబై	76,922 ▼	70,461 ▼	89,976 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ

హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620

డజను గుడ్లు రూ. 84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	101	విజయవాడ	104
వరంగల్	101	గుంటూరు	107
కరీంనగర్	101	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	90
కర్నూలు	101	నెల్లూరు	90
విశాఖపట్నం	108	అనంతపురం	90
గోదావరి	104		

కొత్త సంవత్సర వేడుకలు.. జీఎస్‌టీ..?

ఇదీ GST



రాంబాబు గొండాల

కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ ఉత్సాహంగా జరుపుకునే వేడుక ఏదైనా ఉందంటే అది నూతన సంవత్సర వేడుక మాత్రమే. ముఖ్యంగా పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విశ్వవ్యాప్తంగా డిసెంబరు 31 రాత్రి సంబరాలు జరుపుకోవటం పరిపాటి. ఈ వేడుకలు భారీ ఎత్తున నిర్వహించటానికి వివిధ హోటళ్లు, క్లబ్బులు, రిసార్టులు ఈ మధ్య కాలంలో విపరీతంగా పోటీ పడుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ కళాకారులతో వివిధ రకాల వినోద కార్యక్రమాలతో ఈ వేడుకలను అట్టహాసంగా జరుపుతుంటారు. దీనికి సంబంధించి ప్రత్యేక ప్యాకేజీలను కూడా ఆయా సంస్థలు అందిస్తుంటాయి. ఉదాహరణకు ఒక రిసార్ట్ డిసెంబరు 31ని పురస్కరించుకుని ఒక ప్రత్యేక ఈవెంట్‌ను నిర్వహిస్తుందనుకుందాం. దీనికి సంబంధించి ప్రవేశ రుసుము ఒక్కరికి రూ.5,000. టికెట్ తీసుకున్న వ్యక్తి ఆ ఈవెంట్‌కు సంబంధించిన వినోద కార్యక్రమాలు వీక్షించటంతో పాటు ఆహార, పానీయాలు అంటే ఆల్కహాల్ కూడా పొందవచ్చు. అలాగే స్పెషల్ ఈవెంట్‌తో పాటు ఒక రోజు రిసార్ట్‌లో ఉండేటట్లు రూమ్‌తో కూడిన మరొక ప్యాకేజీ ఉంది. దీంతోపాటుగా తమ థీమ్ పార్క్ లేదా అమ్యూజ్‌మెంట్ పార్క్ సందర్శనతో కూడిన ఇంకొక ప్యాకేజీ రూపొందించింది. మరి ఈ ప్యాకేజీలకు జీఎస్‌టీ ఎలా చెల్లించాలి?

ఇది అర్థం చేసుకోవటానికి ముందుగా హోటల్స్‌లో లేదా రిసార్ట్స్‌లో పన్ను రేటు ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. రూములకు జీఎస్‌టీ అనేది 12 శాతం లేదా 18 శాతంగా వాటి విలువను బట్టి ఉంటుంది. ఒకరోజు అద్దె రూ.7,500 లేదా అంతకంటే తక్కువ ఉన్న వాటికి 12 శాతంగా, రూ.7,500కి పైన ఉన్న వాటికి 18 శాతంగా నిర్ణయించటం జరిగింది. అలాగే అక్కడి రెస్టారెంట్ సేవలకు హోటల్ టైపును బట్టి జీఎస్‌టీ 5 శాతం, 18 శాతంగా నిర్ణయించటం జరిగింది. అలాగే ఈవెంట్స్‌కు వసూలు చేసే ప్రవేశ రుసుము మీద 18 శాతం జీఎస్‌టీ చెల్లించాలి. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, మామూలుగా అయితే రెస్టారెంట్ సర్వీస్‌లలో ఆల్కహాల్ మీద జీఎస్‌టీ వర్తించదు. బిల్లులో ఆల్కహాల్ మేర తగ్గించి మిగతా మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాలి. మరి ఇప్పుడు ఈ డిసెంబరు 31 ప్రత్యేక ప్యాకేజీలో అన్ని కలిపి ఉంటాయి. మరి జీఎస్‌టీ ఎలా లెక్కించాలి. అలాగే విలువలో లిక్కర్ మేరకు తగ్గించాలా లేదా అనేది సమస్య.

జీఎస్‌టీ చట్టంలో మిక్స్‌డ్, కాంపోజిట్ సరఫరా అనే రెండు రకాల సరఫరాలు ఉంటాయి. కాంపోజిట్ సరఫరాలో ఒక ప్రధాన సరఫరా ఉంటుంది. దీనికి అనుబంధంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సరఫరాలు ఉంటాయి. ఇవన్నీ సహజంగా కలిసి ఉంటాయి. ఉదాహరణకు ఏదేనీ బహుమతి కొన్నప్పుడు దానికి ఒక గిఫ్ట్ పేపర్ చుట్టటం, హోటల్‌లో రూమ్‌తో అల్పాహారం ఇవ్వటం, రైలు ప్రయాణంతో భోజనం కలిపి ఇవ్వటం. వీటిలో గిఫ్ట్, హోటల్ రూమ్, రైలు ప్రయాణం అనేవి ప్రధాన సరఫరా. ప్రధాన సరఫరాకు వర్తించే జీఎస్‌టీ రేటు కాంపోజిట్ సరఫరాకు వర్తిస్తుంది. ఇక మిక్స్‌డ్ సరఫరాలో కూడా రెండు లేదా అంతకంటే ఎక్కువ సరఫరాలు ఉన్నా ఇందులో ఒక ప్రధాన సరఫరా అంటూ ఉండదు. అన్నీ విడివిడిగా అమ్మగలిగే విధంగా ఉన్నప్పటికీ సౌలభ్యం కోసం ఒకటే రుసుము వసూలు చేస్తారు. ఉదాహరణకు సూపర్ మార్కెట్లో వాషింగ్ పౌడర్, బకెట్ కలిపి లేదా టూత్‌పేస్టు, బ్రష్ కలిపి ఒక ప్యాకేజీగా ఇవ్వటం. నిజానికి ఇవన్నీ విడివిడిగా కూడా అమ్మవచ్చు. మిక్స్‌డ్ సరఫరాలో ఏ సరఫరాకు ఎక్కువ పన్ను రేటు ఉంటే అది మొత్తం బిల్లు మీద వర్తిస్తుంది. ఇక్కడ బకెట్, వాషింగ్ పౌడర్‌లో లేదా పేస్టు, బ్రష్‌లలో దేనికి ఎక్కువ పన్ను రేటు ఉంటే అది మొత్తం బిల్లు మీద వర్తిస్తుంది.

ఈ విధంగా చూస్తే డిసెంబరు 31 ఈవెంట్ టికెట్‌లో ఈవెంట్ ప్రవేశం, ఆహార, పానీయాలు కలిపి ఉన్నా ప్రధాన సరఫరా ఈవెంట్ ప్రవేశం. అంటే ఇది కాంపోజిట్ సరఫరా. కాబట్టి ప్రధాన సరఫరా అయిన ఈవెంట్ టికెట్ మీద వర్తించే జీఎస్‌టీ అంటే 18 శాతం మొత్తం టికెట్ విలువ మీద చెల్లించాలి. అలాగే వసతి, రెస్టారెంట్, అమ్యూజ్‌మెంట్ పార్క్ సందర్శన, ఈవెంట్ ప్రవేశం ఇలా అన్నీ కలిపి ఉన్నప్పుడు ప్రధాన సరఫరా ఏది ఉందో చూడాలి. ప్రధాన సరఫరా లేకుండా అవన్నీ విడివిడి సరఫరాలుగా భావించినప్పుడు వీటన్నిటిలో ఎక్కువ పన్ను రేటు దేనికి ఉందో అది మొత్తం బిల్లు మీద చెల్లించాలి. అలా చూసినా 18 శాతం అనేది వీటన్నిటిలో అత్యధిక పన్ను రేటు కాబట్టి మొత్తం రుసుము మీద 18 శాతం చెల్లించాలి.

కాబట్టి ఇలా రెండు లేదా అంతకంటే ఎక్కువ సరఫరాలు ఉన్నప్పుడు అది కాంపోజిట్ సరఫరా కిందికి వస్తుందో లేదా మిక్స్‌డ్ సరఫరా కిందికి వస్తుందో చూసుకుని అందుకుతగ్గట్టుగా జీఎస్‌టీ చెల్లించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



గంటన్నర ఆటే..

నేటి ఉదయం 5.20 నుంచే మ్యాచ్

తొలి రోజు వరుణుడి ఆటంకం

ఆసీస్ మొదటి ఇన్నింగ్స్ 28/0

భారత్‌తో మూడో టెస్టు

బ్రిస్బేన్: గాబాలో తొలి రోజే వరుణుడు గట్టి షాక్ ఇచ్చాడు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా శనివారం భారత్-ఆస్ట్రేలియాల మధ్య ఆరంభమైన మూడో టెస్టు కేవలం గంటన్నర మాత్రమే సాగింది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. ఆసీస్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లోనే చిరుజల్లులు కురిశాయి. దీంతో అర్ధగంట మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలో అటు ఆసీస్ ఓపెనర్లు ఖవాజా (19 బ్యాటింగ్), మెక్‌స్వీనే (4 బ్యాటింగ్) చక్కటి డిఫెన్స్‌తో భారత పేసర్లను ఎదుర్కొంటూ నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. కానీ సవ్యంగా సాగుతుందనుకున్న వేళ వరుణుడు మరోసారి దెబ్బతీశాడు. ఆట 13.2 ఓవర్ల వద్ద కురిసిన భారీ వర్షం ఈసారి ఏమాత్రం తెరిపినివ్వలేదు. ఈలోపునే ఇరు జట్లు లంచ్ బ్రేక్ కూడా తీసుకున్నాయి. ఆ తర్వాత కూడా వాతావరణంలో మార్పు కనిపించలేదు. ఆటగాళ్లంతా డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం కాగా, ఈ సెషన్ కూడా వర్షార్పణమైంది. చివరకు ఆసీస్ కాలమానం ప్రకారం సాయంత్రం 4.15 గంటలకు ఆటను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఆ సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. మరోవైపు ఈ టెస్టుకు భారత జట్టులో రెండు మార్పులు చేశారు. అశ్విన్ స్థానంలో జడేజా, పేసర్ హర్షిత్ స్థానంలో ఆకాశ్ దీప్‌ను బరిలోకి దించారు. అలాగే ఓపెనర్‌గా రాహుల్‌నే కొనసాగించగా, కెప్టెన్ రోహిత్ విడిలార్డర్‌లో ఆడనున్నాడు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా

తొలి ఇన్నింగ్స్: ఖవాజా (బ్యాటింగ్) 19; మెక్‌స్వీనే (బ్యాటింగ్) 4; **ఎక్స్‌ట్రాలు:** 5; **మొత్తం:** 13.2 ఓవర్లలో 28/0; **బౌలింగ్:** బుమ్రా 6-3-8-0; సిరాజ్ 4-2-13-0; ఆకాశ్ దీప్ 3.2-2-2-0.


నేడు 98 ఓవర్ల ఆట

తొలి రోజు ఆట పూర్తిగా సాగకపోవడంతో ఆదివారం మ్యాచ్‌ను 98 ఓవర్లపాటు పొడిగించాలని నిర్ణయించారు. ఇందుకోసం అర్ధగంట ముందుగా ఉదయం 5.20కే మ్యాచ్ ఆరంభం కానుంది. కానీ రెండో రోజు కూడా వర్షం కురిసే అవకాశం 46 శాతం ఉంది. అలాగే రాబోయే నాలుగు రోజులు కూడా బ్రిస్బేన్‌లో ఆకాశం మేఘావృతంగానే ఉండి వరుణుడితో అంతరాయం కలగవచ్చు.

టిక్కెట్ల సొమ్ము వెనక్కి..

మూడో టెస్టు తొలి రోజు ఆట కోసం గాబాకు తరలివచ్చిన 30 వేల మంది ప్రేక్షకులు వర్షంతో నిరాశకు గురయ్యారు. దాంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మాత్రం వారికి ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. మ్యాచ్ గంటన్నరపాటు సాగినప్పటికీ వారికి తమ టిక్కెట్ల పూర్తి సొమ్మును రిఫండ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఎందుకంటే.. సీఏ పాలసీ ప్రకారం ఒక రోజు ఆటలో 15 ఓవర్ల లోపే మ్యాచ్ ఆగితే పూర్తి టిక్కెట్ సొమ్మును రిఫండ్ చేయాల్సి ఉంటుంది. దీంతో మరో 10 బంతుల దూరంలోనే ఆట ఆగిపోవడంతో ప్రేక్షకులు లాభపడ్డారు.

సిరాజ్‌ను వదలడం లేదు..



అడిలైడ్‌లో ట్రావిస్ హెడ్‌కు సెండాఫ్ ఇచ్చిన తీరుతో పేసర్ సిరాజ్ ఆసీస్ ప్రేక్షకుల ఆగ్రహానికి గురవుతున్నాడు. వేదిక బ్రిస్బేన్‌కు మారినా అతడిని గేలి చేయడం మానడం లేదు. తొలి రోజు ఆటలో సిరాజ్ 4 ఓవర్లు వేయగా తను బంతి తీసుకున్న ప్రతిసారీ ప్రేక్షకులు పెద్దపెట్టున అరుస్తూ ఎగతాళి చేయడం కనిపించింది. అయితే ప్రేక్షకుల తీరును మాజీ కెప్టెన్ గవాస్కర్ తప్పుబట్టాడు. యాషెస్ సిరీస్‌లో మీ ఆటగాళ్ల ప్రత్యర్థి బ్యాటర్లకు ఇలాగే సెండాఫ్ ఇస్తే సంతోషపడరా? అని ప్రశ్నించాడు. పేసర్లకు ఇలాంటి భావోద్వేగాలు సహజమేనని చెప్పాడు.

న్యూజిలాండ్ 315/9

● ఇంగ్లండ్‌తో మూడో టెస్ట్



సౌథీ

హామిల్టన్: బ్యాటర్లు రాణించడంతో ఇంగ్లండ్‌తో శనివారం ఆరంభమైన మూడో టెస్ట్‌లో న్యూజిలాండ్ మెరుగైన స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 315 పరుగులు చేసింది. లాథమ్ (63), విలియమ్సన్ (44), యంగ్ (42) రాణించారు.

గేల్ సరసన సౌథీ

కెరీర్‌లో చివరి టెస్ట్ ఆడుతున్న కివీస్ పేసర్ సౌథీ టెస్ట్ క్రికెట్‌లో ఎక్కువ సిక్స్‌లు కొట్టిన వారి జాబితాలో క్రిస్ గేల్ రికార్డును సమం చేశాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 10 బంతులే ఆడి 23 పరుగులు చేసిన సౌథీ అందులో 3 సిక్స్‌లు కొట్టడం విశేషం. ఓవరాల్‌గా 98 సిక్స్‌లు బాదిన సౌథీ.. అత్యధిక సిక్స్‌లు బాదిన వారి జాబితాలో గేల్‌తో సంయుక్తంగా నాలుగో స్థానంలో నిలిచాడు. స్టోక్స్ (133 సిక్స్‌లు), బ్రెండన్ మెకల్లమ్ (107), గిల్‌క్రిస్ట్ (100) టాప్-3లో ఉన్నారు.

ఫైనల్లో భారత్ X చైనా

జూనియర్ ఆసియా కప్ హాకీ

మస్కట్: డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళల జట్టు జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం రాత్రి 8.30 గంటలకు జరిగే ఫైనల్లో భారత జట్టు చైనాతో తలపడనుంది. శనివారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో భారత్ 4-1తో జపాన్‌పై గెలిచింది. టీమిండియా తరపున ముంతాజ్ ఖాన్ (4వ నిమిషంలో), సాక్షి రాణా (5వ), దీపిక (13వ) తలో గోల్ కొట్టారు. మరో సెమీస్‌లో చైనా 4-1 గోల్స్‌తో కొరియాను ఓడించింది.

గుకేష్‌కు మస్క్ అభినందన



న్యూఢిల్లీ: ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్‌ను స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ అభినందించాడు. '18వ ఏట 18వ వరల్డ్ చాంపియన్. అతి చిన్న వయస్సులో అద్భుత విజయం అందుకున్నావు. అభినందనలు' అని ఎక్స్‌లో.. ఆ సంస్థ యజమాని మస్క్ పోస్ట్ చేశాడు.

హర్మన్ సారథ్యానికి మరో సవాల్

వెస్టిండీస్‌తో నేడు తొలి టీ20

రా. 7నుంచి స్పోర్ట్స్ 18లో



నవీ ముంబై: తన నాయకత్వ పటిమపై ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతుండడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మరో కఠిన పరీక్షకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఆడిన మూడు వన్డేల సిరీస్‌ను 0-3తో కోల్పోయి డీలాపడిన మన అమ్మాయిలు వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధమయ్యారు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్ ఆదివారం జరగనుంది. అయితే 2019 నవంబరు నుంచి ఇప్పటివరకు వెస్టిండీస్‌తో తలపడిన ఎనిమిది టీ20ల్లోనూ భారత జట్టే గెలుపొందడం సానుకూలాంశం. ప్రత్యర్థిపై ఈ విజయ పరంపరను కొనసాగించాలంటే మాత్రం హర్మన్‌సేన తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌కు జట్టును ఎంపిక చేసిన తీరు హర్మన్ సారథ్యంపైనా సందేహాలను లేవనెత్తింది. ఈనేపథ్యంలో స్మృతీ మంధానాకు కెప్టెన్సీ ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది. హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్ జట్టులోని మిగిలిన క్రికెటర్ల కంటే మెరుగ్గానే ఉన్నా..తెల్లబంతుల ఫార్మాట్‌లో ఆమె ఇంకా పాత పద్ధతుల్లోనే జట్టును నడిపించడాన్ని ఆక్షేపిస్తున్నారు. ఇక..స్వదేశంలో టీ20లలో షఫాలీకి మెరుగైన బ్యాటింగ్ రికార్డు ఉన్నా విండీస్‌తో సిరీస్‌కు ఆమెను పక్కనబెట్టారు. ఇది బ్యాటింగ్ విభాగంపై ప్రభావం చూపే అవకాశముంది. షఫాలీతోపాటు పూజా వస్త్రాకర్, శ్రేయాంక పాటిల్, యాస్తికా భాటియా, ప్రియా పూనియా వంటి స్టార్లు లేకుండా బరిలో దిగుతున్న భారత్ ఏమాత్రం రాణిస్తుందో చూడాలి. అలాగే ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో..ఈ ఫార్మాట్‌లో రెండో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన (10-2-26-4) భారత బౌలర్‌గా రికార్డు నెలకొల్పిన హైదరాబాద్ పేసర్ అరుంధతి రెడ్డిని వెస్టిండీస్‌తో టీ20లకు పక్కనబెట్టడం గమనార్హం.

ప్లేఆఫ్స్‌కు చేరువలో టైటాన్స్

పుణె: స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ అదరగొట్టడంతో.. తెలుగు టైటాన్స్ ప్లేఆఫ్స్‌కు చేరువైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 36-32తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. పవన్ 12 పాయింట్లు స్కోరు చేయగా.. విజయ్ మాలిక్ చక్కని సహకారం అందించారు. గుజరాత్ తరపున రాకేష్ సూపర్-10 సాధించాడు. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 44-37తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. అషు మాలిక్ 15 పాయింట్లతో మెరిశాడు. రెండో స్థానానికి ఎగబాకిన ఢిల్లీ నాకౌట్ బెర్త్‌ను దాదాపుగా ఖరారు చేసుకొంది.

సిరీస్ అఫ్ఘానిస్థాన్ వశం

హరారే: జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌ను అఫ్ఘానిస్థాన్ 2-1తో సొంతం చేసుకుంది. శనివారం ఉత్కంఠ భరితంగా జరిగిన ఆఖరి మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ మూడు వికెట్లతో నెగ్గింది. తొలుత జింబాబ్వే 19.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. ఛేదనలో అఫ్ఘాన్ 19.3 ఓవర్లలో 128/7తో నెగ్గింది.

57 ఏళ్ల తర్వాత..

హైదరాబాద్‌లో మొదలైన సంతోష్ ట్రోఫీ పోటీలు

హైదరాబాద్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ఏకంగా 57 ఏళ్ల తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌లో సంతోష్ ట్రోఫీ.. అవును సుదీర్ఘ విరామానంతరం ఈ ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ టోర్నీకి నగరం వేదికగా నిలిచింది. అజీజ్ నగర్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్‌లో శనివారం ఈ పోటీలు మొదలయ్యాయి. ప్రారంభ మ్యాచ్‌లో మణిపూర్ 1-0తో సర్వీసెస్‌పై గెలిచింది. ఇక, ఆతిథ్య తెలంగాణ తన పోరును డ్రాతో ప్రారంభించింది. రాజస్థాన్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకుంది. కాగా, ఈనెల 29న సెమీఫైనల్స్, 31న ఫైనల్ మ్యాచ్‌లకు గచ్చిబౌలి స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ శివసేనా రెడ్డి టోర్నీని ప్రారంభించారు.

నేడు డబ్ల్యూపీఎల్ మినీ వేలం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్-2025 మినీ వేలానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం ఇక్కడ జరిగే వేలంలో 120 మంది క్రికెటర్లు బరిలో నిలిచారు. ఇందులో 91 మంది భారత క్రీడాకారిణులుకాగా, 29 మంది విదేశీయులున్నారు. భారత్ నుంచి 82 మంది, విదేశాల నుంచి 8 మంది అన్‌క్యాప్డ్ క్రీడాకారిణులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వాస్తవంగా 400 మంది క్రికెటర్లు వేలానికి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఆ జాబితాను 120 మందికి బీసీసీఐ కుదించింది. అయితే ఐదు జట్లలో కలిపి మొత్తం 19 స్థానాల భర్తీకే అవకాశముంది.

ఘనంగా సింధు నిశ్చితార్థం



హైదరాబాద్: బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు నిశ్చితార్థం శనివారం జరిగింది. కాబోయే వధూవరులు సింధు, వెంకట దత్త సాయి ఈ వేడుకలో ఉంగరాలను మార్చుకున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోను సింధు సోషల్ మీడియాలో పంచుకుంది. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దత్తసాయిని సింధు ఈనెల 22న వివాహమాడనుంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఈ జంట ఒక్కటి కానుంది. ఈనెల 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ జరగనుంది. 20న పెళ్లి వేడుకలు మొదలు కానున్నట్టు సింధు కుటుంబసభ్యులు వెల్లడించారు.



రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణతో కలిసి ఐక్యత చాటుతున్న ఉద్యోగులు

గత ఐదేళ్లలో శాఖలన్నీ ధ్వంసం

- అందుకే బకాయిల్ని వెంటనే తీర్చాలని కోరలేం
- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు రూ.25 వేల కోట్లు పేరుకుపోయాయని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అన్నారు. "రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి గురించి తెలిసినవారిగా.. మా బకాయిలను వెంటనే చెల్లించాలని అడిగే పరిస్థితి లేదు. నీ, బాకీలు ఎక్కడికీపోవు..ఉద్యోగులకు అందుతాయనే భరోసాను ప్రభుత్వం నుంచి కోరుకుంటున్నా"మని అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారానికి తామంతా పనిచేస్తామని ప్రమాణం చేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభకు హాజరైన ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రశ్నిస్తే కేసులు పెడతామనే రీతిలో వ్యవహరించి ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిపై ఇచ్చిన శ్వేతపత్రంలో చంద్రబాబు.. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై వివరాలు ఇచ్చారని చెప్పారు. ఇందులో రూ.21,920 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయనీ.. ఎరియర్స్ కలుపుకొంటే రూ.25 వేల కోట్లు పైబడి బకాయి ఉందన్నారు. వాణిజ్య పన్నుల శాఖ మైనస్ పది శాతానికి పడిపోయిందన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి విస్సన్న తదితరులు పాల్గొన్నారు.

29 ఏళ్ల తర్వాత డీకేటీ పట్టా రద్దు కుదరదు

- వైమానికదళ మాజీ ఉద్యోగి భూమి కేసులో హైకోర్టు తీర్పు

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద వైమానికదళానికి చెందిన మాజీ ఉద్యోగికి కేటాయించిన డీకేటీ పట్టాను 29 ఏళ్ల తర్వాత అధికారులు రద్దు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో పిటిషనర్‌కు 1976లో భూమిని కేటాయించారని గుర్తు చేసింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 29 ఏళ్ల తర్వాత పట్టాను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని సమర్థించలేమని తెలిపింది. పట్టా ఇచ్చిన మూడేళ్లలో భూమిని సాగు చేసినట్లు నిరూపించాలని 29 ఏళ్ల తర్వాత పిటిషనర్‌ను రెవెన్యూ అధికారులు కోరడంలో అర్థం లేదని తెలిపింది. ఒకవైపు పిటిషనర్ కుటుంబ సభ్యులు భూమిని సాగుచేస్తున్నారని అధికారులే చెబుతున్నారని, ఈ నేపథ్యంలో భూమిని సాగు చేయకుండా డీకేటీ పట్టా షరతులు పిటిషనర్ ఉల్లంఘించారని చెప్పడంలో అర్థం లేదని పేర్కొంది. డీకేటీ పట్టాను రద్దు చేస్తూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేస్తూ అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. కడపజిల్లా, ప్రొద్దుటూరు మండలం, రామేశ్వరం గ్రామానికి చెందిన జింకా చెంద్రాయుడు వైమానికదళంలో పనిచేసి రిటైర్ అయ్యారు. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద భూమి కేటాయించాలన్న చెంద్రాయుడు, అతని సోదరుడి అభ్యర్థన మేరకు 1976లో అధికారులు గ్రామంలోని సర్వేనెంబరు 236/ఏ2లో 5.02 ఎకరాలు(డీకేటీ పట్టా) కేటాయించారు. అయితే, 1988లో చెంద్రాయుడి సోదరుడు కాలం చేసిన తర్వాత సంబంధిత భూమి విషయంలో సోదరుడి కుమారులు, చెంద్రాయుడుకి మధ్య వివాదం రేగింది. తామే భూమిని సాగుచేస్తున్నామని, మార్కెట్ విలువ కట్టించుకొని సాగు పట్టా జారీ చేయాలని చెంద్రాయుడు సోదరుడి కుమారులు రెవెన్యూ అధికారులను అభ్యర్థించారు. ఈ క్రమంలో తహసీల్దార్.. చెంద్రాయుడు ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోకుండా పట్టాను రద్దు చేశారు, ఆ రద్దు ఉత్తర్వులను సవాల్ చేస్తూ చెంద్రాయుడు 2008లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. అధికారుల ఉత్తర్వులను రద్దు చేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ చెంద్రాయుడు సోదరుడి కుమారులు జింకా బ్రహ్మయ్య, మరొకరు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. దీనిని తాజాగా ధర్మాసనం కొట్టి వేసింది.

'పువర్తి'కి స్వాతంత్ర్యపు 'వెలుగులు'!

- మావోయిస్టు నేత హిడ్మా స్వగ్రామంలో సౌర విద్యుత్.. తొలిసారి టీవీ ప్రసారాలు

చింతూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పువర్తి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని కీలకమైన మావోయిస్టు ప్రభావిత గ్రామం. అంతేకాదు హార్డ్ కోర్ మావోయిస్టు, కేంద్ర కమిటీ సభ్యుడు మడవి హిడ్మా స్వగ్రామం కూడా ఇదే! ఇప్పటివరకు ఆ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేదు. నేటికీ వారంతా కిరోసిన్ దీపపు కాంతుల నడుమే జీవిస్తున్నారు. ఇక టీవీ కూడా తెలియదు. పలు ఎన్‌కౌంటర్లు, మెరుపు దాడులు అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో పువర్తిలో తొలిమారు పోలీసు క్యాంపు ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో తొలిసారి జాతీయ జెండాను జవాన్లు ఆవిష్కరించారు. 2026 నాటి కల్లా ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు మృతి చెందారు. మరోవైపు.. మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో నూటికి నూరుశాతం ప్రభుత్వ పథకాలు చేరవేయాలని ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్‌సాయి ఆదేశించారు. ఈ క్రమంలోనే.. విద్యుత్ సౌకర్యం లేని మావోయిస్టు ప్రభావిత గ్రామాలకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించే దిశగా చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. హిడ్మా ఇంటికి కూడా సౌర విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించారు. అంతేకాదు.. హిడ్మా ఇంట్లో ఎల్ఈడీ టీవీ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టీవీ ప్రసారాలను గ్రామస్థులు, చిన్నారులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



హిడ్మా ఇంట్లో టీవీ ప్రసారాలు చూస్తున్న ఆదివాసీ చిన్నారులు

కోరల్లేని ఏసీబీ!

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతులు.. ఇలా ఏ ఒక్క దాంట్లోనూ అవినీతి లేదనకుండా ఊడ్చేశారు. లక్షల కోట్ల ప్రజల సంపద దోచేసిన దొంగలను జైలుకు పంపాలన్నా.. అవినీతి వ్యవస్థను ఇకపై కట్టడి చేయాలన్నా ఏసీబీ బలంగా ఉండాలి. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. ఎక్కడికక్కడ జిల్లాల్లో అవినీతి ఉద్యోగులను ట్రాప్ చేయాలి. దోచుకున్న కోట్ల రూపాయల ఆస్తులు వెలికి తీయాలి. ఆకస్మిక తనిఖీలు చేపట్టి అవినీతికి పాల్పడరాదన్న భయాన్ని కలిగించాలి. ఇన్ని చేయాలంటే ఏసీబీలో సిబ్బంది, వారిని నడిపించే అధికారులు ఉండాలి. కానీ, మన రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖలో 60శాతం అధికారుల కొరత ఉందంటే నమ్మగలమా? ఆరుగురు ఐపీఎస్‌లు ఉండాల్సిన శాఖలో ఒక్కరంటే ఒక్కరు(డీజీ మినహా) కూడా లేరనేది పచ్చి నిజం. పెద్ద జిల్లాల్లో సిబ్బందికి దిశా నిర్దేశం చేసి అవినీతి కేసుల్లో ముందుకు నడిపించే అడిషనల్ ఎస్పీలు లేరు. ఆఖరికి జిల్లాలో ఏసీబీకి బాస్‌గా ఉండే డీఎస్పీల కొరత 67శాతం ఉంది. ఫలితంగా అవినీతి కేసులు నమోదు కావట్లేదు. పాత కేసుల్లో తవ్వి తీయడమూ సాధ్యం కావట్లేదు. బాధితులు ఫిర్యాదు చేద్దామంటే టోల్ ఫ్రీ నంబర్ కూడా లేదు. ఏసీబీని బలోపేతం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఆ దిశగా కనీస ప్రయత్నం లేదు.

పరుగు పెట్టాల్సిన సమయంలో..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు లంచాలు డిమాండ్ చేస్తే బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుని చట్ట పరమైన చర్యలకు ఏసీబీ ఉపక్రమిస్తుంది. ఏసీబీ సమర్థవంతంగా పని చేయాలంటే డీజీ నుంచి క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే కానిస్టేబుల్ వరకూ నిజాయితీగా వ్యవహరించి, వ్యూహాత్మకంగా ఉచ్చు బిగించాలి. అందుకు గాను ఏసీబీ డీజీ ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు పెట్టి దిశానిర్దేశం చేస్తుంటారు. ఆయన తర్వాత అడిషనల్ డైరెక్టర్లుగా ఇద్దరు డీఐజీ ర్యాంకు అధికారులు ఉంటారు. కేడర్ ఎస్పీ హోదాలో ముగ్గురు జాయింట్ డైరెక్టర్లు.. నాన్ కేడర్ ఎస్పీ హోదాలో మరో నలుగురు మొత్తం ఏడుగురు జేడీలు పని చేస్తారు. రాయలసీమ, కోస్తాంధ్ర, సెంట్రల్ జోన్, సీఐయూ,హెడ్ క్వార్టర్స్, సైబర్ అండ్ లీగల్, అడ్మిన్ వ్యవహారాలు పర్యవేక్షిస్తూ జిల్లాల్లోని అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలతో సమన్వయం చేసుకుంటారు. తిరుపతి, గుంటూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, హెడ్ క్వార్టర్స్‌తోపాటు ట్రైనింగ్ విభాగానికి ఒక అడిషనల్ ఎస్పీ ఉంటారు. ఇతర జిల్లాల్లో అవినీతి కట్టడికి డీఎస్పీల నేతృత్వంలోనే సీఐలు, ఎస్ఐలు, కిందిస్థాయి సిబ్బంది పని చేస్తారు. ఇందులో రాష్ట్రంలో పదమూడు ఉమ్మడి జిల్లాలతోపాటు సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్(సీఐయూ) కీలకమైన విభాగం. కీలక అవినీతి కేసులు సీఐయూ విభాగమే చూస్తూ, నేరుగా ఏసీబీ డీజీకి రిపోర్ట్ చేస్తుంది. పెద్ద పెద్ద అవినీతి పరుల్ని అరెస్టు చేయడం, వందల కోట్ల ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో సోదాలకు దిగడం సీఐయూ పనిలో కీలకం.

పాత కేసులే కదలట్లేదు.. ఇక కొత్తవెక్కడ?

ఏడెనిమిదేళ్ల క్రితం నమోదైన కేసుల్లోను కనీసం అభియోగాలు కోర్టులో నమోదు చేయలేని దుస్థితిలో ఏసీబీ విలవిల్లాడుతోంది. కొత్త కేసుల గురించి సమాచారం సేకరించేందుకు అధికారుల్లేరు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత నిస్సహాయ స్థితిలో ఏసీబీ ఉందని అందులో పనిచేస్తున్న కొందరు నిజాయితీపరులు బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. "రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో టోల్ ఫ్రీ నెంబర్ ఉన్నప్పుడు రోజుకు సరాసరి ఏసీబీకి 30 దాకా ఫిర్యాదులు వచ్చేవి. ఇప్పుడు టోల్ ఫ్రీ లేదు. ఫిర్యాదుల్లేవు. అవినీతి మాత్రం ఉంది. అధికారుల్లేకుండా ఏసీబీ ఏమి చేస్తుంది?' అని పెదవి విరుస్తున్నారు.

అధికారులు వెయిటింగ్.. ఏసీబీలో ఖాళీలు

పోలీసు శాఖలో పలువురు అధికారులు పోస్టింగ్ కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్నారు.. మరోవైపు కీలకమైన అవినీతి నిరోధక శాఖలో ఖాళీలు ఉన్నాయి. పీఎస్ఆర్ ఆంజనేయులు, ఎన్.సంజయ్, కాంతి రాణా తాతా, విశాల్ గున్నీ గత ప్రభుత్వంలో చేసిన అవినీతి, అక్రమాల కేసుల్లో సస్పెండయ్యారు. అయితే ఐజీ ర్యాంకులో పాలరాజు, కొల్లి రఘురామిరెడ్డి.. మరో నెల రోజుల్లో డీఐజీలు కాబోతున్న సత్య యేసుబాబు, బాబూజీ అట్టాడ.. ఎస్పీ ర్యాంకులో పరమేశ్వర రెడ్డి, రిశాంత్ రెడ్డి, పల్లె జాషువా, కేకేఎన్.అన్బురాజన్, కృష్ణకాంత్ పాటిల్, హర్షవర్ధన్ రాజు, రవిశంకర్ రెడ్డి నిరీక్షణలో ఉన్నారు. వీరిలో సత్య యేసుబాబు, బాబూజీ అట్టాడ, పరమేశ్వర రెడ్డి, హర్షవర్ధన్ రాజుపై అవినీతి ఆరోపణలు లేవు. పనిలోనూ సమర్థవంతమైన అధికారులుగానే పేరుంది. ఆర్నేల్లకు పైగా అధికారులను నిరీక్షణలో పెట్టిన ప్రభుత్వం ఇక ఏదో ఒక లూప్‌లైన్ పోస్టు ఇవ్వాలనే వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి. ఎలాగూ జీతం చెల్లించక తప్పదు గనుక ఏసీబీకి పనికొచ్చే వారిని తెచ్చుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఐపీఎస్‌లతోపాటు పదిహేనుమందికి పైగా అడిషనల్ ఎస్పీలు, 50 మంది డీఎస్పీలు వెయిటింగ్‌లో ఉన్నారు. వారిలో ఎంతో కొంత పనికొచ్చే వారిని ఎంపిక చేసుకుని సర్దుబాబు చేస్తే అధికారుల సమస్య తీరుతుందంటున్నారు.

ఏసీబీలో అధికారుల వివరాలు...

అధికారి	సంఖ్య	ఉన్నది	కొరత
డైరెక్టర్ జనరల్	1	1	0
అడిషనల్ డైరెక్టర్లు (డీఐజీ ర్యాంకు)	2	0	2
జాయింట్ డైరెక్టర్లు (ఎస్పీ కేడర్)	3	0	3
జాయింట్ డైరెక్టర్లు (నాన్ కేడర్ ఎస్పీ)	4	3	1
అడిషనల్ ఎస్పీలు	9	5	4
డీఎస్పీలు	27	9	18
మొత్తం	46	18	28(60%)



ఆపరేషన్ల అనంతరం చిన్నారులతో డాక్టర్ పి.వి.రామారావు, డాక్టర్ శ్రీమన్నారాయణ, విదేశీ వైద్యులు

ఆంధ్ర ఆసుపత్రిలో హీలింగ్ లిటిల్ హార్ట్స్

- 16 మంది చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

విజయవాడ(ప్రభుత్వాసుపత్రి), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఆసుపత్రిలో హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే చారిటీ సౌజన్యంతో ఈ నెల 9 నుంచి 14 వరకు 33వ పిల్లల ఉచిత గుండె సర్జరీలు నిర్వహించినట్టు చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రామారావు తెలిపారు. శనివారం ఆసుపత్రి ఆవరణలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ నెల్సన్ ఒలివర్ డేవిడ్, పిడియాట్రిక్ కార్డియాక్ సర్జన్, క్వీన్స్ ల్యాండ్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆస్ట్రేలియా డాక్టర్ క్రిస్టియన్ అలెగ్జాండర్ పిడియాట్రిక్ కార్డియాక్ ఇంటెన్సివిస్ట్, స్టువర్ట్ హ్యారి, హన్నా ఎలిజబెత్, మోర్గాన్ తదితరులు క్వీన్స్ ల్యాండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆస్ట్రేలియా నుంచి ఇక్కడకు వచ్చి హార్ట్ అండ్ బ్రెయిన్ ఆంధ్ర ఆసుపత్రి డాక్టర్ నాగేశ్వరరావు, కార్డియాక్ సర్జన్ డాక్టర్ సాయిరామ్, పిల్లల కార్డియాక్ సర్జన్‌తో కలిసి ఆంధ్ర ఆసుపత్రిలో 16 మంది పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్లు నిర్వహించినట్టు చెప్పారు. పదేళ్ల నుంచి ఇప్పటి వరకు 33సార్లు ఇలాంటి ఆపరేషన్లు చేశామని ఇక ముందు కూడా చేస్తామని, రెండు మూడు నెలలకోసారి ఆసుపత్రికి వచ్చి అదే వైద్యులు ఆపరేషన్లు చేస్తారన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా నెలకు 50 నుంచి 60 వరకు.. ఏడాదికి సుమారు 600 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 4వేల ఆపరేషన్లు పైన, ఇంటర్వెన్షన్స్ విజయవంతంగా చేశామన్నారు. చిన్నారుల గుండె ఆపరేషన్లు విజయవంతం కావడానికి ఆంధ్ర ఆసుపత్రి డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో పిడియాట్రిక్ కార్డియాలజీ టీం, పిడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ టీమ్స్ కృషి కారణమన్నారు. ఆంధ్ర మదర్ అండ్ చైల్డ్ ఫౌండేషన్, వసుధ ఫౌండేషన్, మహేష్‌బాబు ఫౌండేషన్, ఎన్టీఆర్ వైద్య సేవ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కార్డియాలజీ చీఫ్ డాక్టర్ శ్రీమన్నారాయణ, పిల్లల కార్డియాలజిస్టులు డాక్టర్ విక్రమ్, డాక్టర్ సాయిరామ్, కార్డియాక్ సర్జన్ డాక్టర్ నాగేశ్వరరావు, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ రమేష్, కార్డియాక్ ఎనస్థీయనిస్టు డాక్టర్ ఉమాశంకర్, పిల్లల కార్డియాక్ ఇంటెన్సివ్‌విస్ట్‌లు పాల్గొన్నారు.

స్వచ్ఛ సైనికులుగా విద్యార్థులు

- చెత్త నిర్వహణ అంశాలపై ప్రజలకు అవగాహన
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం విద్యార్థులను స్వచ్ఛ సైనికులుగా తయారు చేసే ఆలోచనలో ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. శనివారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ (ఏపీఎస్ఐఆర్‌పీఆర్) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థీ పర్యావరణం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా అవగాహన కల్పించేందుకు వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. బాపట్ల, శ్రీకాళహస్తి, సామర్లకోటల్లోని విస్తరణ శిక్షణ కేంద్రాలను, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాలను భాగస్వాములను చేసి.. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి పౌరుడికీ శిక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జనవరి 18, మూడో శనివారంలోగా చెత్త నిర్వహణపై మొదటి స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులకు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేసిన స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో పొందుపర్చిన పది సూత్రాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడానికి ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్ రోజుగా నిర్వహించాలని చెప్పారు. ఆ రోజు వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర చెత్త నిర్వహణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పట్టాభి దిశానిర్దేశం చేశారు.

నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి స్వీప్

చేతులెత్తేసిన వైసీపీ

- పులివెందులలో మొత్తం టీడీపీ కైవశం
- వైఎస్ స్వగ్రామం బలపనూరు కూడా..
- కృష్ణాలో ఎన్నికల అధికారిపై కత్తితో దాడి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నీటి సంఘం ఎన్నికల కేంద్రం వద్ద సందడి

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా ఏకపక్ష విజయాలు సాధించాయి. ప్రతిపక్ష వైసీపీ చేతులెత్తేయడంతో అత్యధిక శాతం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మాజీ సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలో కూడా మొత్తం సంఘాలు టీడీపీ కైవశమయ్యాయి. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక స్థాయి నీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు 3 స్థాయిల్లో జరుగుతాయి. చెరువులు, పంట కాల్వల కింద సాగునీటిని వాడుకొనే రైతులతో ప్రాథమిక స్థాయి నీటి సంఘాలను ఏర్పాటు చేశారు. వీటిపైన డిస్ట్రిబ్యూటరీ కాల్వల స్థాయిలో రెండో దశ ఎన్నికలు జరుగుతాయి. ప్రాజెక్టు స్థాయిలో మూడో దశ ఎన్నికలు ఉంటాయి. ప్రాథమిక స్థాయి ఎన్నికల్లో అన్ని జిల్లాల్లోనూ ఈ సంఘాలను కూటమి గెలుచుకొంది. స్థానిక పరిస్థితులను బట్టి కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ తమలో తాము సర్దుబాటు చేసుకొని వీటిని గెలుచుకొన్నాయి. కడప జిల్లాలో 203 నీటి సంఘాలు ఉండ గా కూటమి పార్టీలకు చెందిన వారు 202 సంఘాల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి స్వగ్రా మం గుండ్లకుంట-3లో మాత్రం వైసీపీ మద్దతుదారులు గెలిచారు. అక్కడ టీడీపీ పోటీ పెట్టలేదు. పులివెందుల నియోజకవర్గంలోని మొత్తం 32 సంఘాల ను టీడీపీ ఏకగ్రీవంగా గెలుచుకొంది. వైఎస్ కుటుం బ స్వగ్రామం బలపనూరు కూడా టీడీపీ ఖాతాలోకే వెళ్లింది. కడప వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి కొన్ని రోజులుగా పులివెందులలో మకాంవేసి ఈ ఎన్నికల్లో పోటీ కి ప్రయత్నం చేసినా ఆ పార్టీ నేతలు ఎక్కడా పోటీ కూడా చేయలేదు. వైఎస్ కుటుంబం రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పులివెందులలో ఈ పరిస్థితి నెలకొనడం ఇదే మొదటిసారి. అయితే, చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహించిన పుంగనూరులో 3 సంఘాలు వైసీపీ పరమయ్యాయి. సదుం మండలం చెరుకువారిపల్లెలో వైసీపీ గెలిచిం ది. తిమ్మానాయనిపల్లెలో టీడీపీ, వైసీపీ మధ్య టై అవగా, అధికారులు టాస్ వేస్తే వైసీపీ గెలిచింది. అలాగే తిమ్మానాయనిపల్లెలో మరో చెరువు కూడా వైసీపీకి ఏకగ్రీవమైంది. ప్రకాశం జిల్లాలో 342 సంఘాలు ఉండగా, 341 సంఘాలు కూటమి పార్టీలకు ఏకగ్రీవమయ్యాయి. ఒక చోట చైర్మన్ ఎన్నిక జరగలేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో 112 సంఘాలకుగాను 110 ఏకగ్రీవమయ్యాయి. రెండు చోట్ల రైతు లు ఎన్నికలను బహిష్కరించారు. తిరుపతి జిల్లాలో 610 సంఘాలు ఉండగా, 406 సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా అత్యధికం కూటమి పార్టీలు కైవశం చేసుకొన్నాయి. బీఎన్ కండ్రిక మండలం నీరుపకోట గ్రామంలో ఒక అభ్యర్థి మరో అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని చించేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొన్నారు. అన్నమయ్య జిల్లాలో టీడీపీలో గ్రూపుల విభేదాల వల్ల ఆరు సంఘాల ఎన్నికలు వాయిదాపడ్డాయి. గుంటూరు జిల్లాలో 106 సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. ఐదు చోట్ల ఉపాధ్యక్ష ఎన్నికలు జరగలేదు. రాష్ట్రంలో 6,049 మేజర్, మీ డియం సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలచేయగా, 5,946 సం ఘాలకు(దాదాపు 90 శాతం) నేతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పిఠాపురంలో అస్వస్థత

పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం మల్లవరం పీబీసీ నీటి సంఘం ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ పడిన అభ్యర్థులు ఇద్దరు ఒకేసారి అస్వస్థతకు గురి కావడంతో ఇక్కడ ఎన్నిక వాయిదా పడింది. కృష్ణాజిల్లా పెడన మండలం నందిగామలో ఎన్నికల అధికారిపై ఓ అభ్యర్థి కత్తితో దాడి చేశాడు. టీడీపీ మండలాధ్యక్షుడు చల్లపాటి ప్రసాదు బలపర్చిన పామర్తి వెంకటేశ్వరరావుకు రెండు ఓట్లు రావడంతో రెచ్చిపోయిన వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారి మధుశేఖర్‌పై కత్తితో దాడి చేశాడు.

ఇంధన వినిమయంలో ఏపీ భేష్

- ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫెర్ఫార్మెన్స్ విభాగంలో ఉత్తమ బహుమతి
- కేంద్రమంత్రి శ్రీపాదనాయక్ నుంచి అవార్డు అందుకున్న కుమార్‌రెడ్డి



కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న ఏపీఈఈఎస్ఎల్ సీఈవో కుమార్ రెడ్డి

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు, సామర్థ్యంలో ఏపీఈఈఎస్ఎల్(రాష్ట్ర ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్) జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు-2024ను దక్కించుకుంది. ఢిల్లీలో శనివారం కేంద్ర ఇంధనశాఖ మంత్రి శ్రీపాదనాయక్ చేతుల మీదుగా ఈ అవార్డును ఏపీఈఈఎస్ఎల్ సీఈవో, రాష్ట్ర ఇంధన శాఖ జాయింట్ సెక్రటరీ బీఏవీపీ కుమార్ రెడ్డి అందుకున్నారు. రాష్ట్రాల్లో విద్యుత్ వినియోగం ఆధారంగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) నాలుగు గ్రూప్‌లుగా విభజించింది. ఏపీని గ్రూప్-2 రాష్ట్రంగా బీఈఈ పేర్కొంది. ఇందులోని రాష్ట్రాలన్నీ 5 నుంచి 15 మిలియన్ టన్నుల ఆయిల్ ఈక్వలెంట్ కరెంటును వాడాయి. వీటిలో ఏపీ ఏకంగా 87.25 పాయింట్ల(గతేడాది కంటే 4.8 శాతం అధికం)తో ఇండెక్స్-2024లో ఉత్తమ ప్రతిభను కనబరిచింది. అవార్డును అందుకున్నాక ఏపీఈఈఎస్ఎల్ సీఈవో కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వం, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కావేటి విజయానంద్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఇంధన పొదుపు సామర్థ్య విధానాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

సెకీతో విద్యుత్తు ఒప్పందాలు రద్దు చేయాలి: సీపీఐ

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ద్వారా 7వేల మెగావాట్ల అంతర్‌రాష్ట్ర సౌర విద్యుత్తు కొనుగోలుకు గత జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకునే మార్గాన్ని అన్వేషించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శనివారం ఆయన లేఖ రాశారు. జగన్ ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల విద్యుత్తు సంస్థలు రూ.49,566 కోట్ల మేర నష్టాల్లో కూరుకుపోయాయని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో విద్యుత్తు వినియోగదారులపై రూ.32,166 కోట్ల భారం పడిందని వివరించారు. సెకీ ద్వారా 7వేల మెగా వాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం వల్ల రాష్ట్రంపై ఏటా రూ.3,850 కోట్ల నుంచి రూ. 4,350 కోట్ల వరకు అదనపు భారం పడుతుందని కనుక ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఏపీ విభజన

- లోక్‌సభలో టీడీపీపీ నేత శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అప్రజాస్వామికంగా జరిగిందని, విభజనను రాష్ట్ర అసెంబ్లీ తిరస్కరించినా పట్టించుకోలేదని టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఓటింగ్ డేటాపై పారదర్శకత లేకుండా పార్లమెంటులో బిల్లును ఆనాడు ఎలా ఆమోదించారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తి, విలువకు విరుద్ధమని, అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల ఉజ్వల ప్రస్థానంపై లోక్‌సభలో జరిగిన చర్చలో శ్రీకృష్ణ దేవరాయలు ప్రసంగించారు. రాజ్యాంగ నిర్మాణంలో 389 మంది పాలుపంచుకోగా, అందులో 13 మంది తెలుగు వారు ఉండటం ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు. ఇదే ఒరవడితో పాలనను పటిష్ఠం చేయడానికి కొన్ని సవరణలు అవసరమంటూ.. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు ప్రతిపాదించారు. విద్యా హక్కు (ఆర్‌టీఈ)ని విస్తృత పరిధికి విస్తరించడం, జనాభా తగ్గుతున్న రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకోవడానికి డీలిమిటేషన్ ప్రమాణాలను సవరించడం, బిల్లులకు ఆమోదం తెలిపేందుకు గవర్నర్లకు కాలపరిమితి విధించడం, అట్టడుగు ప్రజాస్వామ్యాన్ని శక్తివంతం చేయడానికి ఒక దేశం, ఒకే ఎన్నికలలో స్థానిక ఎన్నికలను మిళితం చేయడం, ఆన్‌లైన్ గేమింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను చేర్చడానికి 7వ షెడ్యూల్ విస్తరణ వంటివి ప్రతిపాదించారు. తెలుగుదేశం పార్టీకి రాజ్యాంగంపై అచంచలమైన విశ్వాసం ఉందని అన్నారు.

పిల్లి, కుక్కలకూ ఆర్థో ఆపరేషన్లు

- గుంటూరు జిల్లా పశువైద్యశాల డాక్టర్ల ప్రత్యేకత
- ఎముకలు విరిగితే రాడ్స్, పిన్నింగ్ సర్జరీలు
- ఎద్దు, ఆవులు వంటి జంతువులకు వైద్య సేవలు
- ఎక్స్‌రే యూనిట్, పిన్నింగ్ సామగ్రి ఉంటే మరింత మెరుగ్గా..





ఎద్దుకు సర్జరీ చేస్తున్న డాక్టర్ నాగేశ్వరరావు, కాలు విరిగిన ఆవుకు రాడ్స్ వేసేందుకు సిద్ధం చేసిన దృశ్యం

గుంటూరు సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మనుషులకు ఏదైనా ప్రమాదం జరిగి కాళ్లు, చేతులు విరిగితే.. ఆపరేషన్ చేసి ప్లేట్లు, రాడ్లు వేస్తారు. అదే ప్రమాదం కుక్క, పిల్లి, ఎద్దు, ఆవు వంటి జంతువులకు జరిగితే వాటికి కూడా మనుషుల మాదిరిగానే ఆర్థో ఆపరేషన్లు చేసి రాడ్స్, పిన్నింగ్ వేస్తున్నారు. గుంటూరులోని కొత్తపేటలో ఉన్న జిల్లా పశువైద్యశాలలో గత రెండేళ్లుగా ఇలాంటి ఆపరేషన్లు చేస్తున్నారు. పశువుల డాక్టర్ లక్కింశెట్టి నాగేశ్వరరావు(సర్జన్) ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా 40కి పైగా ఆర్థో సర్జరీలు విజయవంతంగా చేశారు. ఎక్స్‌రే యూనిట్, ప్లేటింగ్ సామగ్రి వంటి వసతులు ఆస్పత్రిలో లేకున్నప్పటికీ.. పశువుల విరిగిన ఎముకలకు తిరిగి జీవం పోస్తున్నారు. ఏదైనా ప్రమాదానికి గురయ్యే జంతువుల్లో ఫ్యాక్చర్(ఎముకలు విరగటం)ను సింపుల్, కాంపౌండ్ అని విభజిస్తున్నారు. సింపుల్ ఫ్యాక్చర్‌లో పైన శరీరం బాగానే ఉండి లోపల ఎముకలు విరుగుతాయి. ఎక్స్‌రే ద్వారా ఎముక ఎక్కడ విరిగిందో గుర్తించి శస్త్రచికిత్స చేస్తారు. గతంలో ఇలాంటి సందర్భాల్లో కేవలం పిండి కట్టు వేసి వదిలేసేవారు. దానివల్ల విరిగిన ప్రదేశంలో వాపు రావటం, ఎముక పూర్తిగా కట్టుకోక పోవడంతో ప్రమాదం బారిన జంతువు జీవితకాలం వైకల్యంతోనే బతకాల్సి వచ్చేది. ఆ పరిస్థితిని నివారించేందుకు గుంటూరు జిల్లా పశు వైద్యశాలలో డాక్టర్ నాగేశ్వరరావు బృందం పిన్నింగ్ చేయడం, రాడ్స్ వేయటం చేస్తున్నారు. ఇక కాంపౌండ్ ఫ్యాక్చర్‌లో పైన శరీరం దెబ్బతినడంతో పాటు లోపల ఎముక కూడా విరుగుతుంది. అటువంటి కేసుల్లో కూడా పిన్నింగ్, రాడ్స్ అమరుస్తున్నారు. ఈ ఆపరేషన్లకు 3-5 గంటల వరకు సమయం పడుతుందని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మంగళగిరి రత్నజ్యోతి చెబుతున్నారు. ప్రమాదానికి గురయ్యే జంతువులకు ఆర్థో ఆపరేషన్ చేసిన 15 రోజుల తర్వాత కుట్లు విప్పుతామని, కొత్త ఎముకలు రావడానికి 8 వారాల సమయం పడుతుందని తెలిపారు. డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ చక్రవర్తి బృందం పనివేళలతో సంబంధం లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు.

థియేటర్ అందుబాటులోకి వస్తే..

జిల్లా పశువైద్యశాల నూతన భవన నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. రూ.30 లక్షల వ్యయంతో ఆపరేషన్ థియేటర్ నిర్మిస్తున్నారు. అది అందుబాటులోకి వస్తే మరిన్ని కీలక సర్జరీలు చేసే అవకాశం ఉంటుంది. మా దగ్గరకు ఇప్పుడు చాలా మేజర్ సర్జరీ కేసులు వస్తున్నాయి. యూరిన్ బ్లాడర్ పూర్తిగా ఛిద్రం అయిన కేసులకు కూడా ఆపరేషన్లు చేస్తున్నాం. అవి కాక కుటుంబ నియంత్రణ, కడుపులో ఉన్న పిల్లలను బయటకు తీసేందుకు ఆపరేషన్లు జరుగుతూనే ఉన్నాయి. థియేటర్‌తో పాటు డిజిటల్ ఎక్స్‌రే యూనిట్, ప్లేటింగ్ సామగ్రి ఉంటే మెరుగైన సేవలు అందించొచ్చు. ఇప్పుడు ఎక్స్‌రే కోసం ప్రమాదానికి గురైన జంతువులను బయటకు తీసుకువెళ్లాల్సి వస్తుంది. అది చాలా ఇబ్బంది కలిగిస్తోంది.

- డాక్టర్ లక్కింశెట్టి నాగేశ్వరరావు, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ



న్యాయం చేయాలంటూ సీఎం చంద్రబాబు వద్ద రోదిస్తున్న శంకరలీల

విడదల రజిని, అప్పిరెడ్డి మనుషులే నా కూతురిని చంపేశారు!

- పైగా మాపైనే హత్య కేసు పెట్టి వేధిస్తున్నారు
- రెండేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్నాం
- టీడీపీ గ్రీవెన్సులో చంద్రబాబుకు మొరపెట్టుకొన్న తల్లి
- నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టబోమన్న సీఎం

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజిని, వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి దగ్గరగా ఉండే వ్యక్తులే తన కూతురిని చంపడంతోపాటు ఎదురు తమపైనే హత్య కేసు పెట్టారని ఓ యువతి తల్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎదుట బోరుమన్నారు. శనివారం ఆయన ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. గుంటూరు నగరం గుజ్జనగుళ్ల ప్రాంతానికి చెందిన నిశంకర శంకర లీల అనే మహిళ.. తన కుమార్తె హత్యోదంతంపై చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. 'మాజీ మంత్రి విడదల రజిని, లేళ్ల అప్పిరెడ్డి వద్ద పనిచేస్తున్నామని చెప్పే వ్యక్తులు.. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న నా కూతురిని వంచించి లోబర్చుకొన్నారు. వారితో తీసుకువెళ్లిపోయారు. 13 నెలల తర్వాత కిరాతకంగా హత్య చేసి నా కూతురి శవాన్ని మా ఇంటికి పంపారు. హంతకులపై చర్య తీసుకోవాలని మేం రెండేళ్లుగా పోరాడుతుంటే ఎదురు మాపైనే హత్య కేసు పెట్టారు. కూతురు పోయిన దుఃఖంతోపాటు.. అక్రమ కేసులో ఇరుక్కొని రెండేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్నాం. న్యాయం చేయాలని అప్పటి నల్లపాడు సీఐని కలిసి కోరితే నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో తిట్టి పంపించారు. నిందితులను ఇప్పటికైనా శిక్షించి మాకు న్యాయం చేయండి సార్' అంటూ ఆమె చంద్రబాబు ఎదుట బోరుమన్నారు. ఆమెను చంద్రబాబు ఓదార్చారు. కేసులో ఎంతటివారున్నా వదిలిపెట్టబోమని, తప్పక న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ జవాన్ అక్కల జ్ఞానానందం, తన భార్యతో కలిసి చంద్రబాబుకు ఒక వినతిపత్రం ఇచ్చారు. 'విజయవాడ నగరంలో మా ఇంటిని గత వైసీపీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదు. రూ.కోటిన్నరతో కట్టిన ఇంటిని తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది. రూ.98 లక్షలకు కొనుగోలు చేస్తామని ముందుకు వచ్చిన వ్యక్తి చివరికి రూ.82 లక్షలు చేతిలో పెట్టి మమ్మల్ని పొమ్మన్నాడు. అదేమంటే తన రౌడీ మామూలు అని దబాయించాడు. గత ప్రభుత్వంలో మాకు ఎవరూ సాయం చేయలేదు. మీరైనా విచారణ జరిపించి మోసగాడిపై చర్య తీసుకొని, మా డబ్బు మాకు ఇప్పించండి' అని భార్యాభర్తలు తమ గోడు వెల్లబోసుకున్నారు. తాను కొనుగోలు చేసిన పొలంలోకి తనను రానివ్వకుండా అడ్డుకొంటున్నారని, తనకు న్యాయం చేయాలని రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటకు చెందిన బొప్పన సురేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను పర్మినెంట్ చేయాలి

- సీఎంను కలిసిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్ట్ లెక్చరర్లను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. జేఏసీ చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో-చైర్మన్ కల్లూరి శ్రీనివాస్‌లు శనివారం చంద్రబాబును కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ పెండింగ్ అంశాన్ని పరిశీలించి న్యాయం చేస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు వారు మీడియాకు తెలిపారు.

ఇక సూటిగా.. సుత్తిలేకుండా!

కలెక్టర్ల సదస్సు నమూనా మార్చేస్తాం

- సుదీర్ఘ సమీక్షలు ఉండవు.. ప్రజెంటేషన్లు తగ్గిస్తాం
- ప్రశ్నలు-సమాధానాల పద్ధతిలో నిర్వహణ
- కలెక్టర్లు, ఎస్పీలకు ముందుగానే ఎజెండా
- సమస్యలు, పరిష్కారాలు తెలుసుకుంటాం
- జమిలికి మద్దతు.. ఎన్నికలు 2029లోనే
- స్వర్ణాంధ్ర డాక్యుమెంట్‌పై విస్తృతంగా చర్చిస్తాం
- సీఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి/మచిలీపట్నం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల సదస్సు నమూనాను వచ్చే సమావేశం నాటికి మార్చివేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పుడు నిర్వహిస్తున్న పద్ధతిలో సమయం కొంత వృథా అవుతోందని గుర్తించామని, సుదీర్ఘ సమీక్షలు కాకుండా ప్రశ్నలు-సమాధానాల పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. 'చర్చించాల్సిన అంశాలు, వాటి ఎజెండాను ముందుగానే కలెక్టర్లు, ఎస్పీలకు పంపిస్తాం. ఏవైనా అంశాలు ఉంటే సమాచారంతో రావాలని కోరుతాం. ప్రజెంటేషన్లు తగ్గించి ప్రశ్నలు-సమాధానాలతో సమావేశం నిర్వహిస్తాం. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. సమస్యలు ఏవిటో, వాటికి పరిష్కారం ఏమిటో కూడా తెలిసిపోతుంది. మంత్రులు, అధికారుల మధ్య చర్చ పెరుగుతుంది' అని అన్నారు. అసెంబ్లీలు, పార్లమెంటుకు కలిపి దేశమంతా జమిలి ఎన్నికలు ఒకేసారి జరిపినా అవి 2029లోనే వస్తాయని వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలు పెడితే 2029 కంటే ముందే వస్తాయని కొందరు వైసీపీ నేతలు చేస్తున్న ప్రకటనలను ప్రస్తావించినపుడు.. ఆ పార్టీ నేతలకు అవగాహన లేక ఏవేవో మాట్లాడుతున్నారని, వారి మాటలకు ప్రజల్లో విశ్వసనీయత పోయిందని అన్నారు. ఎన్నికలు ముందుగా వస్తాయంటే వారి పార్టీ నేతలు ఇళ్లలో నుంచి బయటకు వస్తారని ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని, వాళ్లు చేసే డ్రామాలు చూసి ప్రజలు నవ్వుకొంటున్నారని వ్యాఖ్యానించారు. ఒకే దేశం.. ఒకే ఎన్నికల విధానానికి తమ పార్టీ మద్దతు ఇస్తోందని, ఈ విషయం గతంలోనే ప్రకటించామని స్పష్టం చేశారు. రైతు సమస్యలపై ధర్నాలంటూ వైసీపీ నేతలు హడావుడి చేస్తే పట్టించుకొన్న నాథుడు లేడని, తాము పని చేస్తుంటే వాళ్లు డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు.

ప్రజల్లోకి 'స్వర్ణాంధ్ర' విజన్

'స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్తాం. విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లో ప్రతి చోటా దీనిపై చర్చిస్తాం. గతంలో విజన్-2020 ప్రణాళిక రూపొందించి అమలు చేశాం. అది ఎలా సాకారమైందో నేటి తరం తెలుసుకోవాలి. 1996 నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ పరిస్థితులు, 2020 నాటి పరిస్థితులు బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు అందరి కళ్లకు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న విజన్ ప్రణాళిక వల్ల 2047 నాటికి మనం అనుకొన్న అభివృద్ధి రావడం ఖాయం. విజన్-2047 డాక్యుమెంట్ ఒక రోజు కార్యక్రమం పెట్టి వదిలేసేది కాదు. భవిష్యత్ తరాల బాగు కోసం ఇందులో అనుకొన్న లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని మేం పట్టుదలగా ఉన్నాం. ఇందులో అందరి భాగస్వామ్యం కావాలి. రాష్ట్రంలో పదిహేను శాతం ప్రజలు ఆర్థికంగా అట్టడుగు స్థాయిలో ఉన్నారు. పది శాతం ఉన్నత స్థాయిలో ఉన్నారు. పైనున్న వారు కింద ఉన్నవారికి తోడ్పాటు ఇచ్చి పైకి రావడానికి సహకరిస్తే కొంత కాలానికి రాష్ట్రంలో పేదరికం లేకుండా పోతుంది. ఇటువంటి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని మేం అనుకొంటున్నాం. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ ప్రణాళిక రూపొందించాం' అని చంద్రబాబు వివరించారు. ఈ నెలలో నీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేస్తున్నామని, ఆ తర్వాత సహకార సంఘాలకు పాలక మండళ్లను నామినేట్ చేస్తామని తెలిపారు. వీటి వల్ల కింది స్థాయిలో అనేకమంది పార్టీ నేతలకు అవకాశాలు లభిస్తాయన్నారు.

పేదరికం లేని సమాజం కోసం

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరిగితే అభివృద్ధిపై దృష్టి సారించవచ్చునని చంద్రబాబు అన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలోని శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు జరిగిన అనంతరం ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎన్నికలు వస్తుండటంతో రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోసమే పనిచేస్తున్నారని, ప్రజల కోసం పనిచేయడంలేదని అన్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించడం, ఆర్థిక అసమానతలు తొలగించే వ్యవస్థను రూపొందించడం, సంపదను అందరికీ అందుబాటులో ఉంచడం చాలా అవసరమని అన్నారు. విజన్-2047 లక్ష్యం ఒక్కటేనని.. ప్రపంచంలోనే భారతదేశం నంబర్‌వన్‌గా నిలబడాలని, దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంటుందని, ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు కీలక స్థానాల్లో పనిచేసేలా ప్రణాళికను రూపొందించామని అన్నారు.

గుడ్లవల్లేరును దత్తత తీసుకున్న 'మేఘా'

గుడ్లవల్లేరు మండలాన్ని మేఘా కృష్ణారెడ్డి, ఆయన భార్య సుధారెడ్డి దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారని సీఎం చంద్రబాబు తెలిపారు. అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా విధివిధానాలు మేఘా కృష్ణారెడ్డికి అందజేస్తామన్నారు. సంక్రాంతి నాటికి ఈ ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. కృష్ణారెడ్డి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. 2014లో డోకిపర్రు గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభించేందుకు వెంకయ్యనాయుడుతో కలిసి ఇక్కడకు వచ్చానని, అప్పటికీ, ఇప్పటికీ ఆలయంతో పాటు ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు.

పనితీరు ఆధారంగానే పదవులు

పనితీరు ఆధారంగానే పార్టీ నేతలకు పదవులు వస్తాయని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో కొద్దిసేపు పార్టీ నేతలతో మాట్లాడారు. 'ప్రతిపక్షంలో ఉన్న సమయంలో, ఎన్నికల సమయంలో పార్టీ నేతలు ఎవరెవరు ఏ స్థాయిలో ఏ మేరకు పని చేశారు, పార్టీకి ఎలా ఉపయోగపడ్డారనే దానిపై కచ్చితమైన సమాచారం ముందు పెట్టుకొని వెళ్తున్నాం. పార్టీకి అవసరమైనప్పుడు ఉపయోగపడకుండా, ప్రజల్లో పనిచేయకుండా 30-40 ఏళ్ల నుంచి ఉన్నామంటూ పదవులు కోరడం సరి కాదు. పార్టీలో లక్షల మంది ఉన్నారు. అన్ని ప్రాంతాలు, అన్ని సామాజిక వర్గాలు, అన్ని సమీకరణాలు చూసుకోవాలి. ఊరికే పార్టీలో ఉన్నామంటే పదవులు రావు. కష్టపడకుండా ఏదీ రాదని ప్రతి ఒక్కరూ గుర్తించాలి' అని అన్నారు. కొందరు నాయకులు తాము ఎమ్మెల్యేలు అయిపోయామనో, పదవులు వచ్చేశాయనో పార్టీ పని పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తాను గమనిస్తున్నానని, పార్టీ వల్లే తమకు ఏ పదవైనా వచ్చిందని వారు గ్రహించాలని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తూనే, అదే సమయంలో పార్టీ బలోపేతం కోసం కూడా పనిచేయాలన్నారు. తాను ప్రభుత్వ పనుల్లో ఎంత ఒత్తిడితో ఉన్నా కొంత సమయం పార్టీకి కేటాయించి పనిచేస్తున్నానని పార్టీ నేతలకు చెప్పారు.

ఆడ్వాణీ త్వరగా కోలుకోవాలి

ఆస్పత్రిలో చేరిన బీజేపీ సీనియర్ నేత ఆడ్వాణీ త్వరగా కోలుకోవాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. ఆయనతో తనకు దశాబ్దాల అనుబంధం ఉందని, గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన సహకారం మరువలేనిదని కొనియాడారు.



శ్రీవారి ఆలయం నుంచి బూందీ పోటుకు వెళుతున్న సిట్ బృందం

'కల్తీ నెయ్యి'పై మరింత కదలిక

- చకచకా సాగుతున్న సిట్ విచారణ
- తిరుమలలో విస్తృత దర్యాప్తు
- బూందీపోటు కేంద్రం, ల్యాబ్ పరిశీలన
- సీబీఐ డైరెక్టర్‌కు మధ్యంతర నివేదిక

తిరుపతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అయిందన్న ఆరోపణలపై దర్యాప్తు కోసం సుప్రీం కోర్టు నియమించిన సిట్ బృందం చకచకా విచారణ కొనసాగిస్తోంది. సీబీఐ జేడీ, ఎస్పీ, ఏపీ పోలీసు ఐజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కూడిన సిట్ బృందం శుక్రవారం రాత్రే ఆరోపణలు ఎదుర్కొంటున్న వైష్ణవీ డెయిరీలో తనిఖీలు చేయగా, శనివారం దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. తిరుమల కొండపై పోటు, బూందీ తయారీ కేంద్రం, నెయ్యి నిల్వ కేంద్రం, ల్యాబ్ వంటి ప్రదేశాలను పరిశీలించారు. సిట్ బృంద కీలక అధికారులు శనివారం వేకువజామున తిరుమల చేరుకున్నారు. తొలుత శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలోనే వున్న శ్రీవారి లడ్డూ పోటును పరిశీలించారు. ఆపై ఆలయం వెలుపల ఉత్తర దిశలో ఉన్న నెయ్యి నిల్వ చేసే షెడ్డుకు చేరుకున్నారు. అక్కడ రెండు నెయ్యి ట్యాంకర్లు పరిశీలించారు. తర్వాత బూందీ తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి కాలినడకన అర్చక నిలయం మీదుగా ల్యాబ్‌కు వెళ్లారు. దాదాపు అరగంటకు పైగానే ల్యాబ్‌లో గడిపారు. నెయ్యి నాణ్యతను నిర్ధారించే పరికరాలను అక్కడ పరిశీలించారు. వాటి స్థాయి ఏమిటి? నాణ్యతా పరీక్షలు ఎలా చేస్తున్నారు? వంటి ప్రశ్నలు వేశారు. పూర్తిస్థాయిలో పరీక్షించే అధునాతన పరికరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ల్యాబ్‌లో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, వారి అనుభవం, అర్హత వంటివి ఆరా తీశారు. నాణ్యతా పరీక్షలకు పూర్తిస్థాయి పరికరాలు లేనప్పుడు ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. నెయ్యి ట్యాంకర్ వచ్చాక శాంపిల్స్ ఎలా సేకరిస్తారు? వాటిని ఎక్కడ నమోదు చేస్తారు? ఆరోపణలు వచ్చిన నెయ్యిలో నాణ్యత లేదని ఎలా గ్రహించారు? తదితర ప్రశ్నలు అడిగారు. అయితే ల్యాబ్ సిబ్బంది చాలావరకూ సమాధానాలు ఇవ్వలేకపోయారు. లడ్డూ తయారీకి రోజువారీ వినియోగించే ముడిసరుకుల పరిమాణం వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పప్పు దినుసులు నిల్వ చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. వాటి రోజువారీ వినియోగం మోతాదు, నాణ్యతా పరీక్షల గురించి ఆరా తీశారు. పిండి మరలను కూడా పరిశీలించారు. అవసరమైన వాటి ఫొటోలు తీసుకోవడంతో పాటు రికార్డులు కూడా సేకరించారు. వీరి వెంట టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, మార్కెటింగ్ ఇన్‌చార్జి పద్మావతి, సూపరింటెండెంట్ సురేశ్, తిరుపతి ఏఎస్పీ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్న పాలకులు

- ప్రజా చైతన్యంతోనే తిప్పికొట్టగలం
- మానవహక్కుల వేదిక మహాసభల్లో వక్తలు



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు, కార్యకర్తలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక హక్కులను పాలకులు కాలరాస్తున్నారని మానవహక్కుల వేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా చైతన్యం ద్వారానే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం సాధ్యపడుతుందని అన్నారు. మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) 10వ రాష్ట్ర మహాసభలు అనంతపురంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సభలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఏపీ మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మాట్లాడారు. కరువులకు నిలయమైన అనంతపురం జిల్లా పౌర ఉద్యమాలకు పెట్టింది పేరని ఆయన అన్నారు. మానవ హక్కుల వేదిక ఉద్యమంతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. 2009లో అనంతపురంలో జరిగిన మానవహక్కుల వేదిక మూడో రాష్ట్ర మహాసభల్లో బాలగోపాల్‌తో కలిసి తాను పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. దేశంలో అమలవుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజా చైతన్యంతోనే తిప్పిగొట్టగలమని అన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను పాలకులు నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారని ఓపీడీఆర్ నాయకుడు రామ్‌కుమార్ విమర్శించారు. ఆదివాసీ సమస్యలపై పోరాడే స్టాలిన్‌ను నిర్బంధించి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాల తరఫున గొంతెత్తేందుకు పౌరహక్కుల సంఘాలు మరింతగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో ప్రజాసంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని హెచ్ఆర్ఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు భుజంగరావు విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలో ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చేస్తున్నారని అన్నారు. వారి హక్కులను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

తెలుగు రాష్ట్రాలకు నూతన కమిటీలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మానవ హక్కుల వేదిక(హెచ్ఆర్ఎఫ్) నూతన కమిటీలు ఎంపికయ్యాయి. తొలిరోజు సభకు రెండు రాష్ట్రాల నుంచి 144 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రానున్న రెండు సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కమిటీల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాకుళానికి చెందిన జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా అమలాపురానికి చెందిన రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ అధ్యక్షుడిగా ఉట్నూరుకు చెందిన ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా జమ్మికుంటకు చెందిన డాక్టర్ ఎస్ తిరుపతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్ఆర్ఎఫ్ ప్రచురణల సంపాదక అధ్యక్షుడుగా విశాఖపట్నానికి చెందిన అనురాధ, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులుగా జీవన్‌కుమార్, వసంతలక్ష్మి, చంద్రశేఖర్, వీఎస్ కృష్ణను ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీల సమక్షంలో 24 అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం మహాసభల ప్రాంగణం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

రూ. కోటి చెల్లించిన పేర్ని నాని!

- పీడీఎస్ బియ్యం కేసు నుంచి తప్పించుకునే యత్నం



మచిలీపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తన గోడౌన్‌లో పీడీఎస్ బియ్యం మాయమైన కేసు నుంచి బయటపడే ప్రయత్నాల్లో మాజీ మంత్రి పేర్ని నాని ఉన్నారు. దీనిలో భాగంగా శనివారం ఆయన కోటి రూపాయలు ప్రభుత్వానికి చెల్లించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మచిలీపట్నం సమీపంలోని పొట్లపాలెంలో పేర్ని నాని భార్య జయసుధ పేరున ఉన్న గోడౌన్‌లను పౌరసరఫరాలశాఖకు అద్దెకు ఇచ్చారు. గత నెలాఖరున నిర్వహించిన తనిఖీల్లో ఈ గోడౌన్‌ల నుంచి 187 టన్నుల పీడీఎస్ బియ్యం మాయమైనట్టు అధికారులు గుర్తించారు. అయితే అధికారులు తనిఖీలకు రాకముందే పేర్ని నాని భార్య జయసుధ స్పందించారు. ఆ గోడౌన్‌లోని బియ్యం లెక్కల్లో తేడాలు ఉన్నాయని, దానికి డబ్బు చెల్లిస్తానని పౌరసరఫరాలశాఖ అధికారులకు లేఖ రాశారు. దీంతో బియ్యం మాయం విషయం ముందుగానే బయట పడింది. పీడీఎస్ బియ్యం మాయంపై పౌరసరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదుతో ఇటీవల మచిలీపట్నం తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పేర్ని జయసుధ శుక్రవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కేసు నుంచి బయటపడేందుకే పేర్ని నాని ప్రభుత్వానికి డబ్బు చెల్లించినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గోప్యత పాటిస్తున్నారు.

ఏలూరులో కొత్త ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

- ఏర్పాటుకు డీపీఆర్: మంత్రి అచ్చెన్న



వ్యవసాయ శాఖ సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచి, రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. 'ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో కొత్త ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి డీపీఆర్‌ను తయారు చేయాలి. సాగు పెంపుదలకు అనుగుణంగా ఆయిల్‌పామ్ పరిశ్రమలకు మండలాలను కేటాయించాలి. పండ్ల తోటల సాగు ఆధారంగా క్లస్టర్లు ఏర్పాటు చేసి, నాణ్యమైన ఉత్పత్తులు సాధించేలా, ఎగుమతులను మరింత ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి' అని అధికారులను ఆదేశించారు. రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు బడ్జెట్ కేటాయింపులు పెంచేలా కేంద్రాన్ని కోరతామని చెప్పారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు, ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, శనివారం ఎక్స్ సామాజిక మాధ్యమంలో మంత్రి అచ్చెన్న స్పందిస్తూ... రైతులపై వైసీపీ నేతలు కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారు. గత ఐదేళ్లు రైతులకు తీవ్ర నష్టం, అన్యాయం జరిగింది. ధాన్యం డబ్బుల కోసం రైతులు కాళ్లు అరిగేలా తిరిగారు. ఇప్పుడు 24 గంటల్లోనే సొమ్ము అందుకుంటున్నారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబించిన వైసీపీ పెయిడ్ ఆర్టిస్టులతో నిరసనలు చేయడం సిగ్గుచేటు' అని ధ్వజమెత్తారు.



తెలుగు భాష అంతరిస్తే జాతి అంతరించినట్లే!

- విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ
- జానమద్ది శతజయంతిలో స్మారకోపన్యాసం
- జీఓ 585ను రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి ఉందని, ఇదే జరిగితే తెలుగు జాతి అంతరించిపోయినట్లేనని భారత సర్వోన్నత న్యాయస్థానం విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో శనివారం బ్రౌన్ గ్రంథాలయంలో.. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి స్మారకోపన్యాస కార్యక్రమాన్ని జానమద్ది కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'తెలుగు భాష వైభవం' అనే అంశంపై జస్టిస్ ఎన్వీ రమణ ప్రసంగించారు. తెలుగు రాష్ట్రాల విభజనతో తెలుగు అతి త్వరగా మరుగునపడే పరిస్థితి కనిపిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధి కోసం తెలుగును పూర్తిగా వదిలిపెట్టి ఇంగ్లీష్‌కు అలవాటుపడుతున్నారన్నారు. తాను ఎన్నో దేశాల్లో చూశానని, అక్కడ ఇప్పటికీ వారి మాతృభాషలోనే బోధన జరుగుతోందని చెప్పారు. మాతృభాషలో ఉన్న అంశాలను నేర్చుకుంటే ఇతర భాషలు నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాను ఏడో తరగతికి వచ్చేంత వరకు ఇంగ్లీష్ నేర్చుకోలేదన్నారు. కానీ భారత అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశానని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా ప్రధానమంత్రి మోదీ, భారత ఉపరాష్ట్రపతిగా పనిచేసిన వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లాంటి వ్యక్తులు మాతృభాషలోనే చదివారని వివరించారు. పాఠశాలలో ఇంగ్లీష్ మాత్రమే బోధించాలని ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబరు 585ను రద్దు చేయాలని తాను ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. ఇదే అంశంపై సుప్రీంకోర్టులో ఉన్న స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లను తాను కోరానని వివరించారు. పాత విద్యా విధానాన్ని కొనసాగించాలని సూచించినట్లు తెలిపారు. తెలుగు భాష అభివృద్ధి కోసం దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు తెలుగు అకాడమీ స్థాపించారని, దానిని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇతర దేశాల్లో ఉన్న తెలుగు ప్రజలు మన సంప్రదాయాలను తూ.చ. తప్పకుండా పాటిస్తున్నారని, ఇక్కడ కనీసం మనం ఇంట్లోనైనా పిల్లలతో తెలుగు మాట్లాడాలని కోరారు. తెలుగు భాషపై ఒక పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం వివిధ సంస్థల ప్రతినిధులు జస్టిస్ ఎన్వీ రమణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జేసీ అదితిసింగ్, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన గోపీమూర్తికి శాసనమండలి నియమ నిబంధనల పత్రాలు అందజేస్తున్న చైర్మన్ మోషేన్ రాజు

ఎమ్మెల్సీగా బొర్రా గోపీమూర్తి ప్రమాణ స్వీకారం

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పీడీఎఫ్ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన బొర్రా గోపీమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతి అసెంబ్లీ భవన ప్రాంగణంలో శనివారం శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్సీ గోపీమూర్తికి ఛైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్‌కు రైతు అనే మాట ఉచ్ఛరించే అర్హత లేదు: సోమిరెడ్డి

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతు ఆత్మహత్యల్లో ఏపీని మొదటి స్థానానికి తీసుకెళ్లిన ఘనత జగన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'వ్యవసాయ శాఖను చంపేసిన జగన్.. సూక్ష్మసేద్యం, ఉచిత పోషకాలు, రాయితీల వంటి ప్రోత్సాహకాలను రైతులకు దూరం చేసిన జగన్.. వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశాడు. దేశంలో రైతులపై తలసరి అప్పు రూ.74,500 ఉంటే, ఏపీలో రూ.2.45 లక్షల అప్పు ఉండటానికి జగనే కారణం. జగన్‌కు రైతు అనే మాట ఉచ్చరించే అర్హత లేదు. వ్యవసాయ శాఖపై శ్వేతపత్రం విడుదల చేయడానికి మేం సిద్ధం. జగన్ సిద్ధమా? స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో వ్యవసాయానికి, రైతాంగానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారు' అని సోమిరెడ్డి అన్నారు.

విజన్ డాక్యుమెంట్ 2047 చరిత్రాత్మకం: నాగోతు

న్యూఢిల్లీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు విజన్ డాక్యుమెంట్ 2047 ఆవిష్కరించడం ఒక చరిత్రాత్మక ఘటన అని బీజేపీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు కొనియాడారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా డాక్యుమెంటును సీఎం విడుదల చేశారని అన్నారు. శనివారం, ఇక్కడ ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. '2047 కల్లా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శక్తిగా ఎదగాలని కోరుకుంటున్నా. అసత్యపు పునాదులపై, అవినీతి గొడుగు కింద జగన్ పాలన సాగింది. ఆయన ఇష్టానుసారంగా మాట్లాడకుండా ప్రతిపక్ష నేత గౌరవాన్ని కాపాడుకోవాలి. గతంలో వైసీపీ ప్రభుత్వం చీకటి జీవోలు ఇచ్చింది. ఇప్పుడు ఏపీలో మాఫియా రాజ్యం పక్కకు వెళ్లి అధికార వికేంద్రీకరణ జరుగుతోంది' అని రమేశ్ నాయుడు అన్నారు.

అల్లు అర్జున్ అరెస్టు అన్యాయం: పురందేశ్వరి

రాజమహేంద్రవరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): 'సినీ హీరో అల్లు అర్జున్ అరెస్టు అన్యాయం. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నా' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. 'హైదరాబాద్ సంధ్య థియేటర్ దగ్గర తొక్కిసలాట ఘటనకు అల్లు అర్జున్ ఎలా బాధ్యుడవుతాడు? ఒక స్టార్ హీరో వస్తున్నప్పుడు అక్కడ తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. పోలీసులను నియమించి శాంతి భద్రతలను ప్రభుత్వమే చూసుకోవాలి. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమయింది' అని పురందేశ్వరి విమర్శించారు.



ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు చిత్రపటం అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దుర్గగుడి అధికారులు

దుర్గమ్మ సేవలో ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్

- దుర్గగుడి యాప్ ఆవిష్కరించిన మంత్రి ఆనం

విజయవాడ(వన్‌టౌన్), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ శనివారం బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, ఆలయ ఈవో కె.ఎస్. రామారావు, అర్చకులు స్వాగతం పలికారు. కాగా, భవానీ దీక్షల విరమణను పురస్కరించుకుని భక్తులకు ఆలయంలో జరిగే వివిధ ఆర్జిత సేవలు, ఇతరత్రా సమాచారాన్ని తెలియజేసేందుకు రూపొందించిన దుర్గగుడి యాప్‌ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 25 వరకు భవానీ దీక్షల విరమణకు వచ్చే భవానీ భక్తులు ముందస్తు బుకింగ్‌లు, సమాచారం, కౌంటర్లు, పార్కింగ్, టాయిలెట్లు, వైద్య శిబిరాలు, తదితర వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు.

17, 18 తేదీల్లో రాష్ట్రంలో వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత రెండు రోజుల్లో పశ్చిమ వాయవ్యంగా పయనించి తమిళనాడు తీరం దిశగా రానుంది. దీని ప్రభావంతో ఈనెల 17, 18 తేదీల్లో కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఉత్తరాంధ్రలో చలి పెరిగింది. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 8.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం చలి తీవ్రత ఇంకా పెరుగుతుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

విమానాలపై పొగమంచు ప్రభావం

విశాఖపట్నంలో రెండు రోజులుగా పొగమంచు వల్ల విమానాల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. ఉదయం 8 గంటల వరకూ గాలిలో తేమ 90 నుంచి 200 శాతం వరకు ఉండడం వల్ల విమానాశ్రయంలో విజిబులిటీ తక్కువగా ఉంది. విజిబులిటీ మెరుగుపడిన తర్వాత విమానాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు విజిబులిటీ క్లియర్‌గా లేనందున ఆ సమయానికి విశాఖకు రావలసిన ఐదు విమానాలు 60 నుంచి 75 నిమిషాలు ఆలస్యంగా వచ్చాయి.

ఆస్తి కోసం కన్నవారిని కడతేర్చాడు

- బాపట్ల మండలం అప్పికట్లలో దారుణం



కిరణ్‌చంద్ర

బాపట్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆస్తి రాయాలని, పెన్షన్ డబ్బులు ఇవ్వాలని ఓ కొడుకు తన తల్లిదండ్రులను డిమాండ్ చేశాడు. వారు ఇవ్వకపోవడంతో కన్నవారిని పచ్చడిబండతో కొట్టి చంపేశాడు. బాపట్ల మండలం, అప్పికట్ల గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ బీ హరికృష్ణ మీడియాకు తెలిపారు. విజయభాస్కరరావు(74) విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. ఆయన, భార్య వెంకటసాయికుమారి(70)తో కలసి అప్పికట్ల గ్రామంలో ఉంటున్నారు. వీరికి గ్రామంలో మూడంతస్థుల భవనం, విజయవాడలో ఇల్లు, ప్లాటు, పొలాలు ఉన్నాయి. ఆ ఆస్తులన్నీ తన పేరుతో రాయాలంటూ కొంతకాలంగా కుమారుడు కిరణ్ చంద్ర వారిని వేధిస్తున్నాడు. శనివారం తెల్లవారుజాము సుమారు 1.30 గంటల సమయంలో నిద్రపోతున్న తల్లిదండ్రులిద్దరినీ పచ్చడిబండతో దారుణంగా కొట్టి చంపాడు. మృతుల కుమార్తె లోకకల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కరోజులోనే 84 వేలకుపైగా కేసులు పరిష్కారం

- లోక్ అదాలత్‌లకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. ఒక్కరోజులోనే 84,928 కేసులు పరిష్కారం అయ్యాయి. మొత్తం రూ. 53.27 కోట్ల పరిహారం అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వహణ అధ్యక్షులు జస్టిస్ జి.నరేందర్, హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ రవినాథ్ తిల్హరి మార్గదర్శకత్వంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 374 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు. ఇక ఏపీ హైకోర్టు న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ న్యాయమూర్తులు జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ టి.చంద్రధనశేఖర్ పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న 215 కేసులు పరిష్కరించి రూ. 3.69 కోట్లు పరిహారం అందజేశారు. లోక్ అదాలత్‌లు విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత, ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జి.మాలతి కృతజ్ఞతలు తెలిపారు.




ఎర్రబొంతులు.. మత్స్యకారుల కళ్లలో కాంతులు!

ఇవేమీ అక్వేరియంలోని చేపలు కావు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక మత్స్యకారుల వలలకు సముద్రంలో చిక్కిన ఎర్ర బొంతులు. అల్పపీడనం కారణంగా వారం రోజుల నుంచి వేటకు దూరంగా ఉన్న మత్స్యకారులు.. శనివారం సముద్రంలోకి వెళ్లారు. వేటకు వెళ్లిన మత్స్యకారులందరికీ చేపలు భారీగా పడ్డాయి. ఎక్కువగా అభిలాష చేపలు చిక్కాయి. ఇవి కిలో రూ.100-150కి అమ్ముడుపోగా, ఎర్ర బొంతులను మాత్రం కిలో రూ.300కు కొన్నారు. ఎర్ర బొంత చేపలు అరుదుగా దొరుకుతాయని మత్స్యకారులు చెప్పారు. - అచ్యుతాపురం, ఆంధ్రజ్యోతి

ఎన్టీఆర్ యుగపురుషుడు

- భారతరత్న ఇచ్చే వరకు పోరాటం చేస్తాం
- ప్రజల కోసం శేషజీవితాన్ని అంకితం చేశారు
- పాలనలో ఎన్నో మార్పులు తెచ్చారు
- ఆయన స్ఫూర్తితో స్వర్ణాంధ్ర విజన్
- ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభలో చంద్రబాబు
- క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం పట్టుదలే ఆయనకు నివాళి: వెంకయ్య
- తారకరామం, సినీప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ



ఎన్టీఆర్ సినీ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం

విజయవాడ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): 'సినీ రంగాన్ని, రాజకీయ రంగాన్ని ఏలిన నిజమైన యుగపురుషుడు ఎన్టీఆర్. ఆయనకు భారతరత్న ఇచ్చి తీరాల్సిందే. అప్పటి వరకు పోరాటం సాగిస్తాం. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటిస్తే ఆ గౌరవం తెలుగుజాతికే కాదు, దేశానికి దక్కుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శనివారం రాత్రి కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని ప్రైవేటు రిసార్ట్స్‌లో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్‌పై రూపొందించిన 'తారకరామం' పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ సినీ ప్రస్థానం పుస్తకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యుగపురుషులను సమాజం ఎప్పటికీ మరవదన్నారు. దీనికి ఎన్టీఆర్ నిదర్శనమన్నారు. 'ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగువారంటే ఎన్టీఆర్ గుర్తుకొస్తారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి తెలుగువారి ఆత్మగౌరవం, అచ్చ తెలుగుదనంగా మారారు. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లో సీఎం కావడం ఒక చరిత్ర. 1945లో మద్రాసుకు రైలు ఎక్కాక ఆయన జైత్రయాత్ర ఆగలేదు. సినీ పరిశ్రమలో ముందుగా జీతానికి ఉద్యోగంలో చేరి తర్వాత వెండితెరను ఏలారు. ప్రస్తుతం మూడేళ్లకు ఒక చిత్రం విడుదలవుతున్న సందర్భంలో ఆయన ఏడాదికి పది చిత్రాల్లో నటించేవారు. ఎన్టీఆర్ వైవిధ్యమైన పాత్రలను పోషించారు. రాముడు-రావణుడు, కృష్ణుడు-దుర్యోధనుడు ఇలా వైరుధ్య పాత్రలను పోషించినప్పుడు వాటికి ఎలా న్యాయం చేస్తారని పలుమార్లు నేను ప్రశ్నించాను. ఒక్కొక్కరిలో ఒక్కో గుణం ఉంటుందని, దాన్నే తాను చూపిస్తున్నానని ఎన్టీఆర్ చెప్పారు. సినిమాల్లో అనేక ప్రయోగాలు చేశారు. సినీరంగంలో 24 ఫ్రేమ్‌లను తెలియజేశారు. శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరస్వామి పాత్రలను పోషించాల్సి వచ్చినప్పుడు మాంసాహారం తీసుకునేవారు కాదు. నేలపైనే నిద్రించేవారు. తనను ఆదరించిన ప్రేక్షకుల కోసం ఆయన శేషజీవితాన్ని అంకితం చేశారు. తొమ్మిది నెలల పాటు చైతన్యరథంపై రాష్ట్రమంతా పర్యటించారు. చివరికి పిల్లల పెళ్లిళ్లకు కూడా వెళ్లకుండా ప్రజల మధ్య ఉన్నారు. ఆయన సీఎంగా పాలనకు కొత్త అర్థాన్ని ఇచ్చారు. రాజకీయంగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. ఢిల్లీని గజగజలాడించి నేషనల్ ఫ్రంట్‌ను అధికారంలోకి తీసుకొచ్చారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న నినాదాన్ని తీసుకొచ్చారు. క్యాపిటలిజం, కమ్యూనిజం.. మీది ఏ ఇజం అన్న విలేకరుల ప్రశ్నకు మరో ఆలోచన లేకుండా హ్యూమనిజం అని సమాధానం ఇచ్చారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 రూపొందించాం. సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడానికి ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. తెలుగుజాతి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ ఉంటుంది' అని చంద్రబాబు అన్నారు.



విజయవాడలోని పోరంకిలో జరిగిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభకు హాజరైన అభిమానులు, కళాకారులు

ఎన్టీఆర్ కారణజన్ముడు



ఎన్టీఆర్ క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... ఎన్టీఆర్ కారణజన్ముడని, వజ్రసంకల్పం కలిగిన వ్యక్తి అని ప్రశంసించారు. గొప్పవాళ్ల చరిత్రను నిక్షిప్తం చేసుకుని నవతరానికి తెలియజేసినప్పుడు ఆ పరంపర కొనసాగుతుందన్నారు. తారకరామం, ఎన్టీఆర్ సినీ ప్రస్థానం పుస్తకాలను చాలా బాగా రూపొందించారన్నారు. 'ఎన్టీఆర్‌లో క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి పనిచేయడం వంటి గుణాలు నాకు బాగా నచ్చాయి. ఈ మూడు లక్షణాలు ఉన్నప్పుడు జీవితంలో ఎవరైనా పైకి వస్తారు. ఈ మూడు లక్షణాలు ఉంటే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి. ఎన్టీఆర్ విలక్షణమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. ఆయన చిత్రాల్లోని డైలాగులు, పాటల్లో ఒక సందేశం ఉంటుంది. దాన్ని లోతుగా అర్థం చేసుకోవాలి. నటుడు, దర్శకుడు, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించారు. ఆయన సలక్షణమైన, విలక్షణమైన పాత్రలు పోషించి నటనా వైదుష్యాన్ని చూపించారు. దుర్యోధనుడ్ని ఆ విధంగా పిలవడం ఇష్టం ఉండదు. అందుకే సుయోధనుడు పదాన్ని ఉపయోగించేవారు. రావణుడు, సుయోధనుడిలో ఉన్న మంచి గుణాలను వెలికి తీసి చిత్రాల ద్వారా ప్రజలకు చూపించారు. రంగులు పూసుకున్నా లేకపోయినా ఆయన అందంగా ఉండేవారు. ఆయన నిజంగానే విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు. ఎన్టీఆర్ నట విన్యాసం, స్వర విన్యాసం చాలా అద్భుతం. ఆయనను గ్రామాల్లో ప్రజలు ఎన్టీఓడు అని పిలుచుకునేవారు. అనేక పౌరాణిక పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేశారు. ఐదు దశాబ్దాల పాటు సినీరంగాన్ని శాసించారు. పురాణ, ఇతిహాసాల్లో ఉన్న అన్ని పాత్రల్లో నటించారు. తెలుగు భాషా మాధుర్యాన్ని ప్రపంచానికి చూపించారు' అని వెంకయ్యనాయుడు అన్నారు.

నోరు మెదపని పాల్



విచారణ అనంతరం పోలీసుస్టేషన్ నుంచి బయటకు వస్తున్న విజయ్‌పాల్

- సాక్షులు, పక్కా ఆధారాలతో విచారణ
- అయినా ఎలాంటి స్పందనా లేని వైనం
- 2 రోజులపాటు విచారించిన ప్రకాశం ఎస్పీ
- ముగిసిన విచారణ.. జైలుకు తరలింపు

ఒంగోలు క్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ఎంపీగా ఉన్న సమయంలో ఆయనను కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన కేసులో రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను ప్రకాశం జిల్లా ఎస్పీ రెండు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. అయితే, ఈ విచారణలో విజయ్‌పాల్ నోరు విప్పలేదని తెలిసింది. మరోవైపు.. రఘురామను హత్య చేసేందుకు వైసీపీ హయాంలో కుట్ర జరిగిందని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దీనిపై ఇప్పటికే అనేక మంది సాక్షులను విచారించారు. 2021, మే 14న సీఐడీ అధికారులు రఘురామపై కేసు నమోదు చేశారు. ఆ కేసును విచారిస్తున్న అప్పటి గుంటూరు సీఐడీ ఓఎస్డీగా ఉన్న విజయ్‌పాల్ బృందం మే 13నే హైదరాబాద్ వెళ్లింది. అంటే కేసు నమోదు చేయకుండానే వెళ్లడంలో కుట్రకోణం స్పష్టమవుతోందని విచారణ అధికారులు భావిస్తున్నారు. అంతేకాకుండా రఘురామ ఆపరేషన్ చేయించుకున్నాడని తెలిసి కూడా ఆయన గుండెలపై కూర్చొని బలంగా కొట్టడం కూడా హతమార్చాలనే ఉద్దేశంతోనే జరిగి ఉంటుందని అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఆ సమయంలో రఘురామకు భద్రతా విధులు నిర్వహించిన 10 మందిని సాక్షులుగా ఉంచి వారి సమక్షంలో సీఐడీ మాజీ ఏఎస్పీ పాల్‌ను ఎస్పీ దామోదర్ విచారించినట్లు తెలిసింది. అయితే వాళ్ల సమక్షంలో అడిగిన ప్రశ్నలకు పాల్ తెల్లముఖం వేశారు. రఘురామపై జరిగిన కస్టోడియల్ టార్చర్‌ను గుంటూరు సీఐడీ ఆఫీస్‌లో ఫోన్‌లో చిత్రీకరించింది ఎవరు? ఎవరికి చూపించారనే అంశాలను విచారణాధికారి రాబట్టేందుకు ప్రయత్నం చేయగా పాల్ నుంచి తెలియదని సమాధానం వచ్చినట్లు సమాచారం. అదేవిధంగా విజయ్‌పాల్ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న విధంగా పోలీసులు సుమారు 29మందిని విచారించి సాక్ష్యాధారాలను సేకరించారు. రఘురామపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే ముందు నలుగురు వ్యక్తులు మాస్కులు ధరించి సీఐడీ కార్యాలయంలోకి వెళ్లారు. వారు నెంబరు లేని కారులో వచ్చారనేది అక్కడ ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఓ పోలీసు అధికారి చెప్పినట్లు తెలిసింది. ఆ నలుగురు ఎవరు అని అడిగితే పాల్ నుంచి తెలియదని సమాధానం వచ్చింది.

దాటవేత-తెలియదు!

ఇలా శుక్ర, శనివారాల్లో కొనసాగిన విచారణలో విజయ్‌పాల్ నోరు మెదపలేదు. అరెస్టుకు ముందు కూడా విచారణ సమయంలో 'తెలియదు, గుర్తులేదు' అంటూ దాటవేత ధోరణిని ప్రదర్శించిన పాల్.. రెండు రోజుల పోలీసు కస్టడీలోనూ అదేవిధంగా వ్యవహరించారు. గుంటూరు జీజీహెచ్‌లో రఘురామకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ల బృందంపై ఒత్తిడి తెచ్చిందెవరు అనే కోణంలో కూడా దర్యాప్తు సాగుతోంది. రఘురామను వైద్యశాలకు తీసుకెళ్లిన సమయంలో క్యాజువాలిటీలో ఉన్న మెడికల్ ఆఫీసర్ ఆయన ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాల్సి ఉంది. దానికి భిన్నంగా కార్డియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ ఈ రిపోర్టు ఇచ్చారు. ఆయన ఇలా ఎందుకు ఇచ్చారు? ఆయనపై ఎవరు ఒత్తిడి చేశారు? అన్న ప్రశ్నలకు పాల్ నుంచి సమాధానం కరువైంది. జీజీహెచ్‌లో ఇచ్చిన మెడికల్ రిపోర్టులో రఘురామ శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పేర్కొన్నారు. ఆయన్ను కోర్టులో హాజరుపరిచాక గాయాలున్నట్లు న్యాయమూర్తి గుర్తించారు. వాస్తవానికి భిన్నంగా డాక్టర్లు ఇలా మెడికల్ రిపోర్టు ఎందుకు ఇచ్చారని పాల్‌ను ప్రశ్నించగా ఆయన్నుంచి మౌనమే సమాధానమైనట్లు సమాచారం. అయితే, సాక్షుల వద్ద సేకరించిన విషయాల ఆధారంగా విచారణాధికారి కొంత సమాచారం రాబట్టినట్లు తెలిసింది. జీజీహెచ్‌లో అప్పట్లో పనిచేసిన వైద్యులను ప్రలోభపెట్టడం, బెదిరించడం తదితర అవకాశాలున్న నేపథ్యంలో పోలీసులు వారిపై నిఘా ఉంచారు. విజయ్‌పాల్‌ను కోర్టు రెండు రోజులు మాత్రమే కస్టడీకి ఇవ్వడంతో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణ ముగించి గుంటూరుకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం జైలుకు తరలించారు. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న అప్పటి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతికి హైకోర్టు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో ఆమెకు పోలీసులు నోటీసు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉంది.

కాలేజీలకు ఒకే తరహా ఫీజు సరికాదు

- యాజమాన్యాలు పంపిన ఫీజు ప్రతిపాదన వివరాలు కాలేజీల వారీగా పరిశీలించండి
- 2 నెలల్లో 2020-23 మధ్య ఫీజు నిర్ణయించండి
- ఏపీ ఉన్నత విద్య కమిషన్‌కు హైకోర్టు ఆదేశం
- 2020 నాటి జీవో 56ను రద్దు చేసిన కోర్టు



అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో పీజీ వైద్య విద్యా కోర్సులకు సంబంధించి(2020-21 నుంచి 2022-23 వరకు) అప్పటి ప్రభుత్వం ఒకే తరహా ఫీజును ఖరారు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఫీజును ఖరారు చేస్తూ 2020, మే 29న జారీ చేసిన జీవో 56ను రద్దు చేసింది. కళాశాలలు పంపించిన ఫీజు ప్రతిపాదనలను విడివిడిగా పరిశీలించి రెండు నెలల్లో ఆయా కళాశాలలకు ఫీజు నిర్ణయించాలని ఏపీ ఉన్నత విద్య, నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్‌ను ఆదేశించింది. కళాశాలలు ప్రతిపాదించిన ఫీజును కమిషన్ అంగీకరించకపోతే, తుది ఉత్తర్వులు జారీ చేసే ముందు సంబంధిత కాలేజీల యాజమాన్యం నుంచి అభిప్రాయం సేకరించాలని కమిషన్‌కు స్పష్టం చేసింది. కమిషన్ ఫీజు పెంచుతూ నిర్ణయం తీసుకొంటే.. పీజీ వైద్య విద్యార్థుల నుంచి ఆ సొమ్మును రాబట్టుకునేందుకు యాజమాన్యాలకు వెసులుబాటు కల్పించింది. పెరిగిన ఫీజులను చెల్లించాలని విద్యార్థులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో పీజీ వైద్య విద్యా కోర్సుల ఫీజులకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 56ను సవాల్ చేస్తూ ప్రైవేటు మెడికల్ కళాశాలల యాజమాన్యాలు అదే ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. యాజమాన్యాల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. కళాశాలల్లో కల్పించిన మౌలిక వసతులు, ఖర్చులకు సంబంధించి యాజమాన్యాలు పంపిన వివరాలు పరిగణనలోకి తీసుకోకుండానే కమిషన్ ఫీజులు నిర్ణయించిందని తెలిపారు. అన్ని కళాశాలలకు ఒకే తరహా ఫీజులు నిర్ణయించడం సరికాదన్నారు. 2017-18 నుంచి 2019-20 సంవత్సరానికి కన్వీనర్ కోటా క్లినికల్ డిగ్రీ ఫీజు రూ.6.90 లక్షలుగా ఉంటే 2020-21 నుంచి 2022-23 సంవత్సరాలకు రూ.4.32 లక్షలుగా నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జీవోను రద్దు చేయాలని కోరారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.